

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే 90% హామీలు నెరవేర్చి, పింఛన్లు, తల్లికి వందనం, దీపం-2, అన్న క్యాంటీన్లు, ఉపాధ్యాయ నియామకాలతో పాటు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులను ఆదుకుంటోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



గురువారం 04.09.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 140 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


## స్థానిక సంస్థలకు.. సాయం

- ఆదాయార్జన ఆధారంగా పంచాయతీల కేటగిరీ
- ఆర్థిక వనరులు పెంచుకునేలా ప్రత్యేక కార్యాచరణ
- పంచాయతీ రికార్డుల ఆన్‌లైన్‌కు డిప్యూటీ సీఎం సూచన
- 2025-29 కాలానికి రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫార్సులు

3

## టెంపుల్ టౌన్స్ లో.. హోమ్ స్టేలు

- పర్యాటక కేంద్రాల్లో వేగంగా టెంట్ హౌస్ ప్రాజెక్టులు
- పర్యాటక బ్రాండింగ్ కు అరకు కాఫీ, కూచిపూడి, ఎర్రచందనం ఉత్పత్తులు, చేనేత
- రాష్ట్రపతి భవన్ లో ప్రదర్శనకు పురాతన తెలుగు తాళపత్ర గ్రంథాలు

3


# ఏపీలో సరిపడా ఎరువులు

ఫేక్ ప్రచారంతో విషవిత్తనాలు జల్లుతున్నారు

ఎరువుల రవాణాను అడ్డుకుంటూ వైసీపీ డ్రామాలాడుతోంది

రైతుల ముసుగులో వైసీపీ రాజకీయం

సమృద్ధిగా ఎరువుల నిల్వలున్నాయి... ఇంకా వస్తున్నాయి





అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):అన్ని విషయాల్లోనూ ఫేక్ ప్రచారం చేస్తున్న వైసీపీ... ఎరువుల విషయంలోనూ అదే తరహా దుష్ప్రచారాన్ని చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. విషవృక్షం లాంటి వైసీపీ చేసే దుష్ప్రచారాల్లో భాగంగా... మరో ఫేక్ స్టోరీని ప్రచారం చేస్తోందని... యూరియా, ఎరువుల కొరత ఉందని దుష్ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేక్ పార్టీ, నేరాలను నమ్ముకున్న పార్టీ, విషపు విత్తనాలను చల్లుతోందని చంద్రబాబు విమర్శించారు. ఎరువుల లభ్యత.. సరఫరాపై రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లాల వారీగా ఎరువుల సరఫరా లెక్కలను చంద్రబాబు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ఈ ఖరీఫ్ సీజనులో ఓపెనింగ్ బ్యాలెన్సుతో కలిపి 6.65 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశాం. బుధవారం నాటికి 94,892 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంది. ఇది కాకుండా గత 10 రోజుల్లో సుమారు 28 వేల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశాం. వచ్చే 10 రోజుల్లో 30 వేల టన్నులు సరఫరాకు అందుబాటులోకి రానుంది. తాజాగా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి మరో 53 వేల టన్నుల కేటాయింపులు తెచ్చుకున్నాం. సెప్టెంబర్ 12 నుంచి 30వ తేదీ లోపు మరో లక్ష టన్నులు తెచ్చుకుంటాం. అంటే సెప్టెంబర్ నెలఖరు నాటికి 2.71 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులోకి వస్తుంది. రైతులు ఆందోళన చెందవద్దు. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు ఎరువులను సిద్ధం చేస్తాం. వచ్చే రబీ నాటికి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి 9.38 లక్షల టన్నులు కేటాయింపులు ఇప్పటికే చేసుకున్నాం. కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడాను. జిల్లాల్లో అన్ని రిటైల్ షాపుల్లో, ప్రస్తుత నిల్వలు, సరఫరాపై సమీక్ష చేసుకుని అవసరం ఉన్న దగ్గరకు ఎరువులు తరలించాలని చెప్పాం.

మిగతా 2లో...

## లిడ్ క్యాప్ భూముల అభివృద్ధి



- విజయవాడ, తిరుపతిలో మల్టీ పర్పస్ కాంప్లెక్స్ ల నిర్మాణం
- మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):లిడ్ క్యాప్ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడడంతోపాటు వాటిని పీ.పీ.పీ మోడల్ లో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం నాడు అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో లిడ్ క్యాప్ పై అధికారులతో మంత్రి సమీక్షించారు.

మిగతా 2లో...

## అమరజీవి త్యాగం అజరామరం



పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటుకు శంకుస్థాపన

విగ్రహం ఏర్పాటు కేవలం కమిట్మెంట్ మాత్రమే కాదు.. నాకో ఎమోషన్!

ప్రాణత్యాగం చేసి కోట్లాది మంది తెలుగు వారికి దారిచూపిన వ్యక్తి పొట్టి శ్రీరాములు

ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని అనుకున్నది సాధించాలి

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): ప్రాణత్యాగం చేసి కోట్లాది మంది తెలుగువారి దారిచూపిన వ్యక్తి పొట్టి శ్రీరాములు గారని, పొట్టి శ్రీరాములు గారి స్మృతివనం ఏర్పాటుకు అన్ని విధాల సహకారం అందిస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం, అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో అమరావతిలోని తుళ్లూరు-పెదపరిమి మధ్య ప్రభుత్వం కేటాయించిన 6.8 ఎకరాల విస్తీర్ణంలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహంతో పాటు ఆడిటోరియం, స్మృతివనం నిర్మాణానికి మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. అనంతరం అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

మిగతా 2లో...

## యువతకు నైపుణ్య శిక్షణ



కేంద్రప్రభుత్వ ఉద్యోగ అవకాశాల కోసం యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమం

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని నిరుద్యోగ యువతకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఒక కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని... ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం గుంటూరు నగరంలోని లక్ష్మీపురంలో ఉన్న ఎన్ఆర్ఐ కాలేజీ ప్రాంగణంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్ ను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు, మాజీ ఎమ్మెల్సీలు అశోక్ బాబు, ఏ.ఎస్. రామకృష్ణలు ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమం ఉమ్మడి గుంటూరు జిల్లాలో నివసించే నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని... శిక్షణలో చురుకుగా పాల్గొని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు పాటుపడాలని వారు పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వం సుమారు 2.5 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తోందని, అయితే సరైన నైపుణ్య శిక్షణ, అవగాహన లేకపోవడం వల్ల మన యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా యువతకు కేంద్ర ప్రభుత్వ పరీక్షల సరళి, సిలబస్, ఇతర సంబంధిత అంశాలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు ఉద్దేశించినట్లు ఆయన తెలిపారు.

మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు మాట్లాడుతూ, యువత ఎక్కువగా రాష్ట్ర స్థాయి ఉద్యోగాలైన డీఎస్సీ, పోలీస్ ఉద్యోగాలపైనే దృష్టి సారిస్తున్నారని, కానీ కేంద్ర ప్రభుత్వ రంగాలైన డిఫెన్స్,

మిగతా 3లో...

## పోలవరం పనులపై సమీక్ష



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):పోలవరం ప్రాజెక్టు, పోలవరం ఎడమ ప్రధాన కాలువ, పునరావాస పనులపై మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ఇరిగేషన్ స్పెషల్ సెక్రటరీ జి.సాయిప్రసాద్, ఆర్అండ్ఆర్ కమీషనర్ రాంసుందర్ రెడ్డి, అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహామూర్తి, ఆయా ప్రాజెక్టుల ఎస్ఈలు, ఈఈలు, ఏజెన్సీల ప్రతినిధులు మరియు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం, వానాకాలం, భారీ వరదల సమయంలో కూడా డివాటరింగ్ చేస్తూ పోలవరం పనులు కొనసాగుతుండటం

మిగతా 3లో...

## ఉచిత శిక్షణతో.. డీఎస్సీలో విజయం



- మెగా డిఎస్సిలో సత్తా చాటిన మైనారిటీలు
- 152 మంది మైనారిటీలకు ఉపాధ్యాయ ఉద్యోగాలు
- పోటీ పరీక్షలకు హాజరయ్యే మైనారిటీలకు ఉచిత శిక్షణ
- రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):కేంద్ర, రాష్ట్రస్థాయిలో జరిగే వివిధ ఉద్యోగ పోటీ పరీక్షలకు హాజరయ్యే మైనారిటీ అభ్యర్థులకు సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్(సిఈడియం) ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు

మిగతా 2లో...

## పెట్టుబడులకు ఆహ్వానం



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక రంగంలో వివిధ ప్రాజెక్టులు చేపడుతున్న పెట్టుబడిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పూర్తి సహాయ, సహకారాలు అందిస్తుందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ భరోసా ఇచ్చారు. పునరుత్పాదక ఇంధన రంగంలో భారీ ప్రాజెక్టులు చేపడుతున్న రిలయన్స్, యాక్సిస్ ఎనర్జీ, సుజ్లాన్ ప్రతినిధులతో మంత్రి గొట్టిపాటి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో ఆయా కంపెనీల పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. యాక్సిస్ ఎనర్జీ, సుజ్లాన్, రిలయన్స్ కంపెనీలు ఎంఓయూ నిబంధనలకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలన్నారు. ఎంఓయు ప్రకారం అనుకున్న సమయానికి ప్రాజెక్టులు పూర్తి చేసే బాధ్యత సదరు కంపెనీలదే అని మంత్రి స్పష్టం చేశారు. ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణలో స్థానిక యువతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అదే విధంగా ప్రస్తుతం జరుగుతున్న పనులలోనూ ఎక్కువ మంది స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని సూచించారు. దీనికి అవసరమైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తరించాలని వెల్లడించాలన్నారు. నిబంధనలను కచ్చితంగా పాటించాలని, పారదర్శకతతో పనులు చేయాలని కంపెనీలను ఆదేశించారు. ప్రాజెక్టుల సత్వర అనుమతుల కోసం ఇప్పటికే పారదర్శకమైన సింగిల్ విండో విధానాన్నిప్రభుత్వం తీసుకొచ్చిందని మంత్రి గుర్తు చేశారు. రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలను మరింత

మిగతా 2లో...

### నాణ్యమైన విద్యుత్ సరఫరా

ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేయండి

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

మిగతా 7లో...



## అమరావతి .. సేఫ్ సిటీ!

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):అమరావతి అత్యంత సురక్షితమైన రాజధాని అని మరోసారి స్పష్టం చేసారు మంత్రి నారాయణ..కొంతమంది పనిగట్టుకుని మరీ అమరావతిపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అసలు అమరావతిలో ఎలాంటి పనులేమీ జరగడం లేదని గ్రాఫిక్స్ మాత్రం చూపిస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని ప్రజలు క్షమించరని అన్నారు...ఇలా ప్రచారం చేస్తున్న వారు క్షేత్ర స్థాయికి వచ్చి పరిస్థితిని చూడాలని హితవు పలికారు...రాజధానిలోని నేలపాడులో నిర్మాణంలో ఉన్న గెజిటెడ్ ఆఫీసర్స్ టైప్-1, టైప్-2 భవనాలతో పాటు గ్రూప్ - డి ఉద్యోగుల భవనాలను మంత్రి నారాయణ పరిశీలించారు. ప్రస్తుతం పనులు ఏ దశలో ఉన్నాయి.

మిగతా 3లో...

## రైతు శ్రమ వృధా కానివ్వొద్దు



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలో రైతులు పండించిన నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని, సెప్టెంబర్ నెలాఖరకు నల్ల బర్లీ పొగాకు కొనుగోళ్లు పూర్తి అవ్వాలని మార్క్ ఫెడ్ అధికారులను వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. బుధవారం వెలగపూడి సచివాలయంలోని ఐదవ బ్లాక్ లో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల ఉన్నతాధికారులతో పొగాకు, ప్రత్తి కొనుగోళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రైతు శ్రమ వృథా కాకుండా, మార్కెట్‌లో సమయానికి పంట కొనుగోళ్లు జరిగేలా ప్రభుత్వ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. రైతు ప్రయోజనం దృష్టిలో పెట్టుకుని పారదర్శకంగా కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వాణిజ్య కేంద్రాల్లో ఎటువంటి అవినీతి, ఇబ్బందులు చోటుచేసుకోకుండా ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను నియమించామని, రైతు శ్రేయస్సే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

రాష్ట్రంలో నల్లబర్లీ పొగాకును 80 మిలియన్ కిలోలు పండించటం జరిగిందని, ఇప్పటివరకు 22 కంపెనీలు 40 మిలియన్ కిలోలు కొన్నారని, అదే విధంగా 15 మిలియన్ కిలోలు ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు జరిగిందని తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 55 మిలియన్ కిలోలు కొనడంతో ఇంకా 20 మిలియన్ కిలోలు ప్రయివేట్ కంపెనీ వారు

మిగతా 3లో...

## సంపాదకీయం

### భారత్ వైఖరిపై అమెరికా విమర్శలు

# సహేతుకమా?

భారత్–చైనా–రష్యా కలయికపై అమెరికా ఇటీవల చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశమయ్యాయి. ప్రపంచ శక్తుల సమీకరణ మారుతున్న ఈ తరుణంలో, అమెరికా చేసిన విమర్శలు ఎంతవరకు సహేతుకమో అన్వేషణ అవసరం. భారత్, చైనా, రష్యా వంటి దేశాల మధ్య సంభాషణ, సహకారం అంతర్జాతీయ వేదికలపై కొత్తది కాదు. ముఖ్యంగా వాణిజ్యం, ఇంధన భద్రత, భౌగోళిక రాజకీయ సమతుల్యత కోసం ఈ దేశాలు అప్పుడప్పుడూ కలిసే వేదికలు పంచుకోవడం సహజమే. కానీ ఈ తరహా చర్చలపై అమెరికా వైపు నుంచి వస్తున్న విమర్శలు సహేతుకత కోల్పోతున్నాయి.

మొదటగా గమనించాల్సింది ఏమిటంటే – భారత విదేశాంగ విధానం ఎప్పుడూ స్వతంత్రత, సమతుల్యత ఆధారంగా సాగుతుంది. "స్ట్రాటజిక్ ఆటానమీ" అనేది స్వాతంత్ర్యం తర్వాత భారత్ అనుసరిస్తున్న ప్రధాన విధానం. అమెరికా మిత్రదేశం అయినప్పటికీ, భారత్ తన జాతీయ ప్రయోజనాలను బట్టి రష్యాతో, చైనాతో సంభాషణ కొనసాగించడం సహజం. ప్రపంచ రాజకీయాల్లో భారత్ ఒక కీలక శక్తి. తన అవసరాల ప్రకారం, తన ప్రజల ప్రయోజనాల కోసం ఎవరితోనైనా సంభాషించగల హక్కు భారత్‌ది. అమెరికా మైత్రి అవసరమే కానీ, అది భారత్ స్వతంత్ర విదేశాంగ నిర్ణయాలను అడ్డుకోవడానికి కారణం కావొద్దు.

రష్యా విషయంలో భారత్‌కి రక్షణ, ఇంధన రంగాలలో దీర్ఘకాల అనుబంధం ఉంది. చైనా విషయంలో సరిహద్దు వివాదాలు ఉన్నప్పటికీ, వాణిజ్యం, ప్రాంతీయ సమతుల్యత దృష్ట్యా పరస్పర సంభాషణ తప్పనిసరి. ఈ వాస్తవాలను పక్కన పెట్టి అమెరికా భారత్‌పై విమర్శలు చేయడం, ఏకపక్షత, ఆధిపత్యం ప్రతిబింబమే. భారత్–చైనా సంబంధాలు సరిహద్దు వివాదాల కారణంగా కఠినంగా ఉన్నా, ఆర్థిక–ప్రాంతీయ వాస్తవాలను పక్కన పెట్టి చూడలేం. రష్యా విషయంలోనూ అదే. రక్షణ రంగంలోనూ, ఇంధన భద్రతలోనూ రష్యా సహకారం భారత్‌కు అవసరం. ఈ నేపథ్యంలో భారత్ ఈ రెండు దేశాలతో చర్చించడం, మైత్రి వేదికల్లో పాల్గొనడం అనివార్యమని చెప్పాలి.

మరో కోణం ఏమిటంటే, అమెరికా తనకు అనుకూలంగా ఉంటే ఏకపక్ష పాలనలను కూడా చేర్చుకుంటుంది, అవసరం లేని దేశాలను "వైరి"గా ముద్ర వేస్తుంది. ఇరాక్ నుండి ఆఫ్ఘనిస్తాన్, సిరియా వరకు అమెరికా ద్వంద్వ వైఖరికి ప్రపంచమే సాక్షి. అలాంటి దేశం భారత్‌కి ఉపదేశాలు చెబితే, అది స్నేహం కాదు – బలవంతపు ఆధిపత్యం మాత్రమే. అమెరికా యొక్క ద్వంద్వ వైఖరి ప్రపంచానికి తెలిసినదే. అయితే, భారత్ అలాంటి విధానం కాకుండా, సమతుల్యతతో, పారదర్శకంగా తన సంబంధాలను ముందుకు తీసుకువెళ్తుంది.

ప్రధాని మోడి తరచూ చెబుతున్న "విశ్వ గురు" భావనలో భారత్ స్థానాన్ని అర్థం చేసుకోవాలి. భారత్ ఎవరి శత్రువుగా నిలబడదు, ఎవరి శిబిరంలో పూర్తిగా లీనమవదు. స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడం, సమగ్ర సహకారాన్ని కొనసాగించడం – ఇవే భారత్ లక్ష్యాలు.

అందువల్ల, అమెరికా విమర్శలు అసలు సిసలైన సమస్యలను పరిష్కరించవు. మిత్రదేశంగా అమెరికా చేయాల్సింది భారత్ స్వతంత్ర నిర్ణయాలను గౌరవించడం. భారత్‌కి అవసరమయ్యేది గౌరవప్రదమైన భాగస్వామ్యం, వశీకరణ కాదు.

- అజయ్ చంద్ర, ఎడిటర్, జర్నలిస్ట్ ఫైల్

## లిడ్ క్యాప్ భూముల అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమీక్షలో తిరుపతి, విజయవాడలో మల్టీపర్పస్ కమర్షియల్ కాంప్లెక్స్ ల నిర్మాణంపై మంత్రికి అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా తిరుపతి ఎస్వీ ఆటో నగర్ లోని 4.5 ఎకరాలు, విజయవాడ ఆటో నగర్ లో 1 ఎకరా లిడ్ క్యాప్ సలాల్లో మల్టీ పర్పస్ కమర్షియల్ కాంప్లెక్స్ ల నిర్మాణం చేసే అంశంపై సమీక్షలో సుదీర్ఘంగా చర్చించారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించి విధి, విధానాలు రూపొందిస్తామని మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఈ సమీక్షలో లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ ఎం. ఎం. నాయక్, లిడ్ క్యాప్ ఎండీ ప్రసన్న వెంకటేష్, ఈడీ టీవీఎస్ ప్రసాదరావు,సునీల్ రాజ్ కుమార్, లిడ్ క్యాప్ మేనేజన్ అధికారి తదితరులు పాల్గొన్నారు.


## ఉచిత శిక్షణతో.. డీఎస్సీలో విజయం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. మెగా డి ఎస్ సి లో సిఈడిఎం ద్వారా శిక్షణ తీసుకొని 152 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైనట్లు బుధవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అల్పసంఖ్యాక వర్గాల అభ్యున్నతి కోసం1994లో తెలుగుదేశం ప్రభుత్వం సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సిఈడియం) ను స్థాపించడం జరిగిందని అన్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం రాష్ట్రంలో కర్నూలు, గుంటూరు, విశాఖపట్నం లలో మూడు ప్రాంతీయ కార్యాలయాలు కూడా నిర్వహించబడుతున్నాయ ని పేర్కొన్నారు. మైనారిటీ సంక్షేమ శాఖ నేతృత్వంలో కేంద్ర స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో భర్తీ చేసే ఉద్యోగాలకు జరగబోయే పోటీ పరీక్షల కోసం సంసిద్ధమయ్యే మైనారిటీ విద్యార్థులకు ప్రముఖ కోచింగ్ సెంటర్లలో ఉన్న నైపుణ్యమైన సిబ్బంది ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి విడుదల చేసిన మెగా డిఎస్సీ పరీక్షలకు సిఈడిఎం పర్యవేక్షణలో 1780 మంది మైనారిటీ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇందులో 1200 మందికి పైగా అభ్యర్థులు అర్హత మార్కుల కంటే ఎక్కువ మార్కులు సాధించడం జరిగిందన్నారు. ఉచిత శిక్షణను సమర్థవంతంగా వినియోగించుకుని, విజయం సాధించిన 152 మంది మైనారిటీ అభ్యర్థులు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో విద్యార్హత ధ్రువపత్రాల పరిశీలన కు హాజరై ఉద్యోగాల్లో చేరేందుకు సిద్ధం గా ఉన్నారని మంత్రి ఫరూక్ వెల్లడించారు. సిఈడిఎం ద్వారా ఉచిత శిక్షణను వినియోగించుకొని విజయం సాధించి ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన 152 మందికి మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో త్వరలో సన్మానించబోతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సిఈడియం ను మరింత సమర్ధవంతం గా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలను కార్యాచరణ బద్ధంగా అమలు చేస్తున్నట్టు తెలిపారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఎక్కువ మందికి సులభంగా సేవలు చేరేందుకు, ఆన్ లైన్ లో కూడా శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమానికి, ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వము కట్టుబడి ఉందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

# ఏపీలో సరిపడా ఎరువులు

(మొదటి పేజీ తరువాయి)



డిమాండ్ ఉన్న జిల్లాలకు మార్క్ ఫెడ్ ద్వారా ఎరువులు తరలించి రైతులకు సరఫరా చేస్తాం. పొరుగు రాష్ట్రాల సరిహద్దుల్లో గట్టి నిఘా పెట్టి ఎరువులు పక్కదారి పట్టకుండా చూడమని చెప్పాం." అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**ఫేక్ ప్రచారం చేస్తే తీవ్ర పరిణామాలు :** సోషల్ మీడియాలో వివిధ అంశాలపై జరుగుతున్న ఫేక్ ప్రచారాలపై ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించారు. "డ్రామాలు ఆడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. దుష్ప్రచారం చేసే వారిని జైలుకు పంపుతాం. యూరియా విషయంలో కృష్ణా జిల్లాలో వైసీపీకి చెందిన ఎర్రా వాసు, రామ్మూర్తి, చిలీ వెంకటేశ్వరరావు, ఈశ్వరరావు తదితరులు కుట్రపూరితంగా వ్యవహరించారు. ఎరువుల లారీని హైజాక్ చేసే ప్రయత్నం చేశారు. రాష్ట్రంలో కొందరు క్రిమినల్స్ ఎరువుల విషయంలో దుష్ప్రచారం చేస్తున్నారు. ఫేక్ రాజకీయాలు చేసినా, సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం చేసినా తీవ్ర పరిణామాలు ఉంటాయి. అన్ని జిల్లాల్లో ఎంతెంత స్టాక్ ఉందో... ఏయే దుకాణాల్లో ఎంత నిల్వలున్నాయనే వివరాలు కూడా ప్రభుత్వం దగ్గర ఉన్నాయి. తప్పుడు ప్రచారం చేసి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తే ఊరుకోం. ప్రభుత్వాన్ని అప్రదిష్ట పాల్జేయడానికి ప్రయత్నిస్తే కఠినంగా వ్యవహరిస్తాం. ప్రస్తుతం రైతులు ఎక్కడెక్కడ ఎంత యూరియాను వినియోగిస్తున్నారో లెక్కలు తీసి మీడియాకు ఇస్తాం. రైతుల ముసుగులో వైసీపీ కార్యకర్తలు రాజకీయం చేస్తే ఖబడ్దార్ అని హెచ్చరిస్తున్నా. నేరాలు ఘోరాలు చేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కుప్పంలో నీరిస్తే... నీళ్లు లేవని ప్రచారం చేశారు. పులివెందులకు మేం నీరిస్తే... వైసీపీ వాళ్లు వెళ్లి... తామే ఇచ్చినట్టుగా హారతులిచ్చారు. సోషల్ మీడియా ఉంది కదా అని తప్పుడు వార్తలు రాస్తే చూస్తూ ఊరుకోం. స్టీల్ ప్లాంట్ కు రూ. 12 వేల కోట్లు కేంద్రం నిధులిచ్చి ఆదుకుంటే పేటీఎం బ్యాచ్ ద్వారా కొందరు రాజకీయాలు చేస్తున్నారు. ఉద్యోగుల వయో పరిమితి విషయంలో ఫేక్ జీవో సృష్టించి ఫేక్ ప్రచారం చేశారు. పేటీఎం బ్యాచ్ తప్పుడు పోస్టులు చేసి.. ఆందోళన కలిగించి.. రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తే తాట తీస్తాం. కావాలని అలజడులు సృష్టిస్తే జైలుకు పంపుతాం. మొన్నటి వరకు మహిళల పైనా.. నిన్న రాజధాని పైనా.. ఇప్పుడు రైతులను తప్పుదోవ పట్టించేలా చేస్తున్నారు. ఇలాంటి వారిని ఖచ్చితంగా నియంత్రిస్తాం." అని సీఎం అన్నారు.

**భ్రమల్లో ఉంటారు... భ్రమలు కల్పిస్తారు :** "అవాస్తవాలను కూడా వాస్తవమని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. హెరిటేజ్ అవుట్ లెట్లే లేవు. అయినా హెరిటేజ్ దుకాణాలు ఉన్నాయంటూ విష ప్రచారం చేస్తూ... విచిత్రమైన వింత జీవుల్లా వ్యవహరిస్తున్నారు. ఊహాగానాల్లో బతికేస్తున్నారు. ఏం చెప్పినా... ప్రజలు నమ్మేస్తారని వైసీపీ అనుకుంటోంది. వాళ్లను చూస్తుంటే జాలి వేస్తుంది. విలువల్లేని వ్యక్తులు రాజకీయాల్లో ఉన్నప్పుడు... ఇలాంటి సమస్యలే వస్తాయి. వాళ్లు దుష్ప్రచారం చేస్తుంటే... మేం వాటిని సరిచేస్తూ కూర్చోవాలా..? అసెంబ్లీకి వచ్చి సమస్యలపై చర్చించమంటే... ప్రతిపక్ష హోదా ఇవ్వాలని అంటున్నారు. వీరికి అసలు బుద్ధుందా..? ప్రజలిచ్చిన సీట్లతోనే ప్రతిపక్ష హోదా వస్తుంది. ఆ హోదాకు కూడా తగరనే వైసీపీకి 11 సీట్లు ఇచ్చారు. ప్రతిపక్షం కావాలంటే అసెంబ్లీలో 18 సీట్ల సంఖ్యాబలం ఉండాలని తెలియదా..? ఓట్లేయలేదని ప్రజలపై కక్ష పెట్టుకున్నట్టు వ్యవహరిస్తున్నారు. కోడి కత్తి, గొడ్డలివేటు, గుండెపోటు, గులకరాయి డ్రామాలతో పాటు... ఎరువులిస్తున్నా ఇవ్వడం లేదని ఫేక్ డ్రామాలు ఆడుతున్నారు." అని చంద్రబాబు విమర్శించారు.

**త్వరలో రైతులతో సమావేశం :** "దుష్ప్రచారంతో రెచ్చగొడుతూ... రైతులను రోడ్డున పడేస్తున్నారు. వీరి రాజకీయ ఉచ్చులో రైతులు పడొద్దు. త్వరలోనే రైతులతో సమావేశం నిర్వహిస్తాం... వాస్తవాలు వివరిస్తాం. గత ప్రభుత్వ హయాంలో రైతుల ఆత్మహత్యలు జరిగేవి. నీళ్లు లేక, పెట్టుబడి సాయం అందక, ఆదుకునే వారు లేక.. నిస్పృహతో రైతులు ఆత్మహత్యలు చేసుకునేవారు. కూటమి అధికారంలోకి వచ్చాక... రైతుల మీద ఒత్తిడి తగ్గింది. అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం అందిస్తున్నాం. వ్యవసాయానికి కావాల్సిన నీళ్లను సమృద్ధిగా సరఫరా చేస్తున్నాం. పంటలు పండేందుకు కావాల్సిన అన్ని రకాల వసతులు కల్పిస్తున్నాం. అందుకే రైతుల ఆత్మహత్యలు ఇప్పుడు లేవు. రైతులకు మంచి చేస్తుంటే... వైసీపీ ఓర్వలేకపోతోంది. ఏ కారణాల వల్లనైనా పంటలకు సరైన ధర లేకపోతే ప్రభుత్వం తరపున ఆదుకుంటున్నాం. అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధర వచ్చేలా చూస్తున్నాం. వాణిజ్య పంటలకు మార్కెటింగులో ఇబ్బందులు రాకుండా చూస్తున్నాం. తాజాగా కాఫీ పంటకు బెర్రి బోరర్ తెగులు వచ్చింది. ఇది మరింత విస్తరించకుండా చర్యలు చేపట్టాం. తెగులు సోకిన పంటను ధ్వంసం చేసి రైతులకు తగినంత పరిహారం ఇస్తున్నాం. ఈ సందర్భంగా రైతులకు ఓ విజ్ఞప్తి. తెలియక ఎక్కువ పురుగు మందులు వినియోగిస్తున్నారు. పురుగు మందుల వినియోగం ఎక్కువగా జరిగితే... మన పంటలు కొనుగోలు చేసే పరిస్థితి ఉండదు. తిండి, వాతావరణం కూడా కలుషితం అవుతుంది. ఆర్గానిక్ పంటలే రైతులకు లాభాదాయకం." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# అమరజీవి త్యాగం అజరామరం



(మొదటి పేజీ తరువాయి)



జ్యోతి ప్రజ్వలన చేశారు. పొట్టి శ్రీరాములు గారిపై రూపొందించిన ఏవీని వీక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మంత్రి లోకేష్ ప్రసంగిస్తూ.. వాసవీమాతాకి జై. మహాత్మాగాంధీ గారు దేశానికి స్వాతంత్ర్యం సాధిస్తే.. పొట్టి శ్రీరాములు గారు తెలుగుజాతికి గుర్తింపు సాధించిన వ్యక్తి. గాంధీ గారిని ఫాదర్ ఆఫ్ నేషన్ అంటే.. పొట్టి శ్రీరాములు గారిని ఫాదర్ ఆఫ్ లింగ్విస్టిక్ స్టేట్స్ అంటారు. కొన్నిదీపాలు వెలుగునిస్తాయి. కొన్ని దీపాలు దారిచూపిస్తాయి. ప్రాణత్యాగం చేసి కోట్లాది మంది తెలుగు ప్రజల కోసం దారిచూపించిన దీపం పొట్టి శ్రీరాములు గారు. ఈ రోజు ఆయన 58 అడుగుల విగ్రహం ఏర్పాటుకోసం మనందరం శంకుస్థాపన చేసేందుకు వచ్చాం. విగ్రహంతో పాటు ఆడిటోరియం, మెమోరియల్, మ్యూజియం, మినీ థియేటర్ ను 6.8 ఎకరాల్లో మన అమరావతి ప్రజా రాజధానిలో ఏర్పాటుచేసేందుకు ఇక్కడకు విచ్చేశాం.

**పొట్టి శ్రీరాములు గారి ప్రాణత్యాగం వల్లే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది :** కేవలం విగ్రహం ఏర్పాటు మాత్రమే కాకుండా.. మొత్తం ప్రాజెక్టు పూర్తిచేసే బాధ్యత తీసుకోవాలని దూండి రాకేష్‌ను కోరుతున్నా. 58 అడుగుల విగ్రహం ఎందుకు అని మనం అనుకోవచ్చు. దీనివెనుక చరిత్ర ఉంది. పొట్టి శ్రీరాములు గారు భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేశారు. ఆయన ప్రాణత్యాగం వల్లే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. దీంతో పాటు నెహ్రూ గారు ఫజల్ అలీ కమిషన్ ఏర్పాటుచేశారు. ఆ కమిషన్ వల్ల తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు కూడా ఏర్పడ్డాయి. పొట్టి శ్రీరాములు త్యాగం వల్ల ఒక్క ఆంధ్ర రాష్ట్రమే కాకుండా భాషా ప్రయుక్త రాష్ట్రాలు మనదేశంలో ఏర్పడ్డాయి.

**సమాజంలో మార్పు కోసం అహర్నిశలు పోరాడారు :** ఆయన ఆమరణ నిరాహార దీక్ష వల్ల దేశంలోనే పెను మార్పులువచ్చాయి. ఆయన కేవలం భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసమే పోరాడలేదు. సమాజంలో మార్పు కోసం అహర్నిశలు పోరాడారు. మన దళిత సోదరులు ఆలయ ప్రవేశం కోసం పోరాడారు. వివిధ సామాజిక అంశాలపై ఐదు సార్లు నిరాహార దీక్షలు చేశారు. ఆయన ఏకంగా సబర్మతి ఆశ్రమానికి వెళ్లి గాంధీ తాత దగ్గర నుంచి అహింసను ఆయుధంగా చేసుకున్నారు. గాంధీ తాతనే పొట్టి శ్రీరాములు లాంటివారు పది మంది ఉంటే చాలు.. దేశానికి స్వాతంత్ర్యం ఒక్క ఏడాదిలోనే వచ్చేదని చెప్పారు.

**నమ్ముకున్న సిద్ధాంతం కోసం జీవితం త్యాగం చేసిన వ్యక్తి పొట్టి శ్రీరాములు**

నాలా లాంటి చాలా మంది మార్కుల కోసం పొట్టి శ్రీరాములు గురించి పాఠ్యాంశాల్లో చదువుకున్నాం. కానీ ఆయన చేసిన కార్యక్రమాల వెనుక ఎంతో ఆలోచన, త్యాగం ఉందని గమనించాలి. మనం చాలా నేర్చుకోవాల్సి ఉంది. నమ్ముకున్న సిద్ధాంతం కోసం జీవితం త్యాగం చేశారు. ఈ రోజు ఒక్క మార్కు తక్కువ వస్తే ఆత్మహత్యలు చేసుకునే రోజులు. పొట్టి శ్రీరాములు గారి దగ్గర నుంచి పట్టుదల, కమిట్ మెంట్ నేర్చుకోవాలి. మనం ఏదైనా సాధించాలనుకుంటే తొలి అడుగు వేస్తే సమాజం మొత్తం మన వెనుక ఉంటుంది. ఇప్పుడు ప్రదర్శించిన వీడియోలో చూశాం. ఆయన దీక్షకు కూర్చొన్నప్పుడు చాలామంది రాలేదు. ఎప్పుడైతే ఆయన ఆరోగ్యం క్షీణించడం మొదలుపెట్టిందో ఆంధ్ర రాష్ట్రం మొత్తం ఆయన వెనుక వచ్చింది. చివరకు అంత్యక్రియలకు కూడా ఎవరినీ రానివ్వకుండా చేస్తే ఆనాటి పెద్దలు చేసే పరిస్థితి.

**పొట్టి శ్రీరాములు గారిని స్ఫూర్తిగా తీసుకుని అనుకున్నది సాధించాలి :** ఇన్ని దశాబ్దాలైనా ఈ రోజు ఆయన్ను గుర్తుచేసుకుంటున్నామంటే.. ఆయన చేసిన త్యాగం వల్లే. మనం ఏ కార్యక్రమం చేసిన ఆయన్ను గుర్తుచేసుకోవాలి. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని మనం అనుకున్నది సాధించాలి. పొట్టి శ్రీరాములు గురించి మాట్లాడుకుంటున్నప్పుడు ఆర్యవైశ్య సామాజిక వర్గం నుంచి కొణిజేటి రోశయ్య గారు నాకు గుర్తుకువస్తారు. రోశయ్య తాత ఎప్పుడైతే గవర్నర్ అయ్యారో ఏడాదికోసారి ఆయనతో మాట్లాడేవాడిని. రాజకీయాల్లో మీరు లేని లోటు తెలుస్తోందని ఆయనతో చెప్పా. మిమ్మల్ని చూసి పెరిగానని, ఏవిధంగా అసెంబ్లీలో పోరాడారో.. రాజశేఖర్ రెడ్డి గారికి, చంద్రబాబు గారికి మధ్య యుద్ధం జరుగుతుందంటే ఒక్కమాటతో దానిని చల్లబరిచేవారు, అది మీ గొప్పతనం, రాజకీయాల్లో ఇప్పుడు లేకుండా పోయిందని చెప్పాను.

**పొట్టి శ్రీరాములు గారి చరిత్రపై రీసెర్చ్ చేయాల్సిన అవసరం ఉంది :** రాష్ట్రం కోసం చాలా మంది పనిచేశారు. వారిని మనం గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ రోజు స్మృతివనం ద్వారా మనం కేవలం వీడియోస్, ఫోటోస్ మాత్రమే కాకుండా ఒక చైయిర్ కూడా ఏర్పాటుచేసి పొట్టి శ్రీరాములు గారు సమాజానికి ఏవిధంగా పనిచేశారో, దానిపై రీసెర్చ్ చేయాల్సిన అవసరం ఉంది. దానికి వేదికపై ఉన్న పెద్దల సహకారం కోరుతున్నా. ఇప్పుడు ప్రదర్శించిన వీడియోలో పెద్దగా ఫోటోలు లేవు. ఆయన ఫోటోలన్నీ సేకరించాలి. లైబ్రరీ నుంచి బుక్స్ తీసుకువచ్చి వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. స్మృతివనం నిర్మించడమే కాదు.. ఒక చైయిర్ ఏర్పాటుచేసి ఆయన చరిత్రపై రీసెర్చ్ కూడా చేయాల్సిన అవసరం ఉంది.

**విగ్రహం ఏర్పాటు కేవలం కమిట్మెంట్ మాత్రమే కాదు.. నాకో ఎమోషన్!**

పాదయాత్ర చేస్తున్నప్పుడు అమరావతిలో పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటుచేయాలని ఆర్యవైశ్య సోదరులు కోరారు. అప్పుడే హామీ ఇవ్వడం జరిగింది. ఇది కమిట్ మెంట్ మాత్రమే కాదు.. ఇది నాకో ఎమోషన్. చేయాలనే తపన. పాదయాత్రలో మిమ్మల్ని కలిసిన తర్వాతనే ఆయన గురించి తెలుసుకున్నాను. అందుకే ఒక ఎమోషన్ తో మేం అందరం పనిచేస్తున్నాం. అన్నిరకాలుగా ట్రస్ట్ కు మేం సహకరిస్తాం, నిలబడతాం. కలిసికట్టుగా ముందుకు వెళ్లి ఎవరూ ఊహించనట్లుగా అద్భుతమైన స్మృతివనం ఏర్పాటుచేయాలని కోరుకుంటున్నాను. అమర్ రహే పొట్టి శ్రీరాములు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్ మాట్లాడుతూ.. అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం ప్రతిష్టించాలని, ఆడిటోరియం నిర్మించాలని చంద్రబాబు గారిని, మంత్రి నారా లోకేష్ ను కోరిన వెంటనే అంగీకరించారు. ఆ బాధ్యతను మంత్రి నారాయణ గారు మీద వేసుకుని సీఆర్డీయే అధికారులతో మాట్లాడి స్థలం కేటాయించారు. వాసవీ కన్యాకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరితే చంద్రబాబు గారిని ఒప్పించి, పెనుగొండ పంపించి పట్టువస్త్రాలు సమర్పించిన ఘనత ఎన్డీయే కూటమిది. పొట్టి శ్రీరాములు గారి కాంస్య విగ్రహం కోసం అమరావతి నడిబొడ్డున 6.8 ఎకరాల స్థలం కేటాయించారు. రాబోయే మార్చి 16న 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని మంత్రి నారా లోకేష్ గారితో ఆవిష్కరింపజేస్తామని మాట ఇస్తున్నా.

మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ... మంత్రి లోకేష్ గారు గేమ్ చేంజర్. పొట్టి శ్రీరాములు గారి విగ్రహాన్ని ఆవిష్కరించాలని రాకేష్ గారికి ఆలోచన రావడం గొప్ప విషయం. ఇందుకు ధన్యవాదాలు. మా టీజీవీ గ్రూప్ తరపున మొదటి విరాళం రూ.కోటి అందిస్తున్నాం. ఇతర ఏ సహకారం కావాలన్నా అందిస్తాం. గత ఎన్నికల్లో 95 శాతం మంది ఆర్యవైశ్యులు కూటమికి ఓటేశారు. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేనివిధంగా నాకు కూడా మంచి శాఖ కేటాయించి గుర్తింపు ఇచ్చారు.

మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ.. హరిజనుల కోసం పొట్టి శ్రీరాములు గారు ఉద్యమాలు చేశారు. 58 రోజుల పాటు నిరాహార దీక్ష ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేశారు. అలాంటి వ్యక్తికి విగ్రహం ఏర్పాటుచేయాలని లోకేష్ గారు సీఎం గారికి చెప్పగా వెంటనే ఆదేశాలు జారీ చేయడం జరిగింది. 6.8 ఎకరాలు కేటాయిస్తూ నిర్ణయం తీసుకోవడం జరిగింది. 2026 మార్చి 16 నాటికి స్మృతివనం నిర్మాణం పూర్తిచేస్తామని చెబుతున్నారు. సీఆర్డీయే తరపున అన్ని విధాల సహకారం అందిస్తాం.

అనంతరం పొట్టి శ్రీరాములు వారసులు నలుగురిని స్టేజి పైకి ఆహ్వానించి మంత్రి లోకేష్ వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. శంకుస్థాపన కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంత్రి లోకేష్ కు రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్ పొట్టి శ్రీరాములు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పి.నారాయణ, టీజీ భరత్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడులకు ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)



మెరుగు పరిచేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలోనే అర్హులైన వారికి నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని మంత్రి గొట్టిపాటి తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు దూరదృష్టితో పునరుత్పాదక రంగంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని చెప్పారు.

**గత ప్రభుత్వ విధానంతో భారీగా నష్ట పోయామన్న కంపెనీలు... :** సమీక్ష సందర్భంగా కంపెనీల ప్రతినిధులు పలు అంశాలను మంత్రి గొట్టిపాటి దృష్టికి తీసుకు వచ్చారు. వైసీపీ ప్రభుత్వ విధానంతో గత ఐదేళ్లలో భారీగా నష్ట పోయామని మంత్రికి తెలిపారు. భూ సేకరణలో ఎదురువుతున్న సమస్యలను వివరించారు. కూటమి ప్రభుత్వ మద్ధతుతో రాబోయే మూడేళ్లలోనే సోలార్, విండ్, సీబీజీ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని వివరణ ఇచ్చారు. అదే విధంగా పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించి రాష్ట్రంలోని యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సదరు కంపెనీల ప్రతినిధులు వెల్లడించారు. యాక్సిస్ ఎనర్జీ ప్రతినిధులు మాట్లాడుతూ., బ్రుక్‌ఫీల్డ్‌తో కలిసి ఏర్పాటు చేసిన ఎవ్రెన్ ప్లాట్‌ఫారమ్ ద్వారా 3,000 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన సోలార్ ప్రాజెక్టుల పనులను ప్రారంభించామని తెలిపారు. సుమారు రూ.30,500 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టి, 3,500 ఉద్యోగాలను సృష్టించేందుకు కట్టుబడి ఉన్నామని సదరు ప్రతినిధులు మంత్రికి స్పష్టం చేశారు. అనంతరం సుజ్లాన్ ప్రతినిధులు మాట్లాడుతూ., అనంతపురం జిల్లా కుదేరు యూనిట్‌లో అధిక సామర్థ్యం కలిగిన గాలిమర టర్బైన్ల తయారీకి ప్లాంట్‌ను అప్‌గ్రేడ్ చేశామని చెప్పారు. దీని వలన ప్రస్తుతం 1,200 మందికి ఉపాధి కల్పించామని వెల్లడించారు. ప్రతి సంవత్సరం మరో 500 ఉద్యోగాలను సృష్టించే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రూ.12,000 కోట్లు పెట్టుబడులు పెట్టి., 1,375 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన విండ్ ప్రాజెక్టులు పూర్తి చేశామన్నారు. విండ్ టర్బైన్ల తయారీలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా దేశంలోనే అతి పెద్ద గ్రీన్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించామని సుజ్లాన్ ప్రతినిధులు మంత్రి గొట్టిపాటికి వివరించారు. విండ్ అనుకూల ప్రాంతాల్లో సోలార్ ప్రాజెక్టుల అనుమతులపై సమీక్షించాలని మంత్రిని కోరారు.

**రిలయన్స్ సీబీజీ ప్లాంట్ల ఏర్పాటుతో 2.50 లక్షల మందికి ఉపాధి :** రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న సీబీజీ ప్లాంట్ల పురోగతిపై రిలయన్స్ ప్రతినిధులతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ... సకాలంలో ప్లాంట్ల నిర్మాణం పూర్తి చేసి, స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని అన్నారు. రైతులకు లాభదాయకమైన కౌలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తొలిదశలో ప్రకాశం, నెల్లూరు, పల్నాడు జిల్లాల్లో సీబీజీ ప్లాంట్ల నిర్మాణం జరుగుతుందని, అనంతరం అన్నమయ్య, కడప జిల్లాల్లో కూడా ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనే రిలయన్స్ సంస్థ రూ.65 వేల కోట్ల భారీ పెట్టుబడులతో సీబీజీ ప్లాంట్లు పెట్టేందుకు ముందుకు వచ్చిందని మంత్రి గొట్టిపాటి తెలిపారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. మొత్తం 500 సీబీజీ ప్లాంట్ల ద్వారా రాష్ట్రంలో సుమారు 2.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని స్పష్టం చేశారు. ఉపయోగంలో లేని ప్రభుత్వ భూమికి ఎకరాకు రూ. 15 వేల కౌలు, రైతుల భూములకు ఎకరాకు రూ. 31 వేల కౌలు రూపంలో ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఇంధన శాఖకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

# యువతకు నైపుణ్య శిక్షణ



(మొదటి పేజీ తరువాయి)

బ్యాంకింగ్, రెవెన్యూ, రైల్వే, సాంకేతిక, ఇతర రంగాల్లో అపారమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం యువతకు ఈ అవకాశాల గురించి తెలియజేసి, వారిని సన్నద్ధం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

**శిక్షణ వివరాలు** : ఈ శిక్షణ కార్యక్రమం ఉమ్మడి గుంటూరు జిల్లాలో నివసించే నిరుద్యోగ యువతకు ప్రత్యేకంగా రూపొందించబడింది. ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ అర్హత కలిగిన విద్యార్థుల కోసం వేర్వేరు శిక్షణ బ్యాచ్‌లు ఏర్పాటు చేయనున్నారు. అర్హత పరీక్ష ద్వారా ఎంపికైన విద్యార్థులకు ఆరు నెలల పాటు పూర్తిగా ఉచితంగా శిక్షణ అందించబడుతుంది. ఈ శిక్షణలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు సంబంధించిన సబ్జెక్టులు, ప్రాక్టీస్ టెస్టులు, మోడల్ పేపర్లు, మెంటార్ గైడెన్స్ వంటి అంశాలు ఉంటాయి. వివిధ రకాల పరీక్షలు, వాటి సిలబస్, పరీక్షా విధానం, ఇంటర్వ్యూ సన్నాహకాలపై పూర్తి స్థాయి శిక్షణ అందించబడుతుంది. అదనంగా, ఈ శిక్షణలో ఇంగ్లీష్ భాషా నైపుణ్యాలు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ వంటి కీలక అంశాలపై ప్రత్యేక శిక్షణ కూడా అందించబడుతుంది. ఈ కార్యక్రమం గురించి మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి లేదా దరఖాస్తు చేసుకోవడానికి ఎన్ఆర్ఐ కాలేజీ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

# పోలవరం పనులపై సమీక్ష



(మొదటి పేజీ తరువాయి)

పట్ల విదేశీ నిపుణులు సంతృప్తి వ్యక్తం చేశారు. బట్రస్ డ్యాం నిర్మాణంతో ఎగువ కాఫర్ డ్యాం సీపేజ్ నియంత్రణ సాధ్యమైందని, గ్యాప్-1 రాక్ ఫిల్ పనుల నాణ్యతపై నిపుణులు సంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిపారు. మోడల్ డ్యాంను త్వరగా పూర్తి చేయాలని సూచనలు ఇచ్చినట్టు వివరించారు.

ఏజెన్సీతో పాటు ఇరిగేషన్ శాఖ ఏర్పాటు చేసిన క్వాలిటీ కంట్రోల్ లేబరేటరీ, ఆధునిక పరికరాల వాడకం పట్ల ప్రశంసలు లభించాయని మంత్రి పేర్కొన్నారు. దయాఫ్రంవాల్ పనులు షెడ్యూల్ ప్రకారమే కొనసాగుతూ ఇప్పటివరకు 42 శాతం (578 మీటర్లు) పూర్తి అయినట్టు తెలిపారు. పోలవరం ఎడమ, కుడి కాలువల కనెక్టివిటీలకు గ్యాంట్రీస్ సంఖ్యను పెంచి 2026 జూన్ నాటికి పూర్తి చేసేలా ముందుకు వెళు న్నామని స్పష్టం చేశారు.

పోలవరం నిర్మాణంతో పాటు భూసేకరణ, పునరావాస పనులకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పునరావాస కాలనీల ఇళ్ల నిర్మాణం, మౌళిక వసతుల కల్పన కోసం 739 కోట్లతో టెండర్లు పిలిచినట్టు వెల్లడించారు. ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తరలించేందుకు పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.

జాతీయ రహదారుల క్రాసింగ్ ప్రాంతాల్లో వంతెనల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోలవరంపై టిఎంసి, క్యూసెక్కు తేడా తెలియని జగన్ లేదా వైసిపి నాయకులు చేసే దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

# అమరావతి .. సేఫ్ సిటీ!

(మొదటి పేజీ తరువాయి)



ఎప్పటి వరకూ పూర్తవుతాయి. భవనాలతో పాటు ఇతర మౌళిక వసతుల కల్పన ఎప్పటికి పూర్తవుతుందనే వివరాలను సీఆర్డీఏ ఇంజినీరింగ్ అధికారులను, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు...ఆ తర్వాత మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు.

అమరావతి పనుల్లో ప్రస్తుతం 13వేల మంది ఉద్యోగులు,కార్మికులు నిరంతరం పనిచేస్తున్నారు...అలాగే ప్రొక్లెయిన్ లు,జేసీబీలు,ఇతర యంత్రాలు సుమారు 2500 వరకూ పనిచేస్తున్నాయి...వర్షాలు కూడా తగ్గడంతో పనులు తిరిగి ఊపందుకున్నాయని మంత్రి చెప్పారు...గెజిటెడ్ ఆఫీసర్స్ టైప్ -1 భవనాల్లో 4 టవర్లలో 384 ఫ్లాట్లు,ఒక్కొక్కటి 1800 చదరపు అడుగుల విస్తీర్ణంలో 9.62 లక్షల విస్తీర్ణంలో పనులు వేగంగా జరుగుతున్నాయి...ఇక టైప్ -2 భవనాల్లో మరో 4 టవర్లలో 336 ఫ్లాట్లు ఒక్కొక్కటి 1500 చదరపు అడుగుల విస్తీర్ణంలో 7.4 లక్షల విస్తీర్ణంలో జరుగుతుంది...మరోవైపు గ్రూప్ – డి ఉద్యోగుల కొరకు మొత్తం 6 టవర్లలో 720 ఫ్లాట్లు ఒక్కొక్కటి 900 చదరపు అడుగుల విస్తీర్ణంలో 10.2 లక్షల విస్తీర్ణంలో వేగంగా నిర్మాణం జరుగుతున్నాయని మంత్రి చెప్పారు...

మొత్తంగా 27 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 1440 ఇళ్ల నిర్మాణాలు దాదాపు తుది దశకు చేరుకున్నాయి...శ్లాబ్ పనులు దాదాపు పూర్తికాగా...మిగిలిన వాటికి నవంబర్ నాటికి పూర్తవుతాయి...సీవరేజ్ ప్లాంట్ నిర్మాణం కూడా వేగంగా జరుగుతుంది...అన్ని భవనాలు మార్చి నెలాఖరులోగా పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా వెళ్తున్నట్లు మంత్రి చెప్పారు...వీటిలో 50 శాతం ఇళ్లు అక్టోబర్ రెండు నాటికి పూర్తవుతాయని....అయితే అన్ని నిర్మాణాలు పూర్తయిన తర్వాతే అధికారులకు అప్పగిస్తామన్నారు.

**అమరావతి చాలా సేఫ్ సిటీ..** : అమరావతిలో 360 కిమీ మేర ట్రంక్ రోడ్లు,1500 కిమీ మేర లే అవుట్ రోడ్లు,4000 నివాస భవనాలు,ఐకానిక్ భవనాలు పనులు ఎంతో వేగంగా జరుగుతున్నాయి.కానీ అమరావతిలో పనులేమీ జరగడం లేదని పనిగట్టుకుని కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారు..అసలు అమరావతిలో ఏం జరుగుతుందో ఇక్కడికి వచ్చి చూస్తే తెలుస్తుంది...అమరావతి అంతా గ్రాఫిక్స్ అంటున్న వారిని ప్రజలు క్షమించరని...అమరావతి చాలా సేఫ్ సిటీ అన్నారు.అమరావతిలో వరద నివారణ కొరకు నెదర్లాండ్స్ నిపుణులతో డిజైన్ చేయించామన్నారు..అమరావతికి ఎలాంటి ముంపు లేకుండా కాలువలు,రిజర్వాయర్లు నిర్మాణం చేస్తున్నారు..ఏది ఏమైనా చెప్పిన ప్రకారం మూడేళ్లలో అమరావతిని పూర్తి చేస్తామని మంత్రి నారాయణ తేల్చి చెప్పారు..

# టెంపుల్ టౌన్స్ లో.. హోమ్ స్టేలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** టెంపుల్ టౌన్స్‌లో హోమ్ స్టేలను ప్రోత్సహించాలని, ముఖ్యంగా తిరుపతితో పాటు ఇతర ప్రముఖ దేవాలయాల పట్టణాల్లో వీటిపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కోనసీమలో గ్రామీణ వాతావరణం అనుభూతి చెందేలా హోమ్ స్టేలను అభివృద్ధి చేయాలని, ఎన్ఆర్ఐలు కూడా ఇందులో పెట్టుబడులు పెట్టేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఈ హోమ్ స్టేలు అన్నీ అంతర్జాతీయ ప్రమాణాలతో ఉండేలా చూడాలన్నారు. బుధవారం సచివాలయంలో పర్యాటక శాఖపై సీఎం సమీక్షించారు. విశాఖ, విజయవాడ, అమరావతి, తిరుపతి, అనంతపురం, కర్నూలు ఇలా వేర్వేరు ప్రాంతాల్లో నిరంతరం ఏదోక టూరిజం ఈవెంట్ జరిగేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, అందుకోసం గదుల నిర్మాణం, నూతన ప్రాజెక్టులు, పర్యాటక ఉత్సవాల నిర్వహణ వంటి అంశాలపై దృష్టి సారించాలని సీఎం చెప్పారు. నిర్దేశించిన గడువులోగా వేర్వేరు పర్యాటక ప్రాంతాల్లో బస కోసం హోటల్ గదులను సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. 2026 మార్చి నాటికి రాష్ట్రంలో 10 వేల గదులు అందుబాటులోకి రావాలని సీఎం సూచించారు. అలాగే 2029 నాటికి 50 వేల గదుల లక్ష్యాన్ని కూడా చేరుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో పర్యాటక ప్రాజెక్టులు చేపట్టేందుకు స్థలాలను గుర్తించాలని సీఎం ఆదేశించారు. పోర్టులకు అనుసంధానంగా పారిశ్రామిక ప్రాంతాలు, టౌన్ షిప్ లతో పాటు పర్యాటకంగానూ అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారు. అనంతపురంలో డిస్నీ వరల్డ్ సిటీ ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ప్రతినిధుల్ని సంప్రదించాలని అధికారులకు సీఎం చెప్పారు. కొండపల్లి ఖిల్లా లాంటి ప్రాజెక్టులను దత్తత తీసుకునేలా ప్రైవేటు భాగస్వాములను గుర్తించాలన్నారు. ఉండవల్లి గుహల వద్ద లైట్ అండ్ సౌండ్ షో ఏర్పాటుతో పాటు, చింతపల్లిలో ఎకో టూరిజం, కుప్పంలో ఏనుగుల సఫారీ, విశాఖలో డాల్ఫిన్ షో వంటి ప్రాజెక్టులను అభివృద్ధి



చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

**ఆకర్షణీయ బీచ్ ఫ్రంట్ లను అభివృద్ధి చేయండి**

వివిధ పథకాల కింద రాష్ట్రంలో చేపట్టిన పర్యాటక ప్రాజెక్టుల పురోగతిపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. స్వదేశ్ దర్శన్ పథకం కింద బొర్రా గుహలు, అరకు, లంబసింగిలో పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎం చెప్పారు. సూర్య లంక బీచ్ ఎక్స్ పీరియన్స్ ప్రాజెక్టు పనులను రూ.97 కోట్లతో చేపట్టామని.. 2026 జూన్ నాటికి ఈ ప్రాజెక్టు సిద్ధం అవుతుందని వెల్లడించారు. ప్రసాద్ పథకం కింద సింహాచలం, అన్నవరం దేవస్థానంలో చేపట్టిన అభివృద్ధి పనులపైనా సీఎం ఆరా తీశారు. గండికోట టెంట్ సిటీని వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తైడ, అరకు, గండికోట, సూర్యలంక, బ్రిడ్జిలంక, లంబసింగి వంటి ప్రాంతాల్లో టెంట్ సిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అఖండ గోదావరి ప్రాజెక్టు కింద హావ్ లాక్ బ్రిడ్జిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రాజెక్టును పర్యాటకులకు అందుబాటులోకి తేవాలన్నారు. రాజమండ్రిని స్పెషల్ టూరిజం హబ్ గా చేపట్టేలా ప్రాజెక్టులను తీసుకువచ్చే అంశం మీద దృష్టి సారించాలని సూచించారు. సుదీర్ఘ తీర ప్రాంతంలో ఆకర్షణీయమైన బీచ్ ఫ్రంట్ లను గుర్తించి అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. హెలీ, సీప్లేన్ టూరిజానికి సంబంధించి విజయవాడ-శ్రీశైలం, గండికోట-బెంగుళూరు, విశాఖ-అరకు లాంటి కొత్త మార్గాలను కూడా గుర్తించాలని స్పష్టం చేశారు. కోనసీమలో కాటేజ్ లైఫ్, విలేజ్ లైఫ్ వచ్చేలా ప్రాజెక్టులు చేపట్టాలని సీఎం అధికారులకు సూచించారు. సీ క్రూజ్ ప్రాజెక్టులతో పాటు రివర్ క్రూయిజ్ ను కూడా ప్రోత్సహించాలన్నారు. మరోవైపు విజయవాడలో దసరా ఉత్సవాలను మైసూరు ఉత్సవాల తరహాలోనే నిర్వహించేందుకు ప్రణాళిక చేసినట్టు అధికారులు తెలిపారు. సెప్టెంబరు 22తేదీ నుంచి అక్టోబరు 2తేదీ వం-కూ విజయవాడలో ఘనంగా దసరా ఉత్సవాలు నిర్వహించాలని సీఎం సూచించారు. అలాగే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించే వేర్వేరు ఈవెంట్ల సమయంలో ఆయా పట్టణాలు, నగరాల్లో పండుగ శోభ వచ్చేలా విద్యుత్ దీపాలంకరణతో పండుగ శోభ వచ్చేలా చేయాలని స్పష్టం చేశారు. అలాగే సంప్రదాయ వంటకాలను కూడా ప్రోత్సహించేలా చూడాలని పేర్కొన్నారు. ఈవెంట్ల సమయంలో నగరాలు, పట్టణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ప్రత్యేకించి విశాఖ, విజయవాడ, అమరావతి, తిరుపతి లాంటి నగరాలు నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

**పర్యాటకంలో అరకు కాఫీ, కూచిపూడి, ఎర్రచందనం ఉత్పత్తుల బ్రాండింగ్**



పర్యాట రంగానికి మరింత శోభ తెచ్చేలా అదనపు ఆకర్షణలు జోడించటంతో పాటు, స్థానికంగా ఉన్న ఉత్పత్తులను కూడా బ్రాండింగ్ చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అన్ని పర్యాటక ప్రాంతాలు, ప్రత్యేకంగా నిర్వహించే ఈవెంట్లలోనూ అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు చేయటంతో పాటు అరుదైన ఎర్రచందనం బొమ్మలు, ఫర్నిచర్ లాంటి ఉత్పత్తులను కూడా ప్రదర్శించాలన్నారు. అలాగే మన సంప్రదాయ నృత్య కళ కూచిపూడి, మంగళగిరి, ధర్మవరం, వెంకటగిరి లాంటి చేనేత క్లస్టర్లలో ఉత్పత్తయ్యే వస్త్రాలు, సేంద్రీయ ఉత్పత్తులకు కూడా బ్రాండింగ్ వచ్చేలా చేయాలని అన్నారు. గోదావరి పుష్కరాలకు సంబంధించి ముందస్తుగా కర్టెన్ రైజర్ కార్యక్రమం నిర్వహిద్దామని మంత్రి కందుల దుర్గేష్ సీఎం దృష్టికి తీసుకువచ్చారు. దీనికి సీఎం అంగీకరించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సూర్యలంకలో ఫెస్టివల్ నిర్వహించవచ్చని సీఎం సూచించారు. పర్యాటకుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఒక చిన్న సంఘటన జరిగినా మొత్తం పర్యాటక రంగం దెబ్బతింటుందని ముఖ్యమంత్రి హెచ్చరించారు. శాంతిభద్రతలు, భద్రతతో పాటు పర్యాటకుల పట్ల మర్యాదగా ప్రవర్తించడం చాలా ముఖ్యమని ఆయన అన్నారు. రాష్ట్రపతి భవన్ లో ప్రదర్శించేందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఆరు పురాతన తెలుగు తాళ పత్ర గ్రంధాలను సీఎం పరిశీలించారు. ఈ సమీక్షకు మంత్రి కందుల దుర్గేష్ వర్చువల్ గా, ఆ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# స్థానిక సంస్థలకు.. సాయం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల బలోపేతానికి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఆర్ధిక సాయంతో పాటు సొంత ఆదాయ వనరులు పెంచుకోవడం ద్వారా వేగంగా అభివృద్ధి సాధించడంపై అధికారులు దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. వెనకబడిన, తలసరి ఆదాయం తక్కువ ఉన్న స్థానిక సంస్థలను కేటగిరీలుగా విభజించాలని ఆదేశించారు. దీంతో వాటికి ప్రత్యేక సాయం అందించే వీలు కలుగుతుందన్నారు. స్థానిక సంస్థల వర్గీకరణ ప్రక్రియను నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. ఇందుకు అవసరమైన చట్టసవరణ చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. బుధవారం సచివాలయంలో 5వ రాష్ట్ర ఆర్ధిక సంఘం సభ్యులు ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆర్ధిక సంఘం సిఫారుసులను సీఎంకు అందజేశారు. స్థానిక సంస్థల బలోపేతానికి ఆర్ధిక-ఆర్ధికేతర అంశాలపై ఆర్ధిక సంఘం సిఫార్సులు చేసింది.

**స్థానిక సంస్థల స్వయం సమృద్ధే లక్ష్యంగా** : ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... 'పంచాయతీల అభివృద్ధికి ఏటా నరేగా సహా వివిధ రూపాల్లో సమకూరుతున్న నిధుల మొత్తాన్ని క్రోడీకరించాలి. పంచాయతీల నిర్వహణకు ఏ మేరకు అవసరాలు ఉన్నాయో గుర్తించాలి. ఈ ప్రక్రియను పూర్తి చేస్తే ఏ విధంగా సాయం అందించాలి...? స్థానిక సంస్థల్ని ఏ విధంగా బలోపేతం చేయాలి...? అనే అంశాలపై విధి విధానాలు రూపొందించడానికి వీలు కలుగుతుంది. ఉపాధి హామీ పథకం కింద పెద్ద ఎత్తున కేంద్రం నుంచి నిధులు వస్తున్నాయి. అయితే ఆ మేరకు ఆస్తుల కల్పన జరుగుతుందో, లేదో అనే విషయాన్ని నిరంతరం పరిశీలించుకోవాలి. స్థానిక సంస్థలు స్వయం సమృద్ధి సాధించేలా అధికారులు ప్రయత్నించాలి. ఇదే విధంగా పట్టణ స్థానిక సంస్థలనూ ఆర్ధికంగా బలోపేతం చేస్తూ, మరిన్ని ఆదాయార్జన మార్గాలను అన్వేషించాలి. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఫైనాన్స్ కమిషన్ నిధులతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం కూడా మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చే నిధులను కొంత మేర పెంచితే వాటిని స్థానిక సంస్థలు సద్వినియోగం చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే, వనరులు తక్కువగా ఉండి...



సామాజికంగా వెనకబడి ఉన్న స్థానిక సంస్థల్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉంది. ఇదే సమయంలో స్థానిక సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించేలా అవగాహన కల్పించాలి. నిధులు తీసుకోవడంతో పాటు, వాటిని సద్వినియోగం చేసుకునేలా స్థానిక ప్రజాప్రతినిధులు వ్యవహరించాలి. ప్రజలకు ప్రత్యక్షంగా సేవలందించేది స్థానిక సంస్థలు. దీనిని దృష్టిలో పెట్టుకుని స్థానిక సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు విధులు నిర్వర్తించాలి. స్థానిక సంస్థల్లో విధులు నిర్వహించే వారు సమర్ధవంతంగా పని చేస్తే... ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. ఆర్ధిక సంవత్సరం చివరికి పంచాయతీల్లోనూ, పట్టణాభివృద్ధి సంస్థల్లోనూ ఆడిటింగ్ పూర్తి చేయాలి.' అన్నారు.

**ఆదాయాలు-బకాయిల లెక్కలు తేల్చండి: డెప్యూటీ సీఎం** : 2019 నుంచి 2024 మధ్య కాలంలో స్థానిక సంస్థలు ఆస్తి పన్నుల వసూళ్లు ఎంత జరిగాయి...? ఇంకెంత బకాయిలు ఉన్నాయో...? లెక్కలు తేల్చాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి సూచించారు. ప్రజలు చెల్లించే పన్నుల వివరాలు ప్రతీది ఆన్‌లైన్ చేయాలని నిర్దేశించారు. గ్రామాల్లో పౌల్ట్రీ పరిశ్రమలకు సంబంధించిన వివిధ అంశాలపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలని చెప్పారు. గ్రామ ప్రజలకు, పౌల్ట్రీ పరిశ్రమలకు ఇబ్బందిలేని విధానాన్ని తీసుకురావాలన్నారు.

**స్థానిక సంస్థల రిసోర్స్ గ్యాప్-రాష్ట్ర ఆర్థిక సంఘం నివేదిక** : ఆర్ధికంగా రాష్ట్రం కొన్ని సవాళ్లు ఎదుర్కొంటోందని 5వ రాష్ట్ర ఆర్ధిక సంఘం పేర్కొంది. 2023-24 ఆర్ధిక సంవత్సరాన్ని పరిశీలిస్తే రాష్ట్ర సొంత ఆదాయం కన్నా జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులకు ఖర్చు పెట్టే మొత్తం 111 శాతంగా ఉందని వెల్లడించింది. అంతేకాకుండా... రాజధాని నిర్మాణం, సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల అమలు వంటి లక్ష్యాలు ఉన్నాయని స్పష్టం చేసింది. 2025-26 నుంచి 2029-30 వరకు పంచాయతీరాజ్ సంస్థల రిసోర్స్ గ్యాప్ రూ.7,033 కోట్లు ఉంటుందని ఆర్ధిక సంఘం లెక్క తేల్చింది. అలాగే ఇదే కాలానికి పట్టణ స్థానిక సంస్థల రిసోర్స్ గ్యాప్ రూ.2,016 కోట్లుగా ఉంది. అలాగే ఆస్తి పన్నుల డిమాండ్-కలెక్షన్ మధ్య భారీ వ్యత్యాసం ఉందని చెప్పింది.

**విద్యుత్ బిల్లులు చెల్లించని గత ప్రభుత్వం**

జూన్ 2024 వరకు గత ప్రభుత్వం చెల్లించకుండా వదిలేసిన గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లులు రూ.5,851.58 కోట్లు ఉన్నాయి. గ్రామ పంచాయతీలకు వివిధ రూపాల్లో నిధుల సమీకరణ రూ.2,617 కోట్లుగా ఉంది. ఇందులో అత్యధికంగా సెంట్రల్ ఫైనాన్స్ కమిషన్ అందిస్తున్న గ్రాంట్స్ రూపంలోనే ఉన్నాయి. ఆ తర్వాత ఆస్తి పన్నులతో ఎక్కువ నిధులు సమకూరుతున్నాయి. పంచాయతీరాజ్ సిబ్బందికి ఏటా జీతాల రూపంలో రూ.393.77 కోట్లు, మున్సిపల్ సిబ్బందికి రూ.1,672.45 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఈ సమావేశంలో రాష్ట్ర 5వ ఆర్ధిక సంఘం ఛైర్ పర్సన్ రత్నకుమారి, సభ్యులు ప్రసాదరావు, కృపారావు సహా ఆర్ధిక, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రైతు శ్రమ వృధా కానివ్వొద్దు



(మొదటి పేజీ తరువాయి)

అత్యవసరంగా ఈ నెల చివరి లోగా కొనాలని ఆదేశించారు. మిగిలిన 5 కిలోలు మార్క్ ఫెడ్ కొనుగోలు చేస్తుందన్నారు.

2025-26 రబి సీజన్ లో నల్లబెర్లి పొగాకు ను ఎవరు పండించకూడదని ఇందుకోసం 740 జీవో విడుదల చేసామన్నారు. కంపెనీలతో ఎంఓయూలు చేసుకున్న రైతులు మాత్రమే తెల్ల బర్లీ పోగాకును పండించాలని అన్నారు. నల్ల బర్లీ పంటను వేయకుండా రైతులు శనగలు, మినుములు, పెసలు, జొన్నలు, మొక్కజొన్న వంటి పంటలను వేయాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు.

**ఖరీఫ్ సీజన్లో పండించే ప్రత్తి కొనుగోలుపై సీసీఐ దృష్టి సారించాలి**

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ లో ప్రత్తి సాధారణ సాగు విస్తీర్ణం 5.28 లక్షల హెక్టార్లు కాగా 4.02 లక్షల హెక్టార్లలో పంట సాగు చేయబడిందని మరియు దాదాపు 7.12 లక్షల మెట్రిక్ టన్నుల ప్రత్తి దిగుబడి అంచనా వేశామన్నారు.

ఖరీఫ్ సీజన్లో పండినటువంటి ప్రత్తి పంటను కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) కనీస మద్దతు ధర కలిగేలా రైతుల వద్ద ప్రత్తిని కొనుగోలు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అక్టోబర్ 1 నాటికి సిసిఐ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఇందుకోసం తగిన చర్యలను చేయాలని అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు.

# నీటిగుంతలో పడి ఇద్దరు చిన్నారుల మృతి

**ఉట్కూరు(జర్నలిస్ట్ ఫైల్)::** ఆడుకుంటూ వెళ్లి ఇద్దరు చిన్నారులు ప్రమాదవశాత్తు నీటిగుంతలో పడి మృతి చెందిన ఘటన నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలంలోని తిమ్మారెడ్డిపల్లి తండాలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మారెడ్డిపల్లి తండాకి చెందిన పునియ నాయక్, జయమ్మ దంపతులకు అభి(5), ఆకాశ్(4) కుమారులున్నారు. గత కొన్నాళ్లుగా వీరు హైదరాబాద్‌లో నివాసముంటూ తమ గ్రామంలో నిర్వహించే గణపతి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చారు. బుధవారం ఉదయం ఇంటి ఆవరణలోని నిర్మాణ పనులు కోసం ఏర్పాటు చేసుకున్న నీటిగుంతలో ప్రమాదవశాత్తు పడిపోయారు. ఎవరూ గమనిచకపోవడంతో గుంతలోనే మృత్యువాత పద్దారు. కొంత సమయం తర్వాత జయమ్మ పిల్లల కోసం వెతికినా ఆచూకి లభ్యం కాలేదు. ఆ ప్రాంతంలో ఉన్నవారు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. చిన్నారులను జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

# పోటెత్తిన యమున... చెరువుల్లా మారిన ఢిల్లీ వీధులు

**ఢిల్లీ** : దేశ రాజధాని ఢిల్లీని యమునా నది వరదలు ముంచెత్తాయి. నది ఉగ్రరూపం దాల్చడంతో అనేక లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వీధులు చెరువులను తలపిస్తుండగా, మార్కెట్లు, ఇళ్లు నీటమునిగాయి. బుధవారం మధ్యాహ్నం 1 గంట సమయానికి యమునా నది నీటిమట్టం ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

హథినీకుండ్ బ్యారేజీ నుంచి భారీగా నీటిని విడుదల చేయడంతో యమునా నది పోటెత్తింది. దీంతో వసుదేవ్ ఘాట్, యమునా ఘాట్‌లతో పాటు మజ్ను కా టిలా, మదన్‌పూర్ ఖదర్, బదర్‌పూర్ వంటి నివాస ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. అధికారులు ముందుజాగ్రత్త చర్యగా పాత రైల్వే బ్రిడ్జిపై రాకపోకలను నిలిపివేసి, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, తాత్కాలిక శిబిరాలకు తరలించారు. అయినప్పటికీ,



వరద ప్రభావిత ప్రాంతాల్లో హృదయ విదారక దృశ్యాలు ఆవిష్కృతమవుతున్నాయి. సర్వం కోల్పోయిన ప్రజలు కట్టుబట్టలతో రోడ్లపైకి వచ్చి, సహాయం కోసం ఎదురుచూస్తున్నారు.

ఒకప్పుడు రద్దీగా ఉండే మజ్ను కా టిలా మార్కెట్ ఇప్పుడు నిశ్శబ్దంగా మారింది. వరద నీరు దుకాణాల్లోకి చేరడంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. "రాత్రికి రాత్రే దుకాణం ఖాళీ చేశాం. చాలా సరుకులు కాపాడుకున్నా, కొన్ని పాడైపోయాయి. వరద తగ్గాక దుకాణానికి మరమ్మతులు చేయాలంటే పెద్ద ఖర్చు అవుతుంది," అని దుకాణదారుడు అనుప్ థాపా ఆవేదన వ్యక్తం చేశారు. 2023 తర్వాత మళ్లీ ఇలాంటి పరిస్థితి రావడం ఇది రెండోసారని, ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన కోరారు.

మదన్‌పూర్ ఖదర్‌లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. తమ పూరి గుడిసెలు నీటిలో మునిగిపోవడంతో వందలాది కుటుంబాలు రోడ్డు పక్కన ప్లాస్టిక్ షీట్ల కింద తలదాచుకుంటున్నాయి. "మా సామాన్లన్నీ ఇంట్లోనే ఉండిపోయాయి. కొన్ని మాత్రమే తెచ్చుకోగలిగాం. ముఖ్యంగా మహిళలు టాయిలెట్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు" అని తాయారా అనే మహిళ తన గోడు వెళ్లబోసుకుంది. వంట సామాగ్రి లేక, కనీసం వండుకోవడానికి కూడా అవకాశం లేక కేవలం బిస్కెట్లు, బన్నులతోనే కడుపు నింపుకుంటున్నామని మరికొందరు వాపోయారు.

యమునా బజార్, బదర్‌పూర్ ప్రాంతాల్లో ఇళ్లు, దుకాణాలు నది మధ్యలో ఉన్నట్లు కనిపిస్తున్నాయి. బదర్‌పూర్‌లో ఇళ్ల పైకప్పులు మాత్రమే నీటిపై కనిపిస్తున్నాయి. "ఏళ్ల తరబడి కష్టపడి నా భార్యాబిడ్డల కోసం ఈ ఇల్లు కట్టుకున్నాను. ఇప్పుడు అదంతా నీటిపాలైంది. మేం ఎక్కడికి వెళ్లాలి?" అని తన సామానును తలపై పెట్టుకుని నీటిలో నిలబడిన అసీఫ్ కన్నీటిపర్యంతమయ్యారు. కొందరు ఇంకా ఇళ్లలోనే చిక్కుకుపోయి ఉంటారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వరద తగ్గిన తర్వాత తమ జీవితాలను తిరిగి ఎలా నిర్మించుకోవాలో తెలియక బాధితులు నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు

# కవిత సస్పెన్షన్ బిఆర్ఎస్ అంతర్గత వ్యవహారం



మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

## మంత్రులు, కాంగ్రెస్ నేతల స్పందన
## కెసిఆర్ ఫ్యామిలీ కొత్త డ్రామా
## పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 3(జర్నలిస్ట్‌ఫైల్):** బిఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీ కవిత సస్పెన్షన్‌పై మంత్రులు, కాంగ్రెస్ నేతలు స్పందించారు. కవిత సస్పెన్షన్ బిఆర్ఎస్ పార్టీకి చెందిన అంశమన్నారు. ఆ పార్టీ అంతర్గత వ్యవహారమన్నారు. పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తీవ్రవిమర్శలు చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరంపై కెసిఆర్ ఫ్యామిలీ కొత్త డ్రామాకు తెర తీసిందని అన్నారు. అవినీతి జరిగిందని కవిత వ్యాఖ్యలతో స్పష్టమైందని, హరీశ్‌రావు మాత్రమే అవినీతి చేశారని కవిత అంటున్నారు. అప్పుడే హరీశ్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. కెసిఆర్ అనుమతి లేకుండా ఏమీ జరగదు. కాళేశ్వరంలో కర్త, కర్మ, క్రియ అన్నీ కేసీఆరే అని అన్నారు. అవినీతికి బాధ్యత కూడా కెసిఆర్‌దే అని అన్నారు. తన బాణాలను హరీశ్, సంతోష్‌వైపు ఎందుకు మళ్లించారని అడిగారు. మరోవైపు కవితపై బిఆర్ఎస్ సస్పెన్షన్ వేటు వేసింది. కేసీఆర్ ఆదేశాలతో కవిత సస్పెన్షన్‌కు గురైంది. కవిత వ్యాఖ్యలతో పార్టీకి నష్టం కలుగుతుందని సస్పెండ్ చేస్తూ విడుదల చేసిన లేఖ బిఆర్ఎస్ అధిష్ఠానం పేర్కొంది.

**కుటుంబ తగాదాల్లో మమ్మల్ని లాగడం**

**సరికాదు : మంత్రి అడ్లూరి లక్ష్మణ్**

ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పందించారు. అవి కుటుంబ తగాదాలని, ఎమ్మెల్సీ కవితనే చూసుకోవాలని, తమను లాగడం సరి కాదని ఆయన చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఎమ్మె ల్సీ కవిత పరోక్షంగా అంగీకరించారని తెలిపారు. కక్షసాధింపు చర్యలు చేయడం లేదన్నారు. హరీశ్‌రావు సంతోష్‌రావు వెనుక ఉండాల్సిన అవసరం తమకు లేదన్నారు.

**కవిత సస్పెన్షన్ వాళ్ల అంతర్గత**
**వ్యవహారం : మంత్రి శ్రీధర్‌బాబు**

భారతరాష్ట్ర సమితి నుంచి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సస్పెన్షన్ అంశం..వారి అంతర్గత కుటుంబ వ్యవహారమని ఐటీ,పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధరాబాబు అన్నారు.శాసనసభ ఎన్నికల సమయంలోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి, అవకతవకలపై జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చామని అన్నారు.

కాళేశ్వరం కమిషన్ నివేదిక మీద ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హరీష్ రావు, సంతోష్ రావు వెనుక సిఎం ఉన్నాడనేది రాజకీయ ఆరోపణ మాత్రమే అని,కాళేశ్వరంపై లోతైన విచారణ జరగాలని అభిప్రాయపడ్డారు. కాంట్రాక్టర్ల వ్యవహారంపై విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

సిబిఐ విచారణ జరగకుండానే కాళేశ్వరంలో అవినీతి జరిగిందని కవిత తేల్చి చెప్పిందని భువనగిరి ఎంఎల్‌ఏ కంభం అనిల్‌కుమార్ అన్నారు. మీడియాతో మాట్లాడుతూ..హరీష్‌రావు, సంతోష్‌రావు అవినీతి చేశారని కవిత మొదట సాక్ష్యం చెప్పిందన్నారు. కెసిఆర్ డైరక్షన్‌లోనే హరీష్‌రావు పనిచేశారన్నారు.

**అష్టదిగ్బంధంలో**
**కెసిఆర్ కుటుంబం : వేముల వీరేశం**

కెసిఆర్ కుటుంబం అష్టదిగ్బంధంలో ఉందని, భయంతో కోర్టులకు పరుగెడుతోందని ఎంఎల్‌ఏ వేముల వీరేశం అన్నారు.అపర మేధావి అయిన కెసిఆర్ ఎందుకు విచారణకు భయపడుతున్నారని ప్రశ్నించారు.ఆయన మెహం చాటేయడంతోనే అవినీతికి పాల్పడినట్లు అర్థం అవుతోందన్నారు.ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కోసం రూ.12 వేల కోట్లు ఖర్చు చేసిన తర్వాత రద్దు చేసి కాళేశ్వరం తీసుకువచ్చాడని విమర్శించారు. పిసిఘోష్ కమిషన్ నివేదికను చెత్తబుట్టలో వేయాలని ,సిబిఐ విచారణను ఆపాలని కేసిఆర్ ప్రయత్నిస్తున్నాడని ఆయన ఆరోపించారు. బిఆర్ఎస్‌కు వెయ్యి కోట్ల డిపాజిట్లు, వేల కోట్ల అవినీతి డబ్బు ఉందని ఆ పంపకాల్లోనే పంచాయితీ వచ్చిందన్నారు.

# మూడు ముక్కలైన బిఆర్ఎస్

## కవితను బిజెపిలో చేర్చుకునే
## ప్రసక్తే లేదు: ఎంపి డా.లక్ష్మణ్

**హైదరాబాద్, సెప్టెంబరు 3(జర్నలిస్ట్‌ఫైల్):** ఎమ్మెల్సీ కవిత సస్పెన్షన్ వ్యవహారంపై బిజెపి ఎంపి లక్ష్మణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మొన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ కుప్పకూలింది.. నిన్న బిఆర్ఎస్ పార్టీ కూలిందని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీలో మూడు పిల్లర్లు కూలినట్టే, బిఆర్ఎస్ పార్టీ మూడు ముక్కలైందని అన్నారు. కవితను బిజెపిలో చేర్చుకోమని, మా పార్టీలో అవినీతిపరులకు చోటు లేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిపై విచారణను తెలంగాణ ప్రభుత్వం సిబిఐకి అప్పగించడాన్ని స్వాగతిస్తున్నా మన్నారు. 22 నెలలుగా సిఎం రేవంత్ రెడ్డి ఎందుకు కాలాయాపన చేశారని ప్రశ్నించారు.

గతంలో కాళేశ్వరం అవినీతికి సంబంధించిన ఆధారాలు ఉన్నాయని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారని, ఆ ఎవిడెన్స్ సిబిఐకి ఇచ్చి దర్యాప్తుకు సహకరించాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్ట అవినీతి జరిగిందని కవితే చెప్పారన్నారు. హరీశ్‌రావు, సంతోష్‌రావు అవినీతి అనకొండలు అని స్వయంగా కవిత చెప్పారని అన్నారు. తెలంగాణ ఆస్తులను కెసిఆర్ కుటుంబం కొల్లగొట్టిందని ఆరోపించారు. కాళేశ్వరం విషయంలో కేసీఆర్‌ను బలిపశువును చేశారని కవిత అంటున్నారు. కానీ హరీశ్‌రావు, సంతోష్‌రావు అవినీతిలో కెసిఆర్ పాత్ర ఉందన్నారు.



విద్యాశాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు. ప్రసంగిస్తున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, వేముల రామకృష్ణ తదితరులు

## ఆదర్శ పాఠశాల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తక్షణమే వేతన బకాయిలను చెల్లించాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి ఎంపి ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 3(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలోని ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తక్షణమే గత ఆరు నెలల నుంచి చెల్లించవలసిన వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది ఉద్యోగులు మంగళవారం పాఠశాల విద్య కమీషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు. తెలంగాణ మోడల్ స్కూల్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఈ ముట్టడి కార్యక్రమంలో పాల్గొని నినదించారు. ఈ ముట్టడి కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రసంగిస్తూ మోడల్ స్కూల్స్‌లో ఫిజికల్ డైరెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్, వాచెమెన్‌లుగా పనిచేస్తున్న 800 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో అర్థాకలితో అలమటిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులకు పలు మార్లు ఉద్యోగులు మొర పెట్టుకున్నప్పటికి ఎవరూ కనికరించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, నిరుద్యోగ జెఎసి చైర్మన్ నీల వెంకటేష్, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, బిసి నేతలు నందగోపాల్, చిక్కుడు బాలయ్యముదిరాజ్, రవి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని వద్దకు అఖిలపక్ష బృందాన్ని తీసుకెళ్లాలి

### టిపిఆర్‌పి వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్


రవికుమార్

**హైదరాబాద్, సెప్టెంబరు 3(జర్నలిస్ట్‌ఫైల్):** బిసిలకు విద్యా ఉద్యోగ స్థానిక సంస్థల లో రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 42 శాతం రిజర్వేషన్లను రాష్ట్రపతి, గవర్నర్‌లు వెంటనే ఆమోదించాలి, అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి ప్రధాని మోడీని కలవాలని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ (టిపిఆర్‌పి) వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్ డిమాండ్ చేశారు. చట్టం చేసిన తర్వాతనే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజారాజ్యం పార్టీ కార్యాలయంలో ఆయన మీడి యాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే అఖిలపక్ష బృందాన్ని బీసీ మేధావులు, బీసీ సంఘాల నేతలను ఢిల్లీకి తీసుకువెళ్లి ప్రధాని మోదీని కలిసి తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని, దీనికి కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బీసీ రిజర్వేషన్లు చట్ట పరంగా అమలుకు వెంటనే జీవో జారీ చేయాలని ఈ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఎవ్వరు కూడా కోర్టులకు వెళ్ళవద్దని ఆయన కోరారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో బీసీలకు 42 శాతం సీట్లు ప్రజా రాజ్యం పార్టీ కేటా యిస్తుందని, యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. కాలేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అక్రమాలపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం సిబిఐకి అప్పగించడాన్ని స్వాగతిస్తున్నామని జిలుకర రవికుమార్ తెలిపారు.


తుక్కుగూడా, మంఖాల్‌ల్లో డబుల్‌బెడ్ ఇళ్లను కేటాయించాలంటూ సిఎం ప్రజావాణికి వచ్చిన వారితో మాట్లాడుతున్న స్టేట్ నోడల్‌అధికారి దివ్య.

## సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 243

**హైదరాబాద్ (బేగంపేట), సెప్టెంబరు 3(జర్నలిస్ట్‌ఫైల్):** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 243 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు 57 దరఖాస్తులు రెవెన్యూ శాఖకు 33దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్లకోసం 87 దరఖాస్తులు ప్రవాసీ ప్రజావాణికి 3 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలియజేసారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జీ.చిన్నారెడ్డి,స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ లు దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించారు.తుక్కుగూడా మంఖాల్ గ్రామాలలో డబుల్ బెడ్ రూం ఇండ్లను రాష్ట్ర ప్రభుత్వం సుమారు ఒక వేయి మంది లబ్ధిదారులకు మంజూరు చేసినప్పటికీ హైకోర్టు ఆదేశాలతో ఆ మంజూరు ఉత్తర్వులు రద్దు కావడంతో పెద్ద ఎత్తున లబ్ధిదారులు మంగళవారం ప్రజాభవన్‌కు వచ్చారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే డబుల్‌బెడ్ ఇళ్లను కేటాయిస్తామని చిన్నారెడ్డి, దివ్యలు లబ్ధిదారులకు భరోసా ఇచ్చారు.

## రాజీవ్ ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ పథకాల రూపకర్త వైఎస్ఆర్

### నివాళులర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, సెప్టెంబరు 3(జర్నలిస్ట్‌ఫైల్):** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి (సెప్టెంబర్ 2) సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఘనంగా నివాళులర్పించారు.వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చేసిన సేవలను మంత్రి పొన్నం ప్రభాకర్ కొనియాడారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తూ రాష్ట్రాన్ని దేశంలోనే ముందంజలో ఉంచారని కొనియాడారు. పేదల ఆరోగ్యం కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్స్, రైతులకు రుణమాఫీ వంటి ఎన్నో పథకాలను తీసుకొచ్చిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు పెద్దన్నగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వైఎస్ఆర్‌లేని లోటు కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు.

## హెచ్ఎండిఏ ప్లాట్ల ప్రీబిడ్ సమావేశానికి విశేష స్పందన

**హైదరాబాద్, సెప్టెంబరు 3(జర్నలిస్ట్‌ఫైల్):** హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండిఏ) తుర్కయంజాల్‌లోని 12 ప్లాట్ల ఈ-ఆక్షన్‌కి సంబంధించి సెప్టెంబరు 17న నిర్వహించబోయే ఈ వేలం ప్రీబిడ్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఉదయం 11 నుండి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించిన ఈ సమావేశానికి అనూహ్య స్పందన వచ్చింది. ఈ సమావేశంలో హెచ్ఎండిఏ ఎస్టేట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌కు చెందిన డెప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్ రెడ్డి వేలం ప్రక్రియను వివరించారు. ఎంఎస్‌టిఎసి ప్రతినిధులు ఈ-ఆక్షన్ విధానం గురించి ప్రజెంటేషన్ ఇవ్వగా, కెపిఎంపిజి సంస్థ ప్రతినిధులు ఈ ప్రదేశం వ్యూహాత్మక ప్రాముఖ్యత, భవిష్యత్ అభివృద్ధి అవకాశాలను వివరించారు.


సిఎం ప్రజావాణి కోసం పూజలు చేసి బ్యాటరీ వాహనాన్ని ప్రారంభించిన డా.చిన్నారెడ్డి, దివ్యదేవరాజన్.

## సిఎం ప్రజావాణికి బ్యాటరీ వాహనం

### వృద్ధులు, దివ్యాంగుల ఉచిత రవాణాకు వినియోగం

### పూజలు చేసి బ్యాటరీ వాహనాన్ని ప్రారంభించిన చిన్నారెడ్డి, దివ్యదేవరాజన్

**హైదరాబాద్ (బేగంపేట), సెప్టెంబరు 3(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టి విజయవంతంగా నిర్వహిస్తూ ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్న ముఖ్యమంత్రి ప్రజావాణికి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా బ్యాటరీ వాహనాన్ని మంజూరు చేసింది. ఈ వాహనానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్‌లు మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో పూజలు నిర్వహించి లాంఛనంగా ప్రారంభించారు. సిఎం ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలపై దరఖాస్తులు అందజేసేందుకు వచ్చే వృద్ధులు, వికలాంగులకు ప్రధాన రహదారి మెయిన్ గేటు నుంచి పిటీషన్లు అందజేసే భవనం వరకు ఉచితంగా రవాణా సౌకర్యం కల్పించేందుకు రూ.ఏడు లక్షల విలువైన వాహనాన్ని కొనుగోలు చేశారు.

## 5న సిఎం చేతుల మీదుగా జిపిఒలకు నియామకపత్రాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 3(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలో కొత్తగా జిపిఓలుగా నియమితులైన 5 వేల మంది విలెజ్ రెవెన్యూ ఆఫీసర్లకు 5న సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందచేయనున్నట్లురాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఓ ప్రకటనలో తెలిపారు. జీపీవోలకు నియామక పత్రాలను మాదాపూర్లోని హైటెక్స్ లో సాయంత్రం 4 గంటలకు అందజస్తామన్నారు.ఈ కార్యక్రమానికి సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క,రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రులు హాజరవు తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లపై మంగళవారం సంబంధిత కార్య దర్శులు ఉన్నతాధికారులతో సీఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.వివిధ జిల్లాల నుంచి ఎంపికైన వీఆర్వోలు మధ్యాహ్నం 2 గంటలలోపు హైటెక్స్ చేరుకునేలా ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశామన్నారు. కార్య క్రమానికి హాజరయ్యే వారికి దాదాపు 120కి పైగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ఎండీని ఆదేశించారు.ఈ బస్సుల పార్కింగ్, ట్రాఫిక్ నిర్వ హణను చేపట్టాలని సైబరాబాద్ కమిషనర్‌నుఆదేశించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో రోడ్లు భవనాలు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, ఫైర్ సర్వీస్ డీజీ నాగిరెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, సంస్కృతి శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ పాల్గొన్నారు.

# ప్రజాపోరాట యోధుడు సురవరం సుధాకర్‌రెడ్డి

## సురవరం సంస్మరణ సభలో పలువురు వ్యక్తలు


సురవరం చిత్రపటానికి నివాళులు అర్పించి మాట్లాడుతున్న సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, చిత్రంలో అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జస్టిస్ చంద్ర కుమార్, సురవరం సుధాకర్‌రెడ్డి సతీమణి బి.వి.విజయలక్ష్మి తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 3(జర్నలిస్ట్‌ఫైల్):** నిత్య అధ్యాయన శీలుడు, మార్క్సిస్ట్ ఉపాధ్యాయులు, ప్రజాపోరాట యోధుడు సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అని పలువురు వ్యక్తలు కొనియాడారు. సుధాకర్‌రెడ్డి మరణం దేశ కమ్యూనిస్టు ఉద్యమానికే తీరని లోటాని నివాళ్లు అర్పించారు. దేశంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో కమ్యూనిస్టు లంతా ఐక్యం కావాలని కొరుకుంటున్న తరుణంలో దానిని ముందుండి నడిపించాల్సిన నాయకుడైన సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికంగా దూరం కావడం దుర దృష్టకరమని వారు పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్, రావి నారాయణరెడ్డి ఆడిటోరి యంలో మంగళవారం సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, అమరవీరుల స్మారక ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాపరెడ్డి, కోశాధికారి ఉజ్జని రత్నాకర్ రావు, సురవరం సుధాకర్‌రెడ్డి సతీమణి బి.వి.విజయలక్ష్మి, తెలుగు విశ్వ విద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ఎస్.వి.సత్య నారాయణ, సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి, సీనియర్ జర్నలిస్టు మల్లెపల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభా అధ్యక్షులు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలు నిర్మించడంలో సురవరం సుధాకర్‌రెడ్డి అగ్రగణ్యుడని అన్నారు. ప్రజా సమస్యల పట్ల ప్రజలతో మమేకమై అవిశ్రాంత ఉద్యమాలను నిర్మించారని తెలిపారు. విజయలక్ష్మి మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి పట్ల పార్టీ, ప్రభుత్వం చూపిన ప్రేమ ఎప్పటికీ మర్చిపోలేనిదన్నారు.

# జూబ్లీహిల్స్ ఓటర్ల జాబితా ముసాయిదా విడుదల

## 3,92,669 మంది ఓటర్లు నమోదు

### సిఇఒ సుదర్శన్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 3(జర్నలిస్ట్‌ఫైల్):** జూబ్లీహిల్స్ 61వ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల జాబితా ముసాయిదాను రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మంగళవారం విడుదల చేశారు. ఈ జాబితాలో మొత్తం 3,92,669 మంది ఓటర్లు నమోదు కాగా, పౌరులు తమ అభ్యంతరాలు మరియు దరఖాస్తులను సెప్టెంబర్ 17 వరకు సమర్పిం చేందుకు అవకాశం కల్పించారు. ముసాయిదా జాబితాలో 2,04,288 మంది పురుష ఓటర్లు, 1,88,356 మంది మహిళా ఓటర్లు, మరియు 25 మంది ఇతర విభాగంలో నమోదయ్యారు. సిఈఓ కార్యాలయం ప్రకారం, ఓటింగ్ కోసం 139 భవనాల్లో 407 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఓటర్లు తమ పేర్లు, వివరాలను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో, నియమిత పోలింగ్ స్టేషన్లలో గానీ సిఈఓ తెలంగాణ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో తనిఖీ చేసుకోవచ్చునని తెలిపారు. చేర్పులు, తొలగింపులు, సవరణలు గానీ బదిలీల కోసం ఫారమ్ 6, 7, 8 ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చు. అభ్యంతరాలను సెప్టెంబర్ 25 నాటికి పరిష్కరించనున్నారు. చివరి ఓటర్ల జాబితా 2025 సెప్టెంబర్ 30న ప్రచురితం కానుంది. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి నిర్ణయాలపై అప్పీళ్లను ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1950 యొక్క సెక్షన్ 24 కింద దాఖలు చేయవచ్చు, మరియు రెండవ అప్పీల్‌ను ముఖ్య ఎన్నికల అధికారికి సమర్పించవచ్చుని తెలిపారు.

# తెలుగు భాషానిలయానికి 10 లక్షల గ్రాంటు

### గ్రంథాలయాల్లో ఖాళీగా ఉన్న గ్రేడ్ 1, 2, 3 పోస్టుల భర్తీ

### రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు అధ్యక్షుడు డా. రియాజ్

### గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు: డా. కె.వి.రమణాచారి

### వైభవంగా 125 సంవత్సరాల శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం స్థాపన దినోత్సవాలు


స్మారక పురస్కారంతో గీతా రామస్వామిని సత్కరిస్తున్న రమణాచారి, రియాజ్, ఉదయవర్లు, శారద తదితరులు

**హైదరాబాద్ (నాంపల్లి), సెప్టెంబరు 3(జర్నలిస్ట్‌ఫైల్):** తెలుగుభాషా వికాసానికి గత 125 సంవత్సరాలుగా విశేష కృషిచేస్తున్న శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం తాజాగా 10లక్షల రూపాయల గ్రాంటును మంజూరు చేసినట్లు తెలంగాణ గ్రంథాలయ పరిషత్తు అధ్యక్షుడు డా. రియాజ్ తెలిపారు. కేవలం ఉత్తర్వులే కాకుండా ఆ మొత్తం భాషానిలయానికి అందే వరకు స్వయంగా కృషిచేస్తానని హామీ నిచ్చారు. గత పదేళ్లుగా రాష్ట్రంలోని గ్రంథాలయాల్లో ఖాళీగా ఉన్న గ్రేడ్ 1, 2, 3 గ్రంథపాలకుల పోస్టుల భర్తీకి తీవ్ర ప్రయత్నం చేస్తున్నట్లు ఆయన వివరించారు. శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం ఆధ్వర్యంలో సంస్థలో రావిచెట్టు రంగారావు కళావేదికలో భాషానిలయం అధ్యక్షుడు, తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అధ్యక్షతన జరిగిన తెలుగు భాషానిలయం 125 సంవత్సరాల స్థాపన దినో త్సవాలకు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు అధ్యక్షుడు డా. రియాజ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రొఫెసర్ ఎస్.సుదర్శనరావు, టి.ఉదయవర్లు తదితరులతో కలిసి జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించి ప్రసంగించారు. డా. కె.వి.రమణాచారి అధ్యక్షోపన్యాసంలో గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలన్నారు. ప్రభుత్వాలు వాటిని ఏమాత్రం విస్మరించరాదని స్పష్టం చేశారు. గ్రంథాలయాల్లో ఖాళీ పోస్టు లను భర్తీచేయడానికి కృషి, భాషానిలయానికి 10లక్షల గ్రాంట్‌కు కృషిచేసిన రియాజ్‌ను, ప్రభుత్వాన్ని అభినందించారు. అనంతరం పౌరగ్రంథాలయాలు - నాడు నేడు అన్న అంశంపై 3 సాంకేతిక సమావేశాలు గ్రంథాలయ సదస్సులో అర్థవంతంగా జరిగాయి. ముగింపు సభలో డా. కె.వి.రమణాచారి విశిష్ట అతిథులు రావిచెట్టు రమాదేవి, టి.ఉదయవర్లు, డా. వి.కిషన్‌రావు, రావి శారత తదితరులతో కలిసి హైదరాబాద్ బుక్ ట్రస్ట్ అధినేత్రి గీతా రామస్వామిని ఘనంగా సత్కరించి భాషానిలయం ప్రథమ దాత రావిచెట్టు లక్ష్మీనర్సమ్మ స్మారక పురస్కారం ప్రదానం చేశారు. అనంతరం భాషానిలయం పురోభివృద్ధికి విశేష కృషిచేసిన ప్రముఖులు, స్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రదర్శిం చిన భాగ్యనగర భాషా నిలయం (శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం వైభవం) సాహిత్య రూపకంలో పాల్గొన్న కవులు, కళాకారులను సన్మానించి ఎంతగానో అభినందించారు.

# మనుషులను చంపితే నక్సలిజం పోదు

### ఎంపి మల్లు రవి

**హైదరాబాద్, సెప్టెంబరు 3(జర్నలిస్ట్‌ఫైల్):** మనుషలను చంపితే నక్సలిజం పోదని కాంగ్రెస్ పార్టీ ఎంపి మల్లు రవి అన్నారు. బిజెపి అంటేనే బిజినెస్ పార్టీ అని ఆయన విమర్శించారు. నక్సల్స్‌కు ఒక ఫిలాసఫీ, సిద్ధాంతం ఉందని సిఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల్లో తప్పేమిలేదని ఎంపి మల్లు రవి మంగళవారం పార్టీ నాయకులు రాములు నాయక్, శ్యాంమోహన్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్నారు. పేదప్రజలు సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం కావాలన్నది ముఖ్యమంత్రి అభిమతమని మల్లు రవి అన్నారు. నక్సల్స్ కూడా సామాజిక ఆర్థిక అసమానతలు దూరం కావాలని కోరు కుంటారని ఆయన తెలిపారు. సల్వాజుడుం విషయంలో వ్యతిరేకంగా తీర్పు ఇచ్చిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెట్టిందని బిజెపి నాయకుడు, కేంద్రమంత్రి బండి సంజయ్ అనడంలో అర్థం లేదన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో సల్వాజుడుం వాళ్లు, వాళ్లనువాళ్లే చంపుకునే వ్యవస్థను జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వ్యతిరేకించారని ఆయన వివరించారు. ప్రతిపౌరుడికి అభివృద్ధి ఫలాలు అందాలని కోరుకునే నక్సల్స్ ఫిలాసఫీని ముందుపెట్టుకోవడంలో తప్పేమి లేదన్నారు. అంతమాత్రాన తీవ్ర వాదాన్ని ప్రోత్సహించినట్లు కాదన్నారు. టెర్రరి జానికి, నక్సలిజానికి తేడా ఉందని మల్లు రవి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ విమర్శలు చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు.

# వ్యక్తిగత ఆరోగ్యం పై శ్రద్ధ అవసరం




విజయవాడ, సెప్టెంబరు 3(జర్నలిస్ట్‌ఫైల్):

వృత్తి, ఉద్యోగం, కుటుంబం మొదలైన బాధ్యతల ఒత్తిడిలో వ్యక్తిగత ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయడం తగదని, ప్రతి అధ్యాపకుడూ తన ఆరోగ్యాన్ని కాపాడుకోవటం కోసం తగినంత పోషకాహారం తీసుకుని, ఆరోగ్య సూత్రాలు పాటించాలని కెబిఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి అన్నారు. లక్ష్మీ ఫౌండేషన్ హాస్పటల్స్ సౌజన్యంతో సోమవారం కెబిఎన్ కళాశాల ఎన్ ఎస్ ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యాన ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన కృష్ణవేణి మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని, జంక్ ఫుడ్స్ కి దూరంగా ఉండాలని సూచించారు. హిందూ హై స్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ కోసం కళాశాల తీసుకుంటున్న చర్యలను వివరించారు. డాక్టర్ అశోక్, డాక్టర్ గురవయ్య వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేసారు. వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్.సాంబశివరావు, డి.పవన్, శాంతిబాబు, గౌతమీదేవి పాల్గొన్నారు.

# ఘనంగా పవన్ జన్మదిన వేడుకలు



వి.కోట, సెప్టెంబర్ 3(జర్నలిస్ట్‌ఫైల్):

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదిన సంబరాలు అంబరాన్నంటాయి. తమ ప్రియతమ నేత పుట్టినరోజును పురస్కరించుకుని చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం వి.కోట మండల అధ్యక్షులు ఏ వీ బాబు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించి , ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లను పంచిపెట్టారు. అనంతరం సాయిగార్డెన్ ఆదర్శ పాఠశాలలోని పిల్లలకు,ఎన్టీఆర్ విగ్రహం వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలమనేరు నియోజకవర్గ కార్యదర్శి పూల చైతన్య మోహన్, స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ సోమశేఖర్ రెడ్డి, వీకోట జనసేన నాయకులు రెడ్డి భాస్కర్, ఉప అధ్యక్షులు అయాజ్ భాషా,మిథున్, ప్రధాన కార్యదర్శులు ధనుంజయ్ గౌడు, లోకేష్, కార్యదర్శులు సుందర్, హరీష్ కళ్యాణ్, హరి, హరీష్, నరేష్ భరత్,జ్యోతిష్ ,జన సైనికులు వీర మహిళలు పాల్గొని విజయవంతం చేశారు.

# ఘనంగా డిప్యూటీ సీ ఎం పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలు

## పుట్టిన రోజు వేడుకలలో పాల్గొన్న శాసన సభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు



తిరువూరు , సెప్టెంబర్ 3(జర్నలిస్ట్‌ఫైల్):

డిప్యూటీ సీ ఎం పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సీ ఎం పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భముగా ఏర్పాటు చేసిన పుట్టిన రోజు వేడుకలలో తిరువూరు శాసన సభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రస్థానం గురించి ఏవి ప్రదర్శించగా తిలకించడం జరిగింది. అనంతరం శాసన సభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని నేడు డిప్యూటీ సీఎం గా ఎదిగారని, నిజమైన రియల్ హీరో పవన్ కళ్యాణ్ అని అన్నారు. జగన్ ప్రభుత్వంలో ప్రజలు రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతూ ఉంటే ఆ పరిస్థితుల పైన ఆనాడు పోరాటం చేసిన నాయకుడు పవన్ కళ్యాణ్ అని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ అభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ శాఖ ద్వారా, ముందుగా గుంతలు పూడ్చడం, గ్రామీణ ప్రాంతాల్లో సిసి రోడ్లు వేపించటం లాంటి ఎన్నో కార్యక్రమాలు పవన్ కళ్యాణ్ చేపట్టారని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు చేయాలని, పవన్ కళ్యాణ్ నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో కలకాలం వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా భారీ కేకును కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

# మరెన్నో విజయ శిఖరాలు అందుకోవాలి

## పవన్‌కల్యాణ్‌కు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు

అమరావతి, సెప్టెంబర్ 3(జర్నలిస్ట్‌ఫైల్):

'అడుగడుగునా సామాన్యుడి పక్షం. అణువణువునా సామాజిక స్పృహ. మాటల్లో పదును. చేతల్లో చేవ. జన సైన్యానికి ధైర్యం. మాటకు కట్టుబడే తత్వం. రాజకీయాల్లో విలువలకు పట్టం. స్పందించే హృదయం... అన్నీ కలిస్తే పవనిజం అని నమ్మే అభిమానులు, కార్యకర్తలు, ప్రజల దీవెనలతో నిండు నూరేళ్లూ వర్ధిల్లాలి' అని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'పాలనలో, రాష్ట్రాభివృద్ధిలో మీ సహకారం మరువలేనిది. మరెన్నో విజయ శిఖరాలు అందుకోవాలి' అని ఆకాంక్షించారు.

# సంపూర్ణతా అభియాన్ సారథులకు ఘన సత్కారం



- ఆకాంక్షిత మండలాల ప్రగతికి నీతి ఆయోగ్ పట్టం
- అధికారులకు బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలు ప్రదానం
- ఆకాంక్షిత మండలాలు ఆదర్శ మండలాలుగా నిలవాలి
- 40 సూచికల్లోనూ సంపూర్ణ అభివృద్ధి సాధించాలి
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సత్యకుమార్
- ఈ విజయం కోహినూర్ లాంటి కలెక్టర్ పనితీరుకు దక్కిన గౌరవం



విజయవాడ, సెప్టెంబర్ 3(జర్నలిస్ట్‌ఫైల్):

జిల్లాలోని కేంద్రం ప్రకటించిన ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు ఆకాంక్షిత మండలాలు.. ఆదర్శ మండలాలుగా ప్రపంచం ముందు, భారతదేశం ముందు సగర్వంగా నిలవాలని, కోహినూర్ లాంటి కలెక్టర్ లక్ష్మీశ నేతృత్వంలోని అధికార యంత్రాంగం కృషివల్లే ఈ రెండు మండలాలకు నీతి ఆయోగ్ బంగారు పతకాలు లభించాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. 2023, జనవరి 7న ప్రధానమంత్రి ఆకాంక్షిత బ్లాక్స్ కార్యక్రమం (ఏబీపీ)ని ప్రారంభించి.. సామాజిక, ఆర్థిక, మానవాభివృద్ధి సూచికల్లో అభివృద్ధి సాధించేలా దేశ వ్యాప్తంగా 500 బ్లాక్‌లను ప్రకటించారు. ఇందులో ఎన్‌టీఆర్ జిల్లాకు సంబంధించి ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు బ్లాక్‌లు/మండలాలు ఉన్నాయి. మిగిలిన మండలాలతో సమానంగా ప్రగతి సాధించేలా ప్రత్యేక దృష్టిపెట్టి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, వనరులను సమర్థవంతంగా ఉపయోగించడం జరుగుతోంది. మొత్తం 40 సూచికల్లో ప్రగతిని ఎప్పటికప్పుడు మదిస్తూ.. మెరుగైన ప్రణాళికలను అమలుచేస్తూ ముందుకెళ్లడం జరుగుతోంది. తాజాగా ఈ రెండు మండలాలు ఆరు సూచికల్లో (గర్భిణీల రిజిస్ట్రేషన్ – వైద్య సేవలు, హైపర్ టెన్షన్ స్క్రీనింగ్, డయాబెటిస్ స్క్రీనింగ్, గర్భిణీలకు పోషకాహారం, భూసార పరీక్ష కార్డుల జారీ, స్వయం సహాయక సంఘాల రివాల్వింగ్ ఫండ్) 100 శాతం ఫలితాలు సాధించడంతో నీతి ఆయోగ్ బంగారు పతకాలను ప్రకటించింది. ఈ పతకాలతో పాటు ప్రశంసా పత్రాలను ఈ విజయంలో భాగస్వాములైన అధికారులు, సిబ్బందికి ప్రదానం చేసే సంపూర్ణతా అభియాన్ సమ్మాన్ సమరోహ్ కార్యక్రమం మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగింది. ఇన్‌ఛార్జ్‌మంత్రివర్యులు సత్యకుమార్ యాదవ్.. 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తదితరులతో కలిసి ప్రగతిలో భాగస్వాములైన అధికారులు, సిబ్బందికి బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ముఖ్య అతిథులు కలెక్టర్ లక్ష్మీశను ప్రత్యేకంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలు ఏర్పాటుచేసిన స్టాళ్లను సందర్శించారు. ఆకాంక్ష హాత్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్.. సబ్‌కా ప్రయాస్ మంత్రంతో గౌరవ ప్రధానమంత్రి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషిచేస్తున్నారని, దీని ఫలితమే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలబడిందని పేర్కొన్నారు. అన్ని జిల్లాలు, మండలాలకు పథకాలు అందుతున్నప్పుడు కొన్ని ప్రాంతాలు ఇంకా ఎందుకు వెనకబడుతున్నాయి.. ఆ వెనకబాటుతనాన్ని సరిదిద్ది అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో కేంద్రం ఆకాంక్షిత జిల్లాలు, బ్లాకులను ప్రకటించడం జరిగిందన్నారు. సంతు లిత, సమ్మిళిత అభివృద్ధి లక్ష్యంగా ప్రకటించిన ఈ కార్యక్రమంలో గర్భిణీల రిజిస్ట్రేషన్ – వైద్య సేవలు, హైపర్ టెన్షన్ స్క్రీనింగ్, డయాబెటిస్ స్క్రీనింగ్, గర్భిణీలకు పోషకాహారం, భూసార పరీక్ష కార్డుల జారీ, స్వయం సహాయక సంఘాల రివాల్వింగ్ ఫండ్ సూచికల్లో రెండు మండలాలు 100 శాతం ఫలితాలు సాధించడానికి సమర్థవంతమైన నేతృత్వం, అధికారుల మధ్య సమన్వయం, నిబద్ధత కారణమని, బంగారు పతకాలు అందుకుంటున్న ప్రతిఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రభుత్వ కృషి తోడవడంతో మంచి ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాలను అత్యున్నత శిఖరాలపై నిలబెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారిదని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ.. ఎన్‌టీఆర్ జిల్లా ఎంతో చైతన్యవంతమైన జిల్లా అని.. ఇక్కడి అధికారులు సవాళ్లను ఎదుర్కొంటూ సమన్వయంతో ఎన్నో కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి జిల్లాకు గుర్తింపు తీసుకొస్తున్నారన్నారు. జిల్లాలోని రెండు మండలాలకు నీతి ఆయోగ్ బంగారు పతకాలు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. వికసిత్ భారత్ ఏ 2047 దిశగా చేస్తున్న కృషిలో ప్రారంభించిన ఆకాంక్షిత జిల్లాలు, ఆకాంక్షిత బ్లాకుల కార్యక్రమాలు విజయవంతమవుతున్నాయన్నారు. స్వదేశీ వస్తువులను ప్రోత్సహిద్దామని.. మహిళలు తయారు చేస్తున్న డ్వాక్రా ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. ప్రతి మండలంలోనూ కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్‌సీ) ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీ శివనాథ్ తెలిపారు. 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ.. గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ గారి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆకాంక్షిత జిల్లాలు, ఆకాంక్షిత బ్లాకుల కార్యక్రమం విజయవంతమైందనడానికి ఎన్‌టీఆర్ జిల్లా సాధించిన ఫలితాలే నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధాని, ముఖ్యమంత్రి ఆకాంక్షల మేరకు ఆకాంక్షిత బ్లాకులు అభివృద్ధి సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ విజయంలో భాగస్వాములైన ప్రతిఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. అన్ని పథకాలను సమర్థవంతంగా అమలుచేస్తూ ఆరోగ్యం, విద్య, పోషకాహారం, మౌలిక సదుపాయాలు, వ్యవసాయం.. ఇలా అన్నింటా నమోదవుతున్న ప్రగతిని మదించి, అడ్డంకులను అధిగమించి సుస్థిర అభివృద్ధి సాధించేలా చేయడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని లంకా దినకర్ పేర్కొన్నారు.

### సమష్టి కృషికి ఫలితం

### ఈ విజయం: కలెక్టర్ డా. జి.లక్ష్మీశ..

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. ఆకాంక్షిత బ్లాకుల కార్యక్రమం, ఆరోగ్యం – పోషణ, విద్య, వ్యవసాయం–అనుబంధ రంగాలు, ప్రాథమిక మౌలిక వసతులు, సామాజిక అభివృద్ధిలోని 40 సూచికలు, వాటి వెయిటేజీ తదితరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అన్ని శాఖల సమష్టి కృషితో ముఖ్యంగా వైద్య ఆరోగ్యం, మహిళా, శిశు సంక్షేమం, డీఆర్‌డీఏ అధికారుల కృషి కారణంగా ఈ విజయం సాధించామన్నారు. 2024, జులై 4 నుంచి సెప్టెంబర్ 30 వరకు నిర్వహించిన ప్రత్యేక ప్రచార కార్యక్రమం మంచి ఫలితాలు ఇచ్చినట్లు వివరించారు.

### సత్కారం పొందిన అధికారులు

సీపీవో వై.శ్రీలత, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, ఐసీడీఎస్ పీడీ షేక్ రుక్సానా, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులతో పాటు పెనుగంచిప్రోలు, ఇబ్రహీం పట్నం ఎంపీడీవోలు, ఏబీపీ కోఆర్డినేటర్లు జి.మోహన్ సందీప్ (పెనుగంచిప్రోలు), పి.శ్రీనివాస్ (ఇబ్రహీంపట్నం), వివిధ మండలస్థాయి అధికారులు, వైద్య ఆరోగ్యం, వ్యవసాయం, సామాజిక అభివృద్ధి ఫ్రంట్ లైన్ వర్కర్లు తదితరులు సత్కారం అందుకున్నారు. కార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ పాల్గొన్నారు.

# ఘనంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి

మైలవరం, సెప్టెంబర్ 3(జర్నలిస్ట్‌ఫైల్):

మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా మైలవరం మండలం వెల్వడం గ్రామం లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఘన నివాళి అర్పించారు. గ్రామ వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుడు తోట తిరుపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కచేరి చావడి వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల కష్టాలను తీర్చి, సంక్షేమమే రెండు కళ్ళుగా పాలించిన నాయకుడు అని అన్నారు.



# ఆహ్లాదకర వాతావరణంలో టీచర్స్ డే పోటీలు







విజయవాడ పశ్చిమ,
సెప్టెంబర్ 3(జర్నలిస్ట్‌ఫైల్):

ఎస్.కె. పి. వి. వి. హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో నడపబడుతున్న ఏడు విద్యా సంస్థల్లో ( ఎస్.కె పివివి హిందూ హైస్కూల్, ఎం ఎస్ ఆర్ హై స్కూల్, చిట్టూరి హై స్కూల్, కేబీఎన్ కళాశాల, పిఎస్ సిఎంఆర్ కళాశాల, ఎస్.ఆర్.వి బిఈడి కళాశాల ) లో విధులు నిర్వహిస్తున్న సుమారు 800 మంది ఉపాధ్యా యులకు వివిధ అంశాలపై పాలకవర్గ సభ్యులు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం సాయంత్రం ఆహ్లాదకర వాతావరణంలో పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా నాటక ప్రదర్శన, కరాకే, విజ్ఞాన అంత్యాక్షరి, ఫన్ విత్ టీచింగ్, ట్రెజర్ హంట్, సినిమా గీతాల పేరడీ సాంగ్స్, వివిధ రకాల అంశాలలో ఆటల పోటీలు అద్యంతం ఉల్లాసంగా ఉత్సాహంగా సాగాయి. అన్ని విద్యాసంస్థల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులందరూ ఒకే వేదికపై సందడి చేశారు. ఎస్. కె. పి. వి. వి హిందూ హైస్కూల్స్ కమిటీ సభ్యులు పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హిందూ హైస్కూల్స్ జనరల్ సెక్రెటరీ గోపిశెట్టి మల్లయ్య, ప్రెసిడెంట్ టి శేషయ్య, ట్రెజరర్ బాబా విజయ్ కుమార్, కేబీఎన్ కాలేజీ సెక్రటరీ డాక్టర్ టి శ్రీనివాస్, ఇంజనీరింగ్ కాలేజీ సెక్రటరీ అమర్ సుధీర్, బీఈడీ కాలేజీ సెక్రటరీ మాజేటి సతీష్, హిందూ హైస్కూల్ కార్యదర్శి కె.ఎల్.వి మోహనరావు, ఎంఎస్ఆర్ హై స్కూల్ కార్యదర్శి జి. రామారావు తదితరులు పాల్గొన్నారు.

# నియంతలతో మోడీకి సావాసమా?



## ఎంత చేసినా.. చివరికి భారత్ మాతోనే: అమెరికా

**వాషింగ్టన్, సెప్టెంబరు 3:** షాంఘై సహకార సదస్సు (ఎస్ఇఒ) తర్వాత భారత్‌పై ట్రంప్ కార్యవర్గం అక్కసు మరింత పెరిగిపోయింది. తాజాగా అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ మాట్లాడుతూ ఎస్ఇఒ సదస్సు మొత్తం నాటకీయంగా ఉందని అభివర్ణించారు. ఆయన ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడాన్ని విమర్శించారు. ఆ చర్యలు ఉక్రెయిన్ యుద్ధాన్ని ఎగదోసేలా ఉన్నాయన్నారు. ఎస్ఇఒ సదస్సు సుదీర్ఘంగా జరిగినా.. నాటకీయంగా ఉందని పేర్కొన్నారు. ఏది ఏమైనా భారత్ మాత్రం అతిపెద్ద ప్రజాస్వామ్యమన్నారు. దాని విలువలు మాకు దగ్గరగా ఉంటాయి గానీ, చైనా, రష్యాలకు కాదన్నారు. చైనా, భారత్‌లు రష్యా యుద్ధానికి బలం చేకూరుస్తుండటం వల్లే తాము, మిత్ర దేశాలు రంగంలోకి దిగామని బెసెంట్ పేర్కొన్నారు. భారత్-అమెరికా బంధం బలమైన పునాదులపై ఉందన్నారు. ఇరు దేశాలు అభిప్రాయభేదాలను పరిష్కరించుకొనే సత్తా ఉన్నవేనని అన్నారు. అదే సమయంలో భారత్‌పై ఆంక్షలకు వాణిజ్య చర్చలు మందకొడిగా సాగడం కూడా ఓ కారణమని పేర్కొన్నారు. రష్యా చర్యలకు అన్ని ఆప్షన్లు తమ పరిశీలనలో ఉన్నట్లు బెసెంట్ పేర్కొన్నారు. మరోవైపు భారత ప్రధాని నరేంద్రమోడీ- రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీ ముగిసిన కొన్ని గంటల సమయంలోనే ట్రంప్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. భారత్‌తో వాణిజ్యం పూర్తిగా ఏకపక్షంగా ఉందని పేర్కొన్నారు. అధిక సుంకాల కారణంగా భారత్‌కు అమెరికా వస్తువులను విక్రయించలేకపోతోందని ఆరోపించారు. భారత్ జీరో టారిఫ్‌లకు అంగీకరించినా అప్పటికే సమయం చేదాటిపోయిందన్నారు.

ట్రంప్ కార్యవర్గం మొత్తం భారత్‌పై ఆంక్షలకు రష్యా చమురు, వాణిజ్య చర్చలను కారణంగా చెబుతుంటే ప్రత్యర్థులు మాత్రం ట్రంప్ స్వార్థంతో న్యూఢిల్లీని దూరం చేసుకొన్నట్లు చెబుతున్నారు. ఆయన నోబెల్ బహుమతి పొందేందుకు భారత్ సహకరించలేదన్న అక్కసే కారణమని కొందరు అంటున్నారు. తాజాగా అమెరికా మాజీ ఎన్ఎస్ఎ జాన్ సులేవాన్ మాట్లాడుతూ పాకిస్థాన్‌తో కుటుంబ వ్యాపార ఒప్పందాల కోసం భారత్ స్నేహాన్ని అమెరికా అధ్యక్షుడు వదులుకొన్నారని చెప్పారు.

**అది సిగ్గుచేటు:** ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో మరోసారి భారత్‌పై తన నోటికి పనిచెప్పారు. అతిపెద్ద నియంతలతో కలిసి ప్రధాని మోడీ వేదిక పంచుకోవడం సిగ్గుచేటన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ భారత్ ఐరోపా, ఉక్రెయిన్‌తో కలిసి పనిచేయాలని రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేయాలన్నారు. శాంతికి మార్గం అన్నివైపుల నుంచి వెళుతుందని దానిలో న్యూఢిల్లీ నుంచి కూడా అని పేర్కొన్నారు.

# జిన్‌పింగ్ రైట్‌హ్యాండ్‌తో మోడీ భేటీ..ఆంతర్యమేమిటి?



**బీజింగ్, సెప్టెంబరు 3:** చైనా కమ్యూనిస్టు పార్టీలో కైక్వీ చాలా కఠినమైన వ్యక్తి. ఆయను అసలు నవ్వడు అనే పేరుంది. అతడు అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు కుడిభుజం అని పార్టీ వర్గాలు చెబుతుంటాయి. పార్టీలో పలు కీలక పదవులను ఆయన నిర్వహిస్తున్నారు. బీజింగ్‌లోని విదేశీ దౌత్యవేత్తలు ఆయనతో భేటీ కావడానికి ఆసక్తి చూపినా చాలావరకు ఆయన వాటికి దూరంగా ఉంటారు. కానీ, ఇటీవల ప్రధాని మోడీ చైనా పర్యటన సందర్భంగా అధ్యక్షుడు జిన్‌పింగ్ స్వయంగా కైక్వీని రంగంలోకి దింపారు. భారత ప్రధానితో ఇరుదేశాల సంబంధాలపై చర్చించాలని సూచించారు. ప్రధాని మోడీ-కైక్వీ మధ్య దాదాపు 45నిమిషాలపాటు సమావేశం జరగడం తింజాయన్ దౌత్యవర్గాల్లో ప్రకంపనలు సృష్టించాయి. ఈ సందర్భంగా ప్రధాని తన ఆలోచనలను ఆయనతో పంచుకున్నారు. ఎస్‌సిఒలో పాల్గొన్న ఏ దేశ నాయకుడినీ ఆయన బహిరంగంగా కలవలేదు. కానీ, మోడీ జిన్‌పింగ్ ద్వైపాక్షిక భేటీకి మాత్రం హాజరయ్యారు. ఇరు దేశాల సంబంధాలు వేగంగా సాధారణ స్థితికి చేరడానికి ఈ భేటీ దోహదపడుతుందని నమ్ముతున్నారు. చైనాలోని భారత వ్యతిరేక వర్గాలకు ఈ భేటీ బలమైన సంకేతాలు పంపినట్లు భావిస్తున్నారు.

**ఎవరీ కైక్వీ..?** కైక్వీ ప్రస్తుతం కమ్యూనిస్టు పార్టీ సెక్రటేరియట్‌లో ఫస్ట్‌ర్యాంకింగ్ హోదా, పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. అన్నింటికీ మించి జిన్‌పింగ్‌కు అత్యంత సన్నిహితుడు. ఆయనకు చీఫ్ ఆఫ్ స్టాఫ్. మావో యుగం తర్వాత ఈ రెండు పదవులు ఏకకాలంలో చేపట్టిన వ్యక్తి ఆయనే. చైనాలోని అధికార క్రమంలో ఐదో స్థానంలో ఉన్నారు. ఫుజియాన్ ప్రావిన్స్‌కు చెందిన కై, షీ జిన్‌పింగ్‌ను 1980లో తొలిసారి కలిశారు. ప్రస్తుతం ర్యాంకులు ఎలా ఉన్నా చైనా ప్రీమియర్ లి క్వియాంగ్‌తో సమానంగా ఆయన మాట చెల్లుబాటుఅవుతుంది.

# మేడిన్ ఇండియా విక్రమ్ 32 చిప్ ప్రధాని మోడీకి అందజేత

## సెమికాన్ సదస్సులో అందచేసిన కేంద్ర మంత్రి అశ్వినివైష్ణవ్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 3:** కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ మంగళవారం భారతదేశంలో తయారు చేసిన తొలి చిప్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి అందజేశారు. 'విక్రమ్ 32' బిట్ ప్రాసెసర్, నాలుగు ఆమోదించిన ప్రాజెక్టుల టెస్ట్ చిప్‌లను కూడా ప్రధాని మోదీకి అందించారు. నేటి సాంకేతికతకు సెమీకండక్టర్లు చాలా ముఖ్యమైనవి. ఆరోగ్య సంరక్షణ, రవాణా, కమ్యూనికేషన్, రక్షణ, అంతరిక్షం వంటి ముఖ్యమైన వ్యవస్థలలో ఇది ఉపయోగించడం జరుగుతుంది. చైనాఅమెరికా మధ్య నిజమైన యుద్ధం చిప్ పర్యావరణ వ్యవస్థకు సంబంధించినదే. ప్రపంచం మొత్తం డిజిటల్, ఆటోమేషన్ వైపు కదులుతున్నందున, ఆర్థిక భద్రత, వ్యూహాత్మక స్వాతంత్రం కోసం సెమీకండక్టర్లు అవసరం అయ్యాయి. పధానమంత్రి మోదీ మంగళవారం ఢిల్లీలో సెమికాన్ ఇండియా 2025ను ప్రారంభించారు. 2021 నుండి దేశంలో 10 సెమీకండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. దీనిపై 18 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. కొన్ని సంవత్సరాల క్రితం, ప్రధానమంత్రి దార్శనిక ఆలోచనతో కొత్త ప్రారంభం కోసం మేము మొదటిసారి కలిశామని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. మేము ఇండియా సెమీ కండక్టర్ మిషన్‌ను ప్రారం భిం చాము. కేవలం 3.5 సంవత్స రాలలో, ప్రపంచం భారతదేశం వైపు నమ్మకంగా చూస్తోంది. నేడు, దేశంలో ఐదు సెమీకండక్టర్ యూనిట్ల తయారీ వేగంగా జరుగుతోంది. ఇప్పుడే మొదటి మేడ్‌ఇన్ ఇండియా" చిప్‌ను ప్రధాని మోదీకి అందించామని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా వెల్లడించారు.

# నేను చనిపోయినా ఆజాద్ మైదాన్ వీడి వెళ్లేదిలేదు..

## మరాఠా రిజర్వేషన్ ఉద్యమకారుడు మనోజ్‌పాటిల్ జరాంగే



**ముంబయి, సెప్టెంబరు 3:** మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించాలంటూ నిరాహార దీక్ష చేపట్టిన మనోజ్ జరంగే పాటిల్ తను చనిపోయినా సరే నిరాహార దీక్ష చేస్తున్న ఆజాద్ మైదానాన్ని వదిలి వెళ్లేది లేదని తేల్చిచెప్పారు. ముంబయి పోలీసులు నిరాహార దీక్ష కొనసాగించడానికి అనుమతి నిరాకరించిన నేపథ్యంలో మనోజ్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇకపై నిరసనకారులు ముం బయిలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని మహారాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంపై మనోజ్ మండిపడ్డారు. మరాఠా రిజర్వేషన్లకు మద్దతుగా ఎగిసిపడతున్న ప్రజా నిరసనలను మీరు తట్టుకోలేరు అంటూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీసు హెచ్చరించారు. మీరు ప్రజా నిరసనలను తట్టుకోలేరు. నేను చనిపోయినా సరే, ఈ స్వేచ్ఛా మైదానం నుంచి లేవను. ఒక వేళ నేను చనిపోతే, మీరు మౌనంగా ఉండండి. ఒక వేళ మీరు పోలీసులను ఉపయోగించి, నిరసనకారులను తరిమికొట్టాలనుకుంటే, దానికి మీ ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించకోకతప్పదని జరాంగె పేర్కొన్నారు. మరాఠాలకు రిజర్వేషన్లు కోరుతూ మనోజ్ జరంగే పాటిల్ చేపట్టిన నిరాహార దీక్ష వల్ల ముంబయి జనజీవనం స్తంభించింది. ముఖ్యంగా ఆజాద్ మైదాన్ వెలుపల నిరసనకారుల వాహనాలు ఉండడంతో ట్రాఫిక్ జామ్ అయిపోయి, సామాన్య ప్రజానీకానికి తీవ్రమైన ఇబ్బంది ఏర్పడింది. ఈ నేపథ్యంలో బొంబాయి హై కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. మనోజ్ పాటిల్ నిర్దేశిత నిబంధనలు, షరతులు ఉల్లంఘింటారని, అందువల్ల దీక్షకు ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. లేకుంటే కోర్టు ధిక్కరణ కింద కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. దీనితో ముంబయి పోలీసులు ఆజాద్ మైదాన్ ప్రాంగణాన్ని ఖాళీ చేయాలని నిరసనకారులను కోరారు. న్యాయం జరుగుతుందని నాకు 100 శాతం నమ్మకం ఉంది. ప్రస్తుతం ముంబయిలో ఎక్కడా ట్రాఫిక్ జాంలేదు. మావాళ్లు తమ వాహనాలను రోడ్డుపై నుంచి తొలగించి, షెడ్లలో పార్క్ చేశారు. ఆజాద్ మైదాన్ నుంచి మమ్మల్ని తరిమికొట్టాలనుకుంటే, అది ప్రభుత్వానికే నష్టం. గత రెండేళ్లుగా మేము శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్నాం. మేము ప్రజాస్వామ్య పద్ధతిలో, చట్టం పరిధిలోనే నిరసనలు కొనసాగిస్తున్నాం. కోర్టు కూడా మాకు న్యాయం చేస్తుందని మేము ఆశిస్తున్నామని, మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించాలనే తమ డిమాండ్ నెరవేరే వరకు నిరసనకారులు ముంబయి విడిచి వెళ్లరని మనోజ్ పాటిల్ స్పష్టం చేశారు.

# 100 బిలియన్ డాలర్లకు ద్వైపాక్షిక వాణిజ్యం

## ఢిల్లీలో అరబ్‌ఎమిరేట్స్ మంత్రితో కేంద్ర మంత్రి సమీక్ష



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 3:** భారత్, యూఏఈ ఆర్థిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా 2030 నాటికి చమురేతర ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 100 బిలియన్ డాలర్లకు చేర్చాలని సమున్నత లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయి. ఇరు దేశాల మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందాన్ని (సెపా) సమీక్షించిన అనంతరం, మారుతున్న ప్రపంచ వాణిజ్య పరిస్థితుల నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. ఢిల్లీలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, యూఏఈ విదేశీ వాణిజ్య మంత్రి థానీ బిన్ అహ్మద్ అల్ జెయోదీ మధ్య ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ భేటీ వివరాలను కేంద్ర ప్రభుత్వం విడుదలచేసింది. సెపా ఒప్పందం కింద సాధించిన ప్రగతిని మంత్రులిద్దరూ సమీక్షించారు. భవిష్యత్తులో పునరుత్పాదక ఇంధనం, డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలలో కలిసి పనిచేయాలని అంగీకారానికి వచ్చారు. వాణిజ్యాన్ని మరింత సులభతరం చేసేందుకు స్థానిక కరెన్సీ సెటిల్‌మెంట్ సిస్టమ్ (రూపాయి దిర్హామ్), యూఏఈలో 'భారత్ మార్ట్' ఏర్పాటు వంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఇరు దేశాల మంత్రులు అభిప్రాయపడ్డారు. వాణిజ్య సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంచుకోవడం ద్వారా సెపా పర్యవేక్షణను మెరుగుపరచాలని నిర్ణయించారు. భారత ఫార్మా కంపెనీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు యూఏఈలో కొత్తగా ఏర్పాటైన ఎమిరేట్స్ డ్రగ్ ఎస్టాబ్లిష్‌మెంట్ కీలక పాత్ర పోషిస్తుందని భారత ప్రతినిధి బృందం ఆశాభావం వ్యక్తం చేసింది. ఈసమావేశంలో భాగంగా ఫార్మా, ఆహార రంగాల ప్రతినిధులతో ప్రత్యేకంగా చర్చలు జరిపారు. దీంతో పాటు 2026లో దుబాయ్‌లో జరిగే 'గల్ఫ్ ఫుడ్' ప్రదర్శనలో భారత్‌ను భాగస్వామ్య దేశంగా గుర్తించేందుకు ఒప్పందం కుదిరింది.

# ప్రత్యేకరైలులో చైనా చేరుకున్న కొరియా అధినేత కిమ్‌జాంగ్ ఉన్



**ప్యాంగ్యాంగ్(ఉత్తరకొరియా), సెప్టెంబరు 3:** అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా నేతృత్వంలోని ప్రపంచ కూటమికి బలమైన సంకేతాలు పంపుతూ ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ మంగళవారం చైనాలో అడుగుపెట్టారు. రెండో ప్రపంచ యుద్ధం ముగిసి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీజింగ్‌లో జరగనున్న సైనిక కవాతులో ఆయన పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కూడా హాజరుకానుండటం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ప్యాంగ్యాంగ్ నుంచి తన ప్రత్యేక బుల్లెట్‌ప్రూఫ్ రైలులో విదేశాంగ మంత్రి చో సోన్‌హుయ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి బయల్దేరిన కిమ్ బీజింగ్‌కు చేరుకున్నారని ఉత్తర కొరియా అధికారిక మీడియా వెల్లడించింది. 2023లో రష్యా పర్యటన తర్వాత కిమ్ విదేశాలకు వెళ్లడం ఇదే తొలిసారి. అలాగే, 2019 జనవరి తర్వాత ఆయన చైనాలో పర్యటించడం కూడా ఇదే ప్రథమం.



# ఇళ్లల్లోకి యమున వరద నీరు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 3:** గత కొన్నిరోజులుగా ఉత్తరాదిలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. హర్యానాలోని మయునానగర్‌లోని హత్నికుండ్ బ్యారేజీ వద్ద నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతుండడంతో అధికారులు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ఢిల్లీలోని యమునా నది డేంజర్ మార్క్ దాటి ప్రవహిస్తోంది. ఇళ్లల్లోకి వరద నీరు చేరుతుండడంతో యమునా తీర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు వరద హెచ్చరికను జారీ చేశారు. మంగళవారం తెల్లవారురూమున యమునా నది 205.33 మీటర్ల డేంజర్ మార్క్ దాటడంతో దేశ రాజధానిలో భారీ వరదలు పోటెత్తే అవకాశం ఉందని ఢిల్లీ ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు వెంటనే ఖాళీ చేసి, ప్రభుత్వం ఏర్పాటుచేసిన సహాయక శిబిరాలకు చేరుకోవాలని సూచించింది. మరోవైపు మంగళవారం సాయంత్రంలోగా యమునా నది 206 మీటర్ల ఎత్తుకు చేరుకోవచ్చని వాతావరణశాఖ అంచనావేస్తోంది. దీంతో పలు కార్యాలయాలు తమ ఉద్యోగులను ఇంటి నుంచే పని చేయాలని సూచించాయి. పలు పాఠశాలలు ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నాయి. భారీ వర్షాలకు వరద నీరు పోటెత్తడంతో ఢిల్లీ రోడ్లు జలమయమయ్యాయి. ఢిల్లీ, జైపూర్ హైవేపై 7,8 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. దాదాపు 3 గంటలకు పైగా ప్రయాణికులు ట్రాఫిక్‌లో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రతిపక్షాలు ఢిల్లీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.



# పంజాబ్ ఆప్‌లో భగ్గుమన్న విభేదాలు

**సనౌర్ (పంజాబ్), సెప్టెంబరు 3:** పంజాబ్‌లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లో అంతర్గత విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. పార్టీ ఢిల్లీ నాయకత్వాన్ని, ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌ను బహిరంగంగా విమర్శించిన కొన్ని గంటల్లోనే సనౌర్ ఎమ్మెల్యే హార్మీత్ సింగ్ పఠాన్‌మజ్రా అత్యాచారం ఆరోపణలపై అరెస్ట్ కావడం రాజకీయంగా కలకలం రేపుతోంది. గత రాత్రి 10:17 గంటలకు పటియాలా సివిల్ లైన్స్ పోలీస్ స్టేషన్‌లో హర్మీత్ సింగ్ మాజీ భార్య ఫిర్యాదు చేశారు. 2014 ఫిబ్రవరి నుంచి 2024 జూన్ మధ్య కాలంలో ఎమ్మెల్యే తనపై అత్యాచారానికి పాల్పడ్డారని, మోసం చేశారని, బెదిరించారని ఆమె ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసు నమోదైన కొన్ని గంటల్లోనే, మంగళవారం ఉదయం హర్యానాలోని కర్నాల్‌లో ఉన్న బంధువుల గ్రామంలో హార్మీత్ సింగ్‌ను పంజాబ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## శబరిమలై ఆచారాలను పరిరక్షిస్తాం.. టిడిబి ఛైర్మన్‌ప్రశాంత్

**తిరువనంతపురం, సెప్టెంబరు 3:** కేరళలోని ప్రసిద్ధ శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలో మహిళలను అనుమతించాలనే తన వైఖరి నుంచి ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు వెనక్కి తగ్గుతోంది. శబరిమల ఆచారాలను పరిరక్షిస్తామని, సుప్రీంకోర్టును ఒప్పించడానికి ప్రయత్నిస్తామని టీడీబీ అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్ వెల్లడించారు. మహిళల ప్రవేశానికి సంబంధించిన పిటిషన్‌లో న్యాయ నిపుణులతో సంప్రదించిన తర్వాత కొత్త అఫిడవిట్‌ను అత్యున్నత న్యాయస్థానంలో సమర్పించాలని బోర్డు యోచిస్తోంది. సెప్టెంబరు 20న పంబా నది ఒడ్డున గ్లోబల్ అయ్యప్ప సమావేశం భారీ ఎత్తున నిర్వహిస్తామని దేవాదాయ శాఖ మంత్రి వి.ఎన్.వాసవన్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్ మీడియాతో మాట్లాడారు. మహిళల ప్రవేశ పిటిషన్‌లో న్యాయనిపుణులతో సంప్రదించి కొత్త అఫిడవిట్ సమర్పించాలని బోర్డు పరిశీలిస్తోంది. ఈ విషయం ఇప్పుడు సుప్రీం కోర్టు ముందు ఉంది.



# 1400కు పెరిగిన అఫ్ఘాన్ భూకంప మృతులు

## 3వేలమందికిపైగా గాయాలు, భారత్‌నుంచి ఆహారం, టెంట్లు సరఫరా

**కాబూల్, సెప్టెంబరు 3:** అఫ్ఘానిస్థాన్‌లో సంభవించిన భారీ భూకంపం కారణంగా మరణించిన వారి సంఖ్య 1400 దాటింది. మరో 3,000 మందికిపైగా గాయపడ్డారు. 6.0 తీవ్రతతో సంభవించిన భూకంప తాకిడికి గ్రామాలకు గ్రామాలే ధ్వంసమయ్యాయి. తాలిబన్ ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వేల సంఖ్యలో ప్రజలు ఇంకా శిథిలాల కిందే చిక్కుకొని ఉంటారని అనుమానిస్తున్నారు. మరోవైపు భారత్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ, అన్ని రకాలుగా సాయం చేస్తామని హామి ఇచ్చారు. బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులను భారత్ కంటైనర్లలో పంపించింది. పర్వత ప్రాంతమైన తూర్పు అఫ్గానిస్థాన్‌లో భూకంపం తాకాయి. శిథిలాల కింద అనేకమంది ఇంకా సజీవంగా ఉన్నారని అనుమానిస్తున్నారు. శిథిలాల కింద చిక్కుకున్న ఆప్తులను రక్షించుకొనేందుకు చేతులతోనే చాలా మంది మట్టిని తవ్వితీస్తున్న దృశ్యాలు కంటతడి పెట్టిస్తున్నాయి. సాయం అందడంలో జరుగుతున్న జాప్యం కారణంగా :వీరంతా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. రాత్రంతా పలు మార్లు భూమి కంపిస్తూనే ఉందని తెలిపారు. పాకిస్థాన్‌లోనూ పలు ప్రాంతాల్లో భూమి కంపించింది. ఇప్పటికే మానవతా సాయాన్ని భూకంప ప్రభావిత ప్రాంతాలకు పంపించడం ప్రారంభించామని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చెప్పారు. వాటిలో బియ్యం, ఇతర ఆహార పదార్థాలు ఉన్నాయి. అంతకు ముందు భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్, ఆఫ్గానిస్థాన్ విదేశాంగ మంత్రి మోలావి అమీర్ ఖాన్ ముత్తాకోతో మాట్లాడారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కాబుల్‌కు భారత్ 1000 కుటుంబాలకు సరిపడ టెంట్లను పంపించిందని పేర్కొన్నారు. 15 టన్నుల ఆహార సామగ్రిని పంపించందని తెలిపారు. అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈ కష్ట సమయంలో ఆప్గానిస్థాన్‌కు భారత్ అండగా ఉంటుందని అన్నారు.

# బాలివుడ్ డైరెక్టర్ సంజయ్‌లీలా భన్సాలీపై ఎఫ్ఐఆర్

**జైపూర్, సెప్టెంబరు 3:** ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ వివాదంలో చిక్కుకున్నారు. తన ప్రతిష్ఠాత్మక చిత్రం 'లవ్ అండ్ వార్' కోసం లైన్ ప్రొడ్యూసర్‌గా నియమించుకుని, డబ్బులు చెల్లించకుండా మోసం చేయడమే కాకుండా, తనపై దాడి చేసి బెదిరించారని ఆరోపిస్తూ ఓ వ్యక్తి ఫిర్యాదు చేయడంతో ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ ఘటన రాజస్థాన్‌లో చోటుచేసుకుంది. రాజస్థాన్‌లోని బికనీర్ జిల్లా, బిచ్వాల్ పోలీస్ స్టేషన్‌లో ఈ ఎఫ్ఐఆర్ నమోదైనట్లు పోలీసులు తెలిపారు. జోధ్‌పూర్‌కు చెందిన రాధా ఫిల్మ్స్ అండ్ హాస్పిటాలిటీ సీఈఓ ప్రతీక్ రాజ్ మాథుర్ ఈ ఫిర్యాదు చేశారు. 'లవ్ అండ్ వార్' చిత్రానికి తనను లైన్ ప్రొడ్యూసర్‌గా నియమించుకున్నారని, ఈ మేరకు అధికారిక ఒప్పందం లేకపోయినా ఈమెయిల్ ద్వారా ధ్రువీకరించారని ఆయన తెలిపారు. ప్రభుత్వ అనుమతులు, భద్రతా ఏర్పాట్లు వంటి కీలక పనులన్నీ తానే చూసుకున్నానని, అయితే తర్వాత తనను తొలగించి, ఇవ్వాల్సిన పారితోషికం చెల్లించలేదని మాథుర్ ఆరోపించారు. కేవలం డబ్బులు ఎగ్గొట్టడమే కాకుండా, తనతో దురుసుగా ప్రవర్తించారని కూడా మాథుర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆగస్టు 17న బికనీర్‌లోని హోటల్ నరేంద్ర భవన్‌లో భన్సాలీ, ఆయన ప్రొడక్షన్ మేనేజర్లు ఉత్కర్ష్ బాలి, అర్వింద్ గిల్ తనను తోసివేసి, తీవ్ర పదజాలంతో దూషించారని ఆరోపించారు. భవిష్యత్తులో తన కంపెనీకి అవకాశాలు రాకుండా అడ్డుకుంటామని బెదిరించారని కూడా ఆయనతెలిపారు. నమ్మకద్రోహం, చీటింగ్ కింద ఈ కేసునమోదు చేశారు. మొదట పోలీసులు కేసునమోదు చేయడానికి నిరాకరిం చడంతో మాథుర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

# సంక్షిప్తంగా..

## మహారాష్ట్ర మసీదులో గణేశుడు



**ముంబయి, సెప్టెంబరు 3:** మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లా గొట్ఖిండీ గ్రామం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఇక్కడ స్థానికులు ఏటా గణేశుడి విగ్రహాన్ని మసీదులో ప్రతిష్టించి పూజలు చేస్తున్నారు. 1980లో ఈ సంప్రదాయం ప్రారంభమైంది. ఆ యేడాది భారీ వర్షం కారణంగా ఓ గణపతి విగ్రహాన్ని మసీదులోకి మార్చారు. అప్పటి నుంచి ఏటా మసీదులోనే వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించి గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహిస్తున్నారు. హిందూ ముస్లింలు, ఉమ్మడిగా ఈ వేడుకల్లో పాల్గొంటున్నారు. ఒకసారి బక్రీద్, వినాయక చవితి ఒకేసారి రాగా, ముస్లింలు నమాజ్ మాత్రమే చేసి, కుర్బానీకి దూరంగా ఉన్నారు.



## ఐసియులో శిశువులను కరిచిన ఎలుకలు

**భోపాల్, సెప్టెంబరు 3:** ప్రభుత్వ ఆసుపత్రిలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉన్న ఇద్దరు శిశువులను ఎలుకలు కరిచిన ఘటన మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో చోటుచేసుకుంది. వారం కిందట జన్మించిన ఇద్దరు శిశువులను, రాష్ట్రంలోని అతిపెద్ద ఆసుపత్రుల్లో ఒకటైన మహారాజ యశ్వంతరావు చికిత్సాలయలోని నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చేర్చారు. ఐసియూలో చికిత్స తీసుకుంటున్న ఆ శిశువుల శరీరాలపై గాయాలను గుర్తించిన నర్సుల బృందం డాక్టర్లకు సమాచారం అందించారు. దీంతో ఐసియులో ఉన్న సిసిటివిని పరిశీలిస్తే ఆ పసిపిల్లల వద్దకు ఎలుకలు వచ్చిన దృశ్యాలు కనిపించాయి. దీంతో అవే శిశువులను గాయ పరిచినట్లు అనుమానిస్తున్నారు. మొదటగా ఈ ఘటన ఆదివారం జరుగగా, మరుసటి రోజే మరో ఘటన జరగడం గమనార్హం. దీంతో అక్కడి వైద్య నిర్వాహకుల నిర్లక్ష్యానికి నిదర్శ నగా కనిపిస్తోందని శిశువుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

## సూడాన్‌లో కొండచరియలు విరిగిపడి 1000 మంది మృతి



**ఖర్టూమ్, సెప్టెంబరు 3:** సూడాన్‌లో ఓ పెను విషాదం చోటుచేసుకుంది. పశ్చిమ సూడాన్‌లోని మర్రా పర్వత ప్రాంతంలో కొండచరియలు విరిగిపడటంతో ఏకంగా వెయ్యి మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘోర దుర్ఘటనలో ఓ గ్రామం పూర్తిగా నేలమట్టం కాగా, ఒక్కరు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. సూడాన్ లిబరేషన్ మూవ్‌మెంట్/ఆర్మీ (ఎస్ఎల్ఎం/ఏ) ఈ విషయాన్ని ధృవీకరించింది. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆగస్టు 31వ తేదీన ఈ దుర్ఘటన జరిగిందని అబ్దెల్వాహిద్ మహ్మద్ నూర్ నేతృత్వంలోని ఈ బృందం తెలిపింది. మృతుల్లో మహిళలు, చిన్నారులు, పురుషులు ఉన్నారని పేర్కొంది. ఉత్తర డార్ఫర్ రాష్ట్రంలో సైన్యానికి, పారామిలిటరీ రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్ఎస్ఎఫ్)కు మధ్య భీకర అంతర్యుద్ధం జరుగుతుండటంతో ప్రాణాలు కాపాడుకునేందుకు ప్రజలు మర్రా పర్వత ప్రాంతాలకు శరణార్థులుగా వలస వచ్చారు. ఇప్పటికే ఆహారం, మందుల కొరతతో ఇబ్బందులు పడుతున్న వీరు, ఇప్పుడు ప్రకృతి విపత్తు రూపంలో మృత్యువాత పడటం అందరినీ కలచివేస్తోంది.



## ప్రపంచ యాత్రికుని బైక్ చోరీ

**నాటింగ్‌హామ్ (బ్రిటన్), సెప్టెంబరు 3:** బైక్ పై ప్రపంచ యాత్రకు బయ లుదేరిన ముం బై యువకుడు యోగేశ్ అలెకరికి యూకేలో చేదు అనుభవం ఎదురైంది. నాటింగ్ హామ్ లోని ఓ పార్క్‌లో పెట్టిన బైక్ ను దొంగలు ఎత్తుకెళ్లారు. స్థానికంగా ఉంటున్న ఓ స్నేహితుడిని కలిసి బ్రేక్ ఫాస్ట్ చేసి తిరిగొచ్చే సరికి బైక్ మాయమైందని యోగేశ్ వాపోయాడు. నలుగురు యువకులు తన బైక్ ను ఎత్తుకెళ్లినట్లు సీసీటీవీ కెమెరాల్లో రికార్డైందని చెప్పాడు. పాస్ పోర్ట్, వీసా వంటి కీలక డాక్యుమెంట్లతో పాటు డబ్బు కూడా అం దులోనే ఉండిపోయిందని పేర్కొన్నాడు. ప్రస్తు తం తాను కట్టుబట్టలతో మిగిలానని వాపో యాడు. 2025 మే 1న ముంబై నుంచి బైక్ పై ప్రపంచయాత్రకు బయలుదేరానని యోగేశ్ చెప్పారు. ఇప్పటి వరకు 118రోజుల్లో 17 దేశా లను చుట్టేశానని, మొత్తంగా 24వేల కిలోమీ టర్లు తిరిగానని యోగేశ్ వివరించాడు. బైక్ చోరీ కావడంతో ప్రస్తుతం యాత్ర కొనసాగించాలన్నా ఇంటికి చేరుకోవాలన్నా వీలులేకుండా పోయిం దని నిరాశ వ్యక్తం చేశాడు. దొంగలు బైక్ ఎత్తుకెళుతున్న సీసీటీవీ ఫుటేజీని షేర్ చేస్తూ తన ఈ పోస్టును షేర్ చేయాలని, అధికారులు వేగంగా స్పందించేందుకు సాయం చేయాలని ఫాలోవర్లకు విజ్ఞప్తి చేశాడు.

## ఓడిఎఫ్ ధృవీకరణకు సన్నాహాలు



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగిన సమీక్షా సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ ఆలీం భాష పట్టణాన్ని బహిరంగ మలవిసర్జన రహిత ప్రాంతంగా ప్రకటించేందుకు చేపట్టిన చర్యలపై చర్చ జరిగింది. విస్తృత సర్వే ఆధారంగా పట్టణాన్ని తాత్కాలికంగా ఓడిఎఫ్‌గా గుర్తించారు. ఈ స్థితిని శాశ్వతంగా ధృవీకరించేందుకు ప్రజల సూచనలు, పరిశీలనలు కీలకమని అధికారులు తెలిపారు. ఇందుకోసం సెప్టెంబర్ 14వ తేదీ వరకు గడువు నిర్ణయించారు. ఈ కాలంలో ఎక్కడైనా బహిరంగ మలవిసర్జన జరిగిన సంఘటనలు గమనించినా, లేదా ఏవైనా అభ్యంతరాలు ఉన్నా, వాటిని వ్రాతపూర్వకంగా లేదా హెల్ప్‌లైన్ నంబర్ 08645-295192కు తెలియజేయవలసిందిగా కోరారు.

ప్రజల నుండి అందిన నివేదికలను పరిశీలించిన అనంతరం, సెప్టెంబర్ 15న ఓడిఎఫ్ స్థితిపై తుది ప్రకటన విడుదల కానుంది. ఎటువంటి సంఘటనలు నమోదు కాని పక్షంలో, పట్టణాన్ని శాశ్వతంగా ఓడిఎఫ్‌గా ప్రకటించి, ఉల్లంఘనలపై ప్రస్తుత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నగర పాలక సంస్థ కమిషనర్ ఆలీం భాష స్పష్టం చేశారు. పట్టణాన్ని పరిశుభ్రంగా, శాశ్వత ఓడిఎఫ్ స్థితిలో నిలుపుటకు ప్రతి పౌరుడు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ భాష విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా బోగి జన్మదిన వేడుకలు



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు బోగి వినోద్ జన్మదినోత్సవ వేడుకలు పాత మంగళగిరి శ్రీ కృష్ణ వృద్ధాశ్రమంలో బుధవారం నిర్వహించారు. వృద్ధులకు అన్నదానఈ చేశారు. పద్మశాలియ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల నాగార్జున హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. రేవేంద్రపాడు ఎంపీటీసీ సభ్యులు కుక్కల మధుబాబు, తెలుగు యువత నాయకులు ఎండీ ఆరిఫ్, కె కాశీ విశ్వనాథ్, షేక్ అన్వర్, కలకోటి శివ, దేవరకొండ సాయి, రవి, ఛాను, నితిన్, సాయి, క్రోసూరు రామ్ గోపాల్, తుళ్లూరు సాయి తదితరులు పాల్గొన్నారు.

## కాజలో స్మార్ట్ రేషన్ కార్డులు

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజలకు సేవలను అత్యంతవేగంగా అందించడంలో సీఎం చంద్రబాబు దేశానికే ఆదర్శమని మండల టీడీపీ అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు అన్నారు. మంగళగిరి మండలం కాజ లో స్మార్ట్ రేషన్ కార్డులను అధికారులు, కూటమి నాయకులు బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దినేష్ రాఘవేంద్ర , రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ నందం అబద్ధయ్య, మంగళగిరి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్ పర్సన్ గాదె పిచ్చిరెడ్డి, జనసేన గ్రామ అధ్యక్షులు అప్పికట్ల వెంకటరత్నం నాయుడు, దానబోయిన రామరాజు , బిజెపి గ్రామ అధ్యక్షులు కారుమూరి శ్రీనివాస రెడ్డి, కుక్కమళ్ళ దానియేలు , చింకా కోటేశ్వరరావు , కుక్కమళ్ళ విక్రమ్ బాబు , బి వి ఎల్ నారాయణ,రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 12 వేతన సవరణ కమీషన్ వెంటనే నియమించాలి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** 12వ వేతన సవరణ కమీషన్ ని వెంటనే నియమించాలని ఫోర్టో ( ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్) రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రకటన ద్వారా డిమాండ్ చేసింది. విశ్రాంతి న్యాయమూర్తి ని కమిషన్ చైర్మన్ గా నియమించాలని ఫోర్టో ఛేర్మెన్ కరణం హరికృష్ణ, సెక్రెటరీ జనరల్ అంకాల కొండయ్య, గౌరవ అధ్యక్షులు వెంకట రెడ్డి, ముఖ్య సలహాదారులు బలివాడ ధనుంజయరావు, కో చైర్మన్లు బోనెల రమేష్, బృంద బాన్ డొలై, సోమరౌతు శ్రీనివాసరావు, చల్లగుండ్ల శ్రీనివాసరావు, పెద్దన్న, బీరప్ప, గాండ్లపర్తి శివానందరెడ్డి, మాగంటి శ్రీనివాసరావు, గరికపాటి సురేష్ ప్రభుత్వాన్ని కోరారు. రెండు సంవత్సరాల రెండు నెలలు గడిచిన ఇంతవరకు 12వ వేతన సవరణ పట్ల కృషి జరగకపోవడం శోచనీయంగా పేర్కొన్నారు. వేతన జీవులు పిఆర్సి కొరకు ఆశావాహంతో ఎదురు చూస్తున్నారని వివరించారు. ఇంతవరకు ఆ దిశగా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు నిరాశ,నిస్పృహతో కొట్టుమిట్టాడుతున్నారని విశదీకరించారు. ఉద్యోగుల మనోభావాలను అర్థం చేసుకొని వెంటనే 12వ వేతన సవరణ కమిషన్ ను నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

- ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేయండి
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రజలకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. విద్యుత్ రంగంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రాజెక్టుల పురోగతి, సబ్‌స్టేషన్ల నిర్వహణపై ట్రాన్స్‌కో అధికారులతో ఆయన బుధవారం సమీక్ష నిర్వహించారు. **ప్రాజెక్టుల పూర్తి - వ్యయ నియంత్రణ :** రూ. 6 వేల కోట్లతో కొనసాగుతున్న ట్రాన్స్‌కో ప్రాజెక్టులను 2027 నాటికి పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. నిర్మాణ వ్యయం తగ్గించే దిశగా కాంట్రాక్టర్లతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి అవసరమైన మార్గదర్శకాలు ఇవ్వాలని సూచించారు. ప్రాజెక్టుల నిర్మాణ పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపం ఉండకూడదని అధికారులను హెచ్చరించారు.

**సీఆర్డీఏ పరిధిలో ఆధునిక టెక్నాలజీ :** సీఆర్డీఏ పరిధిలో అమలు చేస్తున్న అండర్‌గ్రౌండ్ కేబుల్ వ్యవస్థపై మంత్రి ఆరా తీశారు. అక్కడి నిర్మాణాలన్నింటికీ అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించాలనీ, సీఆర్డీఏ అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు.

**రైతులకు చేయూత - కొత్త సబ్‌స్టేషన్లు :** ఆక్వా రైతులకు సకాలంలో, నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రత్యేక సబ్‌స్టేషన్లు నిర్మించాలని ఆదేశించారు. ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తరచు ట్రిప్పింగ్ సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు.

**పారిశ్రామిక అవసరాలు - మెట్రో విద్యుత్ సౌకర్యం :** విశాఖపట్నంలో ఏర్పాటు కానున్న డేటా సెంటర్లు, ఇతర పరిశ్రమలకు నిరంతరాయ విద్యుత్ అందించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో ప్రతిపాదిత మెట్రో రైలు ప్రాజెక్టులకు కావాల్సిన విద్యుత్ సౌకర్యాలపై కూడా సమీక్ష జరిపారు.

**పాత సబ్‌స్టేషన్ల మెయింటెనెన్స్ :** 20–30 ఏళ్ల క్రితం నిర్మించిన పాత సబ్‌స్టేషన్లలో తక్షణ మెయింటెనెన్స్ పనులు చేపట్టాలని సూచించారు. వాటి పనితీరును మెరుగుపరచకపోతే విద్యుత్ సరఫరాలో ఆటంకాలు కలుగుతాయని అధికారులను అప్రమత్తం చేశారు.

**ఖాళీల భర్తీ :** విద్యుత్ శాఖలో ఉన్న ఖాళీల భర్తీ అంశంపై కూడా సమీక్ష జరిగింది. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సుముఖత వ్యక్తం చేశారని మంత్రి వెల్లడించారు. త్వరలోనే నియామక ప్రక్రియ చేపడతామని తెలిపారు.

"రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థను ఆధునీకీకరించడం, నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించడం మా ప్రధాన లక్ష్యం" అని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు.

# స్త్రీ శక్తిని మహోన్నతం చేయడం కూటమి ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే ఆనందబాబు




**వేమూరు,(జర్నలిస్ట్ ఫైల్)** మహిళలు ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా, గౌరవప్రదమైన జీవనంతో రాణించాలన్నదే కూటమి ప్రభుత్వలక్ష్యమని, ఆదిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుస్త్రీశక్తిని మహోన్న తంగ ముందుకు తీసుకు వెళ్ళనున్నారని, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు.

సూపర్ సిక్స్ సూపర్ హిట్ స్త్రీ శక్తి విజయోత్సవ సభను బుధవారం వేమూరులొ ఎన్టీఆర్ పురవేదిక వద్ద నిర్వహించారు. ఈక్రమంలొ నియోజకవర్గ పరిధి గ్రామాల నుండి మహిళలు విశేష సంఖ్యలొ హాజరైన ఎమ్మెల్యే ఆనందబాబుకు ఆత్మీయ స్వాగతం పలికారు. పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అనంతరం పురవేదికపై నిర్వహించిన సభకు వేమూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్ పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ దేశంలొ ఎక్కడా అమలుకాని విధంగా,రాష్ట్రంలొ కూటమి ప్రభుత్వం ద్వారా మహిళలకు ఎంతో ప్రాధాన్యం కల్పిస్తు వారికోసం అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. మహిళా సంక్షేమానికి సూపర్ సిక్స్ పథకాలలో ప్రధానమైన,ఉచిత బస్సు ప్రయాణం,,తల్లికి వందనం,, ఉచిత గ్యాస్ సిలిండర్లు పథకాలను అమలు పరుస్తూ వారి సామాజిక ఆర్థిక స్థితినిమెరుగుపరిచేందుకు, ఓకార్యాచరణను అమలు చేస్తున్నారని తెలిపారు. ఆడబిడ్డ నిధి పథకాన్ని కూడా త్వరలొప్రారంభించడం జరుగుతుంద న్నారు. డ్వాక్రా వ్యవస్థకు శ్రీకారం చుట్టింది, ముఖ్యమంత్రి చంద్రబాబేనని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా మహిళా సంక్షేమానికి పథకాలను రూపుదిద్దుకుంటున్న తీరు వెనుక, చంద్రబాబు విజన్ ఉందన్నారు. ఉచిత బస్సు ప్రయాణంలో మహిళలు,యువతీమణులు,ట్రాన్స్ జెండర్లతొపాటు, ఉద్యోగం చేసే మహిళలకు కూడా ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యాన్ని కల్పించిన తీరును ప్రజలు తెలుసుకోవాలని,ఐదు రకాల బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడ నుండి ఎక్కడికి అయినా ఉచితంగా ప్రయాణించ వచ్చని అన్నారు.

ప్రజాస్వామ్య విలువలను కాలరాచి మహిళా సంక్షేమాన్ని కూడా ప్రక్కన పెట్టడం, గత పాలకుల నిర్వాకమని, జగన్ పాలనలొ అన్ని రంగాలను భ్రష్టు పట్టించారని, అందువల్లే సూపర్ సిక్స్ పథకాలు అమలు కావనే ప్రచారం చేశారని, వారి గోబెల్ ప్రచారాన్ని, సూపర్ సిక్స్ పదకాల అమలు ద్వారా తిప్పికొట్టిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని, ఈప్రభుత్వంలోని పార్టీలకు ప్రజలు ఎల్లప్పుడు అండగా ఉండాలని కోరారు. నేటి కూటమి పాలనలొ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా మంత్రి లోకేష్ రాష్ట్రంలో 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించే విధంగా ఐటీ రంగాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమత్రి పవన్ కళ్యాణ్ లకు, కేంద్రంలోని కూటమి ప్రభుత్వానికి, మనమంతా అండగా ఉండాలని,రాబోయే ఏ ఎన్నికల్లో నైనా,కూటమి పార్టీలకు ఓటు వేయాల్సిన అవసరాన్ని వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రజల సంక్షేమానికి ప్రజాసేవకుడిగా పనిచేస్తానని ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు తెలుగు మహిళలు ఆనంద్ బాబును సత్కరించారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టిడిపి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు,, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు వంగా సాంబిరెడ్డి,,టిడిపి నాయకులు తూనుగుంట్ల సాయిబాబా,,మైనేని మురలీకృష్ణ,, డాక్టర్ కనకాల మధుసూదన్ ప్రసాద్,, నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్,, గొట్టిపాటి భానుగంగాధర్, గాజుల వెంకట సుబ్బయ్య, షేక్ హనీఫ్,దొప్పలపూడి సుధాకర్, వేల్పుల రవి ప్రసాద్,తమ్మా శివారెడ్డి, కొల్లూరు నాగశ్రీధర్,గవిని లక్ష్మీదుర్గ,వాకా శేషుబాబు,మొవ్వ శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పలువురు ఐఎఎస్ అధికారులు బదిలీలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం పలువురు ఐఎఎస్ అధికారుల బదిలీలు చేస్తూ మరి కొందరికి పోస్టింగ్‌లు ఇస్తూ జి.ఓ.ఆర్.టి. నెం.1628ను జారీ చేసింది. సర్వే సెటిల్‌మెంట్స్ & ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్‌గా రోనంకి కూర్మనాథ్ (IAS 2016) నియమితులయ్యారు. ఈస్ట్ గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ &అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌గా వై. మేఘ స్వరూప్ (IAS 2021) బాధ్యతలు స్వీకరించనున్నారు. గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ & అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌గా అశుతోష్ శ్రీవాస్తవ (IAS 2021)ను నియమించారు. పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ & అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌గా సి. యశ్వంత్‌కుమార్ రెడ్డి (IAS 2021) నియామకం కాగా, అదనంగా ఆయన ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ బాధ్యతలు కూడా చేపట్టనున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పడేరు ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా తిరుమాని శ్రీ పూజ ( IAS 2022)ను నియమించారు. అదేవిధంగా, చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో జాయింట్ సెక్రటరీ (విజిలెన్స్)గా కల్పశ్రీ కె.ఆర్ (IAS 2022), రాంపచోదవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా బచ్చు స్మరణ్ రాజ్ (IAS 2022) బాధ్యతలు స్వీకరించనున్నారు. పోస్టింగ్ లేకుండా బదిలీ అయిన అధికారులు తరువాత నియామకాల కోసం జీఏడీలో హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## శ్రీశైలంలో అభివృద్ధి పనులపై మంత్రి-ఎమ్మెల్యే సమావేశం



**శ్రీశైలం, (జర్నలిస్ట్ ఫైల్):** దేవాదాయ శాఖ మంత్రి ఆనంనారాయణరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మంగళవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో శ్రీశైల క్షేత్ర అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఆలయ పరిసరాల్లో చేపట్టవలసిన అభివృద్ధి పనులు, యాత్రికులకు మెరుగైన సదుపాయాల కల్పన, మౌలిక వసతుల పెంపుదల వంటి అంశాలు ప్రధానంగా చర్చించారు.

ఈ సమావేశానికి దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఎం.శ్రీనివాసరావు కూడా హాజరయ్యారు. క్షేత్రానికి వచ్చే భక్తులకు మరింత సౌకర్యం కల్పించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు

## విధుల్లో నిర్లక్ష్యంపై 127వ వార్డు సచివాలయ కార్యదర్శులు సస్పెండ్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరపాలక సంస్థలో విధుల్లో నిర్లక్ష్యం కారణంగా 127 వా వార్డు సచివాలయ ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్, వెల్ఫేర్ కార్యదర్శులను సస్పెండ్ చేశారు. సదరం సర్టిఫికెట్లను పాత సర్టిఫికెట్లపై ప్రింట్ చేసి ప్రజలకు అందజేయడం వెలుగులోకి రావడంతో ఈ చర్యలు చేపట్టినట్టు కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఈ ఘటనపై బుధవారం సెట్ కాన్ఫరెన్స్‌లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్, ఇప్పటికే పాత సర్టిఫికెట్లు జీఎంసీకి సరెండర్ చేయాలని, నేమ్ బోర్డులు మార్చాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ కొందరు కార్యదర్శులు నిర్లక్ష్యం వహించారని ఎద్దేవా చేశారు. పర్యవేక్షణలోపంపై నోడల్ అధికారులు, అడ్మిన్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇకపై నోడల్ అధికారులు ప్రతిరోజు పర్యవేక్షణ చేసి వారానికి ఒకసారి నివేదిక ఇవ్వాలని, డిప్యూటీ కమిషనర్లు ర్యాండమ్‌గా తనిఖీలు నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు.

## గణేష్ నిమజ్జనోత్సవం



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** ఆత్మకూరు కొత్తపాలెంలో వినాయక చవితిని పురస్కరించుకొని యువ గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాల గణపతి విగ్రహ వద్ద బుధవారం అన్నదానం కార్యక్రమం, నిమజ్జనోత్సవం ఘనంగా జరిగాయి. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం బాల గణపతి నిమజ్జనోత్సవం జరిగింది. తొలుత స్వామివారి 27 కిలోలు, ఐదు కిలోల లడ్డూల బహిరంగ వేలం పాట నిర్వహించారు. 27 కిలోల లడ్డును 75 తాళ్లూరు గ్రామానికి చెందిన తాటిపాముల తిరుమలరావు 1,01,116 రూపాయలకు, 5 కిలోల లడ్డును చిల్లపల్లి జగదీష్ 26,116 రూపాయలకు పాట పాడి లడ్డూలను దక్కించుకున్నారు. పెద్ద లడ్డు పాడిన తిరుమలరావుకు యూత్ ప్రతినిధులు స్వామివారి పది తులాల వెండి ప్రతిమను బహుకరించారు. ఈ కార్యక్రమంలో యూత్ ప్రతినిధులు యర్రగొండ మణికంఠ, తేలు ఫిరోజ్, ఉడతా మల్లేశ్వరరావు, కొండా ఋషేంద్ర, వెంగళ సాయి, చిల్లపల్లి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్.డి.సి.చైర్మన్ దిల్ రాజు వ్యాఖ్యలపై స్పందించిన'మా- ఏపి'

- దర్శకుడు దిలీప్ రాజ



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** పారితోషికం విషయాల్లో అగ్రహీరోల దగ్గరకెళ్లి చెప్పే దమ్ము, ధైర్యం ఏనిర్మాతకూ లేదని తెలంగాణ ఎఫ్.డి.సి.చైర్మన్,ప్రముఖ నిర్మాత దిల్ రాజు ఒక ఇంటర్వ్యూ లో చేసిన వ్యాఖ్యలపట్ల ' మా-ఏపి' వ్యవస్థాపకులు సినీదర్శకుడు దిలీప్ రాజా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఒక అధికార పదవిలో ఉన్న అయన మాటలు సినీపరిశ్రమలో విభేదాలు మరింతగా పెరగటానికి దోహదపడతాయిగాని పరిష్కారానికి మార్గం చూపవన్నారు. గుంటూరుజిల్లా తెనాలిలోని 'మా-ఏపీ' కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దిలీప్ రాజ మాట్లాడుతూ ఇప్పటికే ధియేటర్లకు వేళ్ళే ప్రేక్షకుల సంఖ్య, సగానికి పడిపోయిందని ఇలాగే కాలయాపన జరిగితె సినిమా దియేటర్ లన్ని కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తద్వార ఓటీటీలహవా పెరిగి సినీ పరిశ్రమకు ఆక్సిజన్ అందని పరిస్థితిలు ముందున్నాయని ఆయన పేర్కొన్నారు. వందలకోట్లు రెమ్యూనరేషన్ తీసుకుంటున్న అగ్ర హీరోలతో పరిశ్రమ సంక్షేమం కోసం చర్చలు జరపవలసిన నైతిక భాద్యతగా తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల చొరవ చూపి,రెండురాష్ట్రాల ఎఫ్. డి.సి.లు ఆమోదయోగ్యమైన ప్రతిపాదనలను అగ్రహీరోలముందుంచాలని దిలీప్ రాజా అభిప్రాయం వ్యక్తం చేశారు. సినిమాలకు ఎంత రెవిన్యూ వస్తుంది? 50% ఫుట్ఫాల్ కావడానికి హేతుబద్ధమైన కారణాలేంటి? ఇందులో ఎవరిపాత్ర అధికంగా ఉందో దిల్ రాజు లాంటి సినీ ప్రముఖులకు ఒక అంచనా అవగాహన పూర్తిస్థాయిలో ఉంటుంది కాబట్టి సత్వరమే తగిన చర్యలు తీసుకుని తెలుగుసినిమాని బ్రతికించవలసిందిగా తెలుగుసినీపెద్దలకు మనవి చేస్తున్నమని దిలీప్ రాజ తమ అభిప్రాయం వెల్లడించారు.

# డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

- విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు
- మాదక ద్రవ్యాల మహమ్మారి నుండి తన బిడ్డను కాపాడుకునే ప్రతి తల్లి ఒక అంబాసిడరే
- కేఎల్ యూ విద్యార్థుల అవగాహనా సదస్సులో ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఎలైట్ యాంటీ నార్కోటిక్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్) చీఫ్ ఆకే రవికృష్ణ అన్నారు. ఈ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తాడేపల్లి వడ్డేశ్వరం కోనేరు లక్ష్మయ్య యూనివర్సిటీ లో బుధవారం విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ మాట్లాడుతూ... ప్రస్తుత సమాజంలో ముఖ్యంగా యువతలో మాదక ద్రవ్యాల అలవాటు ఒక పెద్ద సవాలుగా మారిందన్నారు. తోటి స్నేహితుల ఒత్తిడితో మత్తు పదార్థాలతో మొదలై డ్రగ్స్ కి బానిసలుగా మారి జీవితాలను పూర్తిగా నాశనం చేసే స్థాయికి చేరుకుంటున్నారన్నారు. ప్రభుత్వం, పోలీసులు, ప్రజలు అందరూ కలిసి మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థులు డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో ముందుకు సాగి రాబోవు తరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఏపీని గంజాయి రహిత ఆంధ్ర ప్రదేశ్ గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక సబ్ కమిటీని ఏర్పాటు చేసిందని, గంజాయి డ్రగ్స్ పై ఉక్కు పాదం మోపేందుకు ఈగల్ (ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ఫోర్స్మెంట్) వ్యవస్థను తీసుకువచ్చి ఏపీలో గంజాయి సాగు పూర్తిగా అరికట్టడం జరిగిందన్నారు. ఒరిస్సా లోని ఐదు జిల్లాల నుంచి ఏపీలోకి గంజాయి రవాణా జరుగుతోందని, దీనిని అరికట్టేందుకు ఇంటర్ స్టేట్ చెక్ పోస్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇటీవల విజయవాడలో ఇంజనీరింగ్ చదివే ఒక విద్యార్థిని మరొక విద్యార్థితో కలిసి బెంగళూరు వెళ్లి అక్కడి నుంచి ఎం డి ఎం ఏ, ఎల్ఎస్డీ, డ్రగ్స్ తీసుకొని విశాఖపట్నం వస్తుండగా పోలీసులకు పట్టుబడి జైల్లో శిక్ష అనుభవిస్తున్నారని గుర్తు చేశారు. ఎన్ డి పి ఎస్ చట్టాన్ని మరింత కఠిన తరం చేయడం జరిగిందని, ఈ చట్టం కింద నేరం చేసిన వారికి 10 సంవత్సరాల నుండి 20 సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా అటువంటి వారిపై ఆర్థిక దర్యాప్తు జరిపి నిందితులు, వాడి బంధువులు సంబంధీకుల బ్యాంకు ఖాతాలు, స్థిరాస్తులు వాహనాలు ఇతర ఆర్థిక వనరులపై దర్యాప్తు చేసి అక్రమ సొమ్మును గుర్తించి సీజ్ చేయడం జరుగుతుందన్నారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా నిల్వ విక్రయాలపై నేరపూరిత కార్యకలాపాల్లో పాల్గొనేవారిని ఏడాది పాటు నిర్బంధంలో ఉంచే అధికారం పోలీస్ విభాగానికి ఉంటుందన్నారు. ఏపీలోని 70 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని 60 వేల విద్యాసంస్థల్లో ఈగల్ క్లబ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఈగల్ క్లబ్ లో నలుగురు విద్యార్థులు, నలుగురు విద్యార్థినులు ఇద్దరు ఉపాధ్యాయులు సభ్యులుగా ఉంటారన్నారు. ఈగల్ క్లబ్స్ ద్వారా విద్యార్థులకు మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఆపరేషన్ చైతన్యం పేరుతో ఏఎస్ఆర్ జిల్లాలో సుమారు 375 గ్రామాల్లో గంజాయి పంటను డ్రోన్ సర్విలేన్స్ ద్వారా, కార్డెన్ సెర్చ్ క్యాంపైన్స్ ద్వారా గంజాయి సాగు అరికట్టడం జరిగిందన్నారు. గత ఏడాది గంజాయి సాగు రైతులకు సుమారు 46 లక్షల మొక్కలు పంపిణీ చేయడం జరిగిందని, ఈ సంవత్సరం ప్రభుత్వం రెండు కోట్ల మొక్కలను పంపిణీ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఆపరేషన్ చైతన్య ద్వారా మౌలికంగా రైతుల్లో మార్పు తీసుకువచ్చి గంజాయి సాగు లేకుండా ఏ ఎస్ ఆర్ జిల్లాలోని ప్రతి రైతు కూడా నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్ మీదగా వెళ్లే రైళ్లలో కూడా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ లో భాగంగా 25వేల ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించి 56 లక్షల జరిమానాలు విధించినట్లు తెలిపారు. కోప్తా చట్టం ప్రకారం విద్యార్థులు పొగాకు, సిగరెట్ల కు బానిసలు కాకూడదన్నారు. చిన్న వయసులో పొగాకు, సిగరెట్లకు అలవాటు పడతారో అటువంటి విద్యార్థుల ఆలోచనలు పెరిగి ఎక్కువ మంది గంజాయి కి లేదా సింథటిక్ డ్రగ్స్ కి అలవాటు పడుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనాలు చెబుతున్నాయని తెలిపారు. విద్యాసంస్థల వద్ద సమీపంలో పొగాకు ఉత్పత్తులు కానీ, గంజాయి విక్రయిస్తే 1972కు సమాచారం అందించాలని కోరారు. రాష్ట్రంలో ప్రతి తల్లి కి తాము ఒక్కటి విజ్ఞప్తి చేస్తున్నామని, పిల్లల కదలికలపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ ఏ టి వి రవికుమార్ మాట్లాడుతూ... విద్యార్థులు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రతాల గురించి అవగాహన పెంచుకుని ఇతరులకు తెలియజేయాలని కోరారు. గంజాయి కేసులో అరెస్ట్ అయిన వారు నేరస్తులుగా జీవితకాలం పాటు గుర్తింపు కలిగి ఉంటారని తెలిపారు. ఇతర దేశాలకు వెళ్లాలనుకునే విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి విక్రయించిన వారికి వినియోగించిన వారికి ప్రత్యేకమైన సెక్షన్ల ద్వారా శిక్షలు ఉంటాయని తెలిపారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సుబ్బారావు మాట్లాడుతూ తమ వర్సిటీలో ఎటువంటి ర్యాగింగ్ లేకుండా ప్రతి విద్యార్థి ఎంతో సంతోషంగా భద్రంగా ఉంటున్నారని తెలియజేయడానికి సంతోషిస్తున్నా మన్నారు. మాటక ద్రవ్యాలను నివారించడంలో తమ విద్యార్థులు అన్ని విధాలుగా పోలీసులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జిపిఎస్.వర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్, అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీధర్, ఉమెన్ డెవలప్ మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూత్ రమ్య,ఈగల్ డిఎస్పి సింగయ్య, ఇన్స్పెక్టర్ విక్టర్, ఎస్ఐ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఇంటి ముంగిటకే చేనేత వస్త్రాలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో చేనేత రంగానికి కొత్త ఊపు తీసుకొచ్చేలా ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఆప్కో ద్వారా చేనేత వస్త్రాలను నేరుగా వినియోగదారుల ఇళ్లకే డోర్ డెలివరీ చేసే సదుపాయం కల్పించగా, అమెజాన్, ఫ్లిప్ కార్ట్, జియో మార్ట్ వంటి ఈ కామర్స్ దిగ్గజాలతో అనుసంధానం చేసి అమ్మకాలను ప్రారంభించింది. పోచంపల్లి, ధర్మవరం, మంగళగిరి వంటి ప్రసిద్ధ చీరలతో పాటు నేటితరం అభిరుచులకు తగ్గ రెడీమేడ్ చేనేత దుస్తులను కూడా ఆన్ లైన్, ఆఫ్ లైన్‌లో అందుబాటులో ఉంచింది. రాష్ట్రవ్యాప్తంగా 40 ఆప్కో షోరూమ్‌లను ఈ కామర్స్‌కు అనుసంధానం చేస్తూ, కొత్త డిజైన్లతో మహిళలు, యువత, పిల్లలకు సరిపడే దుస్తులను విక్రయిస్తోంది. ఇప్పటికే ఆన్ లైన్ ద్వారా రూ. 45 లక్షల విలువైన అమ్మకాలు జరగగా, ఈ ప్రయత్నాలు నేతన్నలకు 365 రోజుల ఉపాధి కల్పించడమే లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు.

## డ్వాక్రా రుణాల్లో భారీ అవకతవకలు



○ ఇరవై సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ సమీక్ష

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో డ్వాక్రా గ్రూపుల పేరుతో భారీ రుణ అవకతవకలు చోటుచేసుకున్నట్టు వెలుగులోకి వచ్చింది. ఈ అంశంపై ఇరవై సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ సచివాలయంలో బుధవారం సెర్ప్, మెప్మా అధికారులతో సమీక్ష నిర్వహించారు.

**2019-24 మధ్య అవకతవకలు**

సెర్ప్ సమర్పించిన లెక్కల ప్రకారం గ్రామీణ ప్రాంతంలో 37.51 కోట్లు నకిలీ గ్రూపులకు రుణాలుగా మంజూరైనట్లు తేలింది. అందులో 10.65 కోట్లు మాత్రమే రికవరీ కాగా, 26.86 కోట్లు ఇంకా వసూలు కావాల్సి ఉంది. కాకినాడలో అత్యధికంగా 18.78 కోట్లు రుణాలు మంజూరై, వాటిలో 11.77 కోట్లు రికవరీ కాని స్థితిలో ఉన్నాయని అధికారులు తెలిపారు. తిరుపతిలో 8.08 కోట్లు రుణాలు ఇచ్చి, వాటిలో 56 లక్షలు మాత్రమే వసూలు అయినట్లు వెల్లడించారు.

**పట్టణాల్లో 98 నకిలీ గ్రూపులు**

మెప్మా అధికారులు ఇచ్చిన లెక్కల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో 98 నకిలీ గ్రూపులు ఏర్పడి 18.55 కోట్లు రుణాలు తీసుకున్నాయి. గుడివాడలో 6.30 కోట్లు, ఒంగోలు 5.98 కోట్లు, కాకినాడ 4.68 కోట్లు, అనంతపురంలో 1.59 కోట్లు నకిలీ గ్రూపులకు మంజూరైనట్లు తేలింది.

**లంకా దినకర్ ఆదేశాలు**

అనకాపల్లిలో 3 కోట్లకు పైగా నకిలీ రుణాలు ఇచ్చిన విషయం గత సమీక్షలో స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు ప్రస్తావించినట్లు గుర్తుచేసిన లంకా దినకర్ రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి అవకతవకలు ఎంత జరిగాయన్న అనుమానం కలుగుతోందని తెలిపారు. అందుకే అన్ని జిల్లాల అధికారుల నుంచి లెక్కలు సేకరించి, సెర్ప్, మెప్మా లెక్కలతో సరిపోల్చాలని ఆదేశించారు.

**కూటమి ప్రభుత్వం చర్యలు**

2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత నకిలీ రుణాలపై కఠిన చర్యలు తీసుకున్నట్లు లంకా దినకర్ వెల్లడించారు. నకిలీ గ్రూపులకు రుణాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేసి, బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఇకపై ఒకే వ్యక్తి అనేక గ్రూపుల్లో సభ్యత్వం పొందకుండా యూనిక్ ఐడీ, బయోమెట్రిక్, ఆధార్ ఆధారిత సాంకేతిక విధానం అమలు చేస్తున్నట్లు వివరించారు.

**టెక్నాలజీతో పారదర్శకత**

"మన డబ్బు-మన లెక్క" యాప్ ద్వారా గ్రామీణ మహిళలు తమ ఖాతా వివరాలు మొబైల్‌లోనే చూసుకునే విధానం ప్రారంభమైందని తెలిపారు. పట్టణాల్లో "మహిళా ఆకాశం" యాప్ ద్వారా రుణాల మంజూరు జరుగుతోందని, ఇకపై గ్రూప్ మొత్తానికి ఒకే సారి రుణం ఇవ్వకుండా, సభ్యుల అవసరానికి తగ్గట్టుగా దశలవారీగా రుణం విడుదల చేస్తున్నామని చెప్పారు.

'వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్' లక్ష్యంతో ఒక లక్ష మంది మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించామని, అందులో గ్రామీణ ప్రాంతం నుంచి 70 వేల మంది, పట్టణ ప్రాంతం నుంచి 30 వేల మందిని ఎంపిక చేస్తామని లంకా దినకర్ వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోడీ కల అయిన "లక్షపతి దీదీ"లో అత్యధిక సంఖ్యను ఆంధ్రప్రదేశ్ నుంచే అందించే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు.

## వేతన సవరణ సంఘాన్ని వెంటనే నియమించాలి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడిచినా ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు మాత్రం ఇంకా పరిష్కారం కాలేదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) ఆవేదన వ్యక్తం చేసింది. ఇప్పటివరకు బకాయిల చెల్లింపులు జరగకపోవడంతో పాటు 2022లో ఉపాధ్యాయులు సమర్పించిన సరెండర్ లీవ్ బిల్లులు, పాత డీఏ బకాయిలు కూడా ఇప్పటికీ ఇవ్వలేదని ఆప్టా నేతలు ఎజీఎస్ గణపతిరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రకాశ్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు వారు విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు లేఖ రాశారు. నూతన వేతన సవరణ సంఘాన్ని వెంటనే నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలని, ఉపాధ్యాయులు%-%ఉద్యోగుల ఆర్థిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో క్రింది స్థాయి నుంచి ఒత్తిడులు పెరుగుతున్నాయని, రాష్ట్రస్థాయి ఉద్యమ కార్యాచరణకు సంఘాలు సిద్ధమవుతున్నాయని ఆప్టా లేఖలో హెచ్చరించింది. కూటమి ప్రభుత్వం వస్తే గత పీఆర్సీ వల్ల కలిగిన నష్టాన్ని పూడుస్తుందన్న ఆశలు పెట్టుకున్నా ఇప్పటి వరకు ఏ సహాయం కనిపించకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నదని ఆప్టా స్పష్టం చేసింది.

## సెకండరీ హెల్త్ డైరెక్టరేట్‌లో పారదర్శక ప్రమోషన్లు - మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు డాక్టర్ల జేఏసీ ప్రశంసలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** సెకండరీ హెల్త్ డైరెక్టరేట్ (గతంలో ఎపివివిపి) లో 2024-25 ప్యానెల్ సంవత్సరానికి సంబంధించిన ప్రమోషన్ల కౌన్సెలింగ్‌ను పూర్తి పారదర్శకంగా నిర్వహించినందుకు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు డాక్టర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) కృతజ్ఞతలు తెలిపింది. డిఎస్‌హెచ్ చరిత్రలో ఇంత పెద్ద సంఖ్యలో ప్రమోషన్లు అవినీతికి ఆస్కారం లేకుండా జరగడం చారిత్రాత్మక ఘట్టంగా నిలుస్తుందని జేఏసీ పేర్కొంది. ఈ విజయానికి తోడ్పడిన స్పెషల్ సీఎస్ ఎం.టి. కృష్ణబాబు, సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సిరి సమస్యలను వేగంగా గుర్తించి తక్షణ నిర్ణయాలు తీసుకున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు జేఏసీ వెల్లడించింది. "ఇది కేవలం ప్రమోషన్ల ప్రక్రియ మాత్రమే కాదు, ప్రజారోగ్య పరిపాలనలో పారదర్శకత, సామర్థ్యానికి సరికొత్త నిర్వచనం," అని డాక్టర్ రోహిత్ కర్నాటి, డియస్ హెచ్ డాక్టర్స్ జేఏసీ తరఫున తెలిపారు.

ఈ చారిత్రాత్మక విజయాన్ని సాధించడంలో భాగస్వాములైన ప్రతీ ఒక్కరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు జేఏసీ స్పష్టం చేసింది.

# ఆంధ్రప్రదేశ్ విద్యాసంస్కరణలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు





○ పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ తో విద్యార్థుల అభ్యసనా స్థాయి పెరిగింది

○ విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌తో భేటీలో నోబెల్ బహుమతి గ్రహీత ప్రా. మైఖేల్ క్రెమర్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు లభిస్తోందని నోబెల్ బహుమతి గ్రహీత, ఆర్థికవేత్త, యూనివర్సిటీ ఆఫ్ చికాగో ప్రొఫెసర్ మైఖేల్ క్రెమర్ ప్రశంసించారు. ఉండవల్లి నివాసంలో బుధవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో ఆయన సమావేశమయ్యారు. యూనివర్సిటీ ఆఫ్ చికాగో బృందం నిర్వహించిన అధ్యయనం ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో ఎడ్‌టెక్ సామర్థ్యం పెరిగిందని వివరించారు. పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ కార్యక్రమాన్ని ఉపయోగించిన విద్యార్థులు కేవలం 17 నెలల్లోనే పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ లేని పాఠశాలల విద్యార్థుల కంటే 2.25 రెట్లు అభ్యసన పురోగతిని సాధించారని వివరించారు. అన్ని తరగతుల విద్యార్థుల్లో, ముఖ్యంగా చిన్న తరగతుల విద్యార్థులలో ఈ పురోగతి స్పష్టంగా కనిపించిందని గణాంకాలతో సహా తెలియజేశారు. పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ వినియోగంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రథమస్థానంలో ఉండి, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఇటీవల గుజరాత్ సమగ్రశిక్ష బృందం ఏపీలో పర్యటించి, పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ అమలు తీరు సత్ఫలితాలు ఇస్తోందని, తమ రాష్ట్రంలో కూడా అమలు చేస్తామని చెప్పిన అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. 2018లో 60 పాఠశాలల్లో ప్రారంభమైన ఈ కార్యక్రమం, ప్రస్తుతం 26 జిల్లాల్లోని 1,224 పాఠశాలలకు విస్తరించి, 3.25 లక్షల మందికి పైగా విద్యార్థులకు చేరువైందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ, సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ సహకారంతో అమలవుతుండగా, కన్వే జీనియస్ టెక్నాలజీ సాంకేతిక సహకారం అందిస్తుందని తెలిపారు.

# చేనేత ప్రదర్శనకు అనూహ్య స్పందన

○ జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శనకు ప్రజల నుంచి అనూహ్య స్పందన

○ నగర ప్రజలనుఆకట్టుకుంటున్న స్టాల్స్ లో వస్త్రాలు

○ 116 స్టాల్స్ ద్వారా తయారీ ధరలకే వస్త్రాలలిఅమ్మకం

○ హెల్ప్ వీవర్స్... సేవ్ వీవర్స్ అనేది మన నినాదం

○ గత 8 రోజుల్లో రూ. కోటి 40 లక్షల ఆదాయం

○ జి. రేఖా రాణి, చేనేత మరియు జౌళి శాఖ కమిషనర్



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** వారం రోజుల క్రితం విజయవాడ నగరంలో ప్రారంభించిన గాంధీ బునకర్ మేళా (జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన - 2025) కు నగర ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని చేనేత మరియు జౌళి శాఖ కమిషనర్ జి. రేఖా రాణి తెలిపారు. గత సోమవారం "గాంధీ బునకర్ మేళా" (జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన - 2025) ను శ్రీ శేష సాయి కళ్యాణ వేదికలో ఇండియన్ హ్యాండ్ మేడ్ తో తయారైన చేనేత మరియు హస్తకళల ప్రదర్శనను ప్రారంభించడం జరిగిందన్నారు.

నగరంలో ఏర్పాటు చేసిన "గాంధీ బునకర్ మేళా" (జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన 2025) ను సీనియర్ ఐఏఎస్ అధికారులు కే. సునీత, సూర్య కుమారి, లావణ్య వేణి, డి. హరిత, ఏపీపీఎస్సీ ఛైర్మన్ అనురాధ లతో కలసి బుధవారం స్టాల్స్ ను పరిశీలించి, కొనుగోళ్లు చేశారు. అదేవిధంగా కొనుగోళ్లు ఏ విధంగా ఉంటున్నాయో స్టాల్స్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చేనేత మరియు జౌళి శాఖ కమిషనర్ జి. రేఖా రాణి మాట్లాడుతూ నేతన్నలు చేతితో తయారు చేసిన వస్త్రాలను ప్రజలు కొనుగోలు చేసి ఆదరించాల్సిన అవసరం మనందరి పై ఉందన్నారు.. చేనేత మరియు హస్తకళల ప్రదర్శన లో స్థానిక ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని, మన ప్రాచీన కళలను ఆదరించి అక్కున చేర్చుకునే విధానం మన సంస్కృతిలో ఒక భాగంగా ఉందన్నారు. దీనివలన మన కళాకారులకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ఇప్పటివరకు స్టాల్స్ లో వస్త్రాల అమ్మకాల ద్వారా కోటీ నలభై లక్షల ఆదాయం వచ్చిందన్నారు. చేనేతను ఆదరించటం మనందరి బాధ్యత అని అన్నారు. హెల్ప్ వీవర్స్... సేవ్ వీవర్స్ అనేది మన నినాదం అన్నారు. ఈ వస్త్ర ప్రదర్శనలో అన్నిరకాల చేనేత ఉత్పత్తులు ఉత్పత్తి ధరలకే అందుబాటులో ఉంచారని కమిషనర్ రేఖా రాణి పేర్కొన్నారు.

## తల్లిదండ్రుల గొప్పతనాన్ని లోకానికి చాటిచెప్పిన వినాయకుడు



**చల్లపల్లి (జర్నలిస్ట్ ఫైల్):** తల్లిదండ్రులను మించిన గొప్ప దైవాలు లోకంలో లేరని చాటిన వినాయకుడిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. చల్లపల్లి మండలం,పురిడిగడ్డలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని సురేష్ బాబు సందర్శించి పూజ,అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ భూమి చుట్టూ తిరిగి రావాలని తన సోదరుడు కుమారస్వామి పెట్టిన పోటీలో వినాయకుడు తన తల్లిదండ్రులు అయిన పార్వతీపరమేశ్వరుల చుట్టూ మాత్రమే తిరిగి తల్లిదండ్రుల పట్ల తనకున్న అపార భక్తి,గౌరవ భావాన్ని ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. తద్వారా లోకంలో తల్లిదండ్రులకు మించిన దైవాలు లేరనే విషయాన్ని వినాయకుడు తన జ్ఞానం,బుద్ధి కుశలత తో స్పష్టం చేసాడన్నారు. వినాయక చవితి పండుగ సందర్భంగా వాడే పత్రిలో వివిధ ఔషధ మొక్కల ఆకులకు నీటిని శుభ్రం చేసే లక్షణాలు వుంటాయని తెలిపారు. ఆ లక్షణాలు ఉండడం వల్లే వాటిని కాలువలు,నదులలో నిమజ్జనం చేస్తారన్నారు. తద్వారా వినాయక చవితిని పర్యావరణహిత పండుగగా భావించవచ్చున్నారు. వినాయకుడిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ తమ లక్ష్యసాధనలో అడ్డంకులను అధికమిచడం,తల్లిదండ్రులను గౌరవిచడం లాంటి వైఖరిని పెంపొందించుకోవాలన్నారు. ఊరేగింపుల్లో మద్యపానం,శబ్ద కాలుష్యం,అసభ్యమైన పాటలు లేకుండా భక్తి,గౌరవం,మత సామరస్యం కాపాడేలా అందరూ వ్యక్తిగత బాధ్యత,స్వీయ నియంత్రణ కలిగి ఉండాలని సురేష్ బాబు సూచించారు.

# రాంపాల్ సింగ్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎన్నికైన అప్పలరాజు, రాజేంద్ర

### ఆప్టా అధ్యక్షులు గణపతి రావు





**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** అఖిలభారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య మాజీ అధ్యక్షులు స్వర్గీయ రాంపాల్ సింగ్ పేరు మీద నెలకొల్పిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు విశాఖ జిల్లా నుంచి రెడ్డిపల్లి అప్పలరాజు, ఎస్. రాజేంద్రప్రసాదులు ఎన్నికైనట్లు ఉత్తరప్రదేశ్ బాంధలోని స్వర్గీయ రాంపాల్ సింగ్ ఉత్త ఉపాధ్యాయ సెలక్షన్ కమిటీ ఫౌండేషన్ ప్రకటించిందని ఈ విషయాన్ని ఫౌండేషన్ జనరల్ సెక్రెటరీ ప్రేమ్ కుమార్ సింగ్ తనకు మెయిల్ ద్వారా తెలియచేశారని సదరు ఉపాధ్యాయులకు కూడా మెయిల్ ద్వారా సమాచారం అందించారని సెప్టెంబరు 22వ తేదీన ఉత్తరప్రదేశ్ లేని ాంధలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం వరకు దేశవ్యాప్తంగా ఎన్నికైనటువంటి ఉపాధ్యాయులకు సత్కార కార్యక్రమము ఉంటుందని ఈ సత్కార కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైనటువంటి వారికి మెమొంటో సర్టిఫికేట్ మరియు ఆర్థికపరమైన బహుమతి కూడా ఇవ్వబడుతుందని కావున ఎవరెవరైతే అవార్డుకి ఎన్నికయ్యారో వారు సెప్టెంబర్ 22వ తారీకు న బాంధ లోని స్వర్గీయ రాంపాల్ సింగ్ మెమోరియల్ ఫౌండేషన్ కార్యాలయానికి చేరుకోవాలని వారు మెయిల్ ద్వారా తెలియజేస్తున్నారని ఏజీఎస్ గణపతిరావు మరియు ఆప్టా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రకాష్ రావు గారు పత్రికలకు తెలియజేశారు. స్వర్గీయ రాంపాల్ సింగ్ అఖిలభారత ప్రాథమిక ఉపాధ్యాయ సంఘానికి సుమారు 25 సంవత్సరాలు జాతీయ అధ్యక్షునిగా, మరియు సార్క్ కంట్రీస్ ఉపాధ్యాయ సంఘానికి ప్రధాన కార్యదర్శిగా, సౌత్ ఏషియా పసిఫిక్ కంట్రీస్ ఉపాధ్యాయ సంఘానికి కార్యదర్శిగా, అంతర్జాతీయ ఉపాధ్యాయ సమాఖ్యకు బోర్డు మెంబర్ గా, పనిచేసి దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారని అంతటి మహానుభావుడు పేరా ఈ సంవత్సరమే ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కు మన విశాఖ జిల్లాకు చెందిన రెడ్డిపల్లి అప్పలరాజు మరియు రాజేంద్రప్రసాద్‌లకు ఆప్టా సంఘం తరఫున శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేస్తున్నామని వారు తెలియజేశారు

# తురకపాలెం మరణాల కారణాలపై అధ్యయనం

○ రక్త నమూనాల పరీక్షల కోసం ఎదురుచూస్తున్నాం

○ మెలైడియోసిస్ గురించి ఇప్పుడే చెప్పలేం

○ ఉన్నత వైద్య బృందానికి నేతృత్వం వహించిన డీఎంఈ డాక్టర్ రఘునందన్ వె ల్లడి

○ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలతో గ్రామం లో వైద్యుల పర్యటన



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా తురకపాలెంలో గడచిన 5 నెలల్లో మరణాలకు దారితీసిన కారణాలను రక్త నమూనాల రిపోర్టులు అందాకే చెప్పగలమని రాష్ట్ర ఉన్నత వైద్యుల బృందం పేర్కొంది. ఈ గ్రామంలో గడచిన 5 నెలల్లో 30 మంది ప్రాణాలు విడిచారని తెలిపింది. ముఖ్యంగా జులై, ఆగస్టు నెలల్లో 20 మరణాలు సంభవించాయి. ఈ నెలలో ఇప్పటి వరకు 3 మరణాలు సంభవించగా, ఒకటి రోడ్డు ప్రమాదం కారణంగా జరిగింది. అయితే ఈ మరణాలు మెలైడియోసిస్ కారణంగా జరిగాయా లేదా అన్న విషయం శనివారంలోగా అందే రక్త నమూనాల పరీక్షల నివేదిక ఫలితాల ద్వారా తెలుస్తుందని ఉన్నత వైద్యుల బృందానికి నేతృత్వం వహించిన డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ రఘునందన్ బుధవారం తురకపాలెంలో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ప్రస్తుతం గుంటూరు జిజిహెచ్ లో ఇద్దరు ఇన్ పేషెంట్లుగా చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. ఇప్పటి వరకు జ్వరంతో ఉన్న 29 మంది నుంచి సేకరించిన రక్తనమూనాలను గుంటూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీలోని మైక్రోబయోలజీ ల్యాబ్‌లో పరీక్షిస్తున్నారని చెప్పారు. బ్యాక్టీరియా కారణంగా వచ్చే మెలైడియోసిస్ వ్యాధి పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఐవి యాంటీబయోటిక్ చికిత్స ద్వారా రోగులు కోలుకుంటున్నారని చెప్పారు.

**మంత్రి ఆదేశాలు :** వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు డిఎంఈ డాక్టర్ రఘునందన్, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి, డిఎంఅండ్ హెచ్ ఓ డాక్టర్ విజయలక్ష్మి, స్థానిక వైద్య నిపుణులు డాక్టర్ కళ్యాణ్ ఇతర అధికారులు తురకపాలెం గ్రామాన్ని బుధవారంనాడు సందర్శించారు. ఈ సందర్భంగా మరణించినవారి కుటుంబాల సభ్యుల్ని కూడా పరామర్శించారు.

తురకపాలెంలో డాక్టర్ రఘునందన్ విలేకరులతో మాట్లాడారు. " ఈ ఏడాది జనవరి నుంచి మార్చ్ మధ్య ఐదుగురు మరణించారు. ఏప్రిల్‌లో 2, మేలో 3, జూన్‌లో 2, జులైలో 10, ఆగస్టులో 10 చొప్పున మరణాలు నమోదయ్యాయి. ఈ నెలలో ఇప్పటి వరకు 3 మరణాలు జరిగినట్లు నమోదయ్యాయి. వీరిలో ఏడుగురు వేర్వేరు సమయాల్లో గుంటూరు జీజీహెచ్ లో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు. బీపీ, షుగర్, కిడ్నీల పనితీరు మందగించడం వంటి ఇతర వ్యాధులు కలిగిన మరణించిన వారిలో 80 శాతం మంది పురుషులున్నారు. చనిపోయిన వారి వయసు సగటు 55. ఓ ప్రైవేట్ ఆసుపత్రి వారి రోగుల నుంచి సేకరించిన నమూనాలను పరీక్షించగా ఇద్దరు మెలైడియోసిస్ బారిన పడినట్లు గుర్తించారని మా దృష్టికొచ్చింది. గత నెలలో వేర్వేరు తేదీల్లో ఈ రెండు కేసులు వచ్చాయి. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల ల్యాబ్ లో జరిగే పరీక్షల ఫలితాల కోసం ఎదురుచూస్తున్నాం. తురకపాలెం గ్రామంలో గత నెల 29 నుంచి వైద్య శిబిరం కొనసాగుతోంది. గ్రామ జనాభా 2500 కాగా, వీరిలో ఇప్పటి వరకు 1200 మందికి పరీక్షలు చేశాం. బుధవారంనాడు 42 మంది పరీక్షలు చేయించుకోగా వీరిలో ఎక్కువ మందిలో జ్వర పీడితులున్నారు. వీరు ఇళ్ల వద్దనే చికిత్స పొందుతున్నారు. వీరిలో ఎక్కువ మందికి దగ్గు, కీళ్ల నొప్పులున్నాయి. స్థానికుల్లో 30 ఏళ్లు దాటిన వారిలో బీపీతో 30 శాతం, షుగర్ తో 10 శాతం మంది బాధపడుతున్నారు. ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్ లో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్యం నిలకడగా ఉంది " అని డీఎంఈ డాక్టర్ రఘునందన్ వెల్లడించారు.

తురకపాలెం గ్రామంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొందని డీఎంఈ డాక్టర్ రఘునందన్ చెప్పారు. స్థానికులు పరిసర ప్రాంతాల్ని శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని కోరారు.

**గ్రామవాసులందరికీ పరీక్షలు చేయాలి: మంత్రి సత్యకుమార్ ఆదేశాలు**

తురకపాలెంలోని అందరికీ కిడ్నీ పరీక్షలు, షుగర్ తో పాటు అవసరమైన ఇతర పరీక్షలు చేయాలని వైద్యారోగ్య శాఖ అధికారులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. వైద్య శిబిరాల్ని కొనసాగించాలని, వ్యక్తిగత శుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించాలని సూచించారు. మరోవైపు తురకపాలెం గ్రామంలో ఉన్నప్పుడే డీఎంఈ డాక్టర్ రఘునందన్ కు ఫోన్ చేసి క్షేత్రస్థాయి సమాచారాన్ని తెలుసుకున్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467